


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


సంపుటి 09, సంచిక: 58 | సోమవారం | 26-01-2026 | ఖమ్మం Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## రాజ్యాంగం అంటే కాగితాల పుస్తకం కాదు

- దానిపై బుల్డోజర్‌ను ప్రయోగించడం అంటే మానవ హక్కులను ధ్వంసం చేయడమే
- బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ను తరిమికొట్టాలి
- ఐద్వా జాతీయ ప్యాట్రన్, ఎంపి బృందాకరత్ పిలుపు



03




పద్మవిభూషణ్‌లు

కేటీ థామస్, వీఎస్ అచ్యుతానందన్, ధర్మేంద్ర, ఎన్.రాజం, పి.నారాయణన్

# ఐదుగురికి పద్మవిభూషణ్

- 13 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు
- తెలంగాణ నుంచి ఏడుగురికి, ఆంధ్రప్రదేశ్ నుంచి నలుగురికి పద్మశ్రీలు



మురళీ మోహన్ రాజేంద్ర ప్రసాద్



దీపికా రెడి చంద్రమౌళి విజయ్ ఆనంద్ రెడ్డి

02

### ఎపి నుంచి...

1. గద్దె బాబు రాజేంద్ర ప్రసాద్ – కళారంగం
2. గరిమెల్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం) – కళారంగం
3. మాగంటి మురళీ మోహన్ – కళారంగం
4. వెంపటి కుటుంబ శాస్త్రి – సాహిత్యం, విద్య

### తెలంగాణ నుంచి....

1. గడ్డమానుగు చంద్రమౌళి – శాస్త్ర, సాంకేతికం
2. దీపికా రెడ్డి – కళారంగం
3. గుడూరు వెంకట్రావు – వైద్యం
4. కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణియన్ – శాస్త్ర, సాంకేతికం
5. కుమారస్వామి తంగరాజ్– శాస్త్ర, సాంకేతికం
6. విజయ్ ఆనంద్ రెడ్డి – వైద్యం
7. మామిడి రామారెడ్డి (మరణానంతరం) – పశుపోషణ

# విద్య, వైద్యానికి బడ్జెట్ పెంచాలి

- మహిళా హక్కులను బిజెపి సర్కారు కాలరాస్తోంది
- మహిళలకు ఉపాధి కల్పించే ఎంజి నరేగాను నిర్వీర్యం చేసింది
- నగరాల పేర్లను మార్చినంత మాత్రాన మోదీ విశ్వగురువు కాలేరు
- ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు జాతీయ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధు విమర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్

మహిళల హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) జాతీయ ప్రధాన కార్యదర్శి నిషాసిద్ధు విమర్శించారు. మహిళల నుంచి నాణ్యమైన విద్యను, వైద్యాన్ని దూరం చేస్తోందని దుయ్యబట్టారు. రానున్న కేంద్ర బడ్జెట్‌లో వైద్యం, విద్య రంగాలకు బడ్జెట్‌ను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా

తరువాయి 2లో



# అగ్నికీలల్లో ఆ ఐదుగురు ఆహుతి

- నాంపల్లిలోని ఫర్నీచర్ షాప్ అగ్నిప్రమాద ఘటనలో
- 22 గంటలపాటు సాగిన సహాయక చర్యలు
- ఐదుగురి మృతదేహాలు వెలికితీత
- ఫర్నీచర్ మాల్ యజమాని అరెస్ట్
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్

నాంపల్లిలోని ఫర్నీచర్ మాల్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో కర్ణాటకకు చెందిన వాచ్‌మెన్ సమీర్ తల్లి బీబీ అమ్మ (60), నాంపల్లికి చెందిన యాదయ్య కుమారులు అఖిల్ (7), ప్రణీత్ (11), నాంపల్లికి చెందిన మహమ్మద్ ఇంతియాజ్ (31), రాజేంద్రనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ హబీబ్ (32) ఉన్నారు. శనివారం మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమైన అగ్నిప్రమాద సహాయక చర్యలు ఆదివారం ఉదయం 11 గంటల వరకు కొనసాగాయి. భవనంలోని మొదటి సెల్లార్‌లో ఉన్న వాచ్‌మెన్ గదిలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అధికారులు విఫలయత్నం చెందారు. మరుసటి రోజు కూడా భవనంలో అగ్నికీలలు ఆవరించి ఉండడంతో జెసిబి యంత్రాల సహాయంతో అధికారులు రెండు గంటలు శ్రమించి సెల్లార్ గోడలు పగులగొట్టారు. అనంతరం ప్రత్యేక యంత్రాలు, ఆక్సీజన్ మాస్క్‌తో అగ్నిమాపక సిబ్బంది సెల్లార్‌లోకి వెళ్లి చూడగా అక్కడ ఐదుగురి మృతదేహాలు పూర్తిగా కాలిపోయి ఉన్నాయి. ఈ ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురి మృతదేహాలను వెలికి తీసి ఉస్మానియా మార్చురిలో పోస్టుమార్టం అనంతరం వారి

తరువాయి 2లో

## నీటిగుంతలో పడి ముగ్గురు చిన్నారులు మృతి

నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో ఘటన



ప్రజాపక్షం/కల్వకుర్తి

నీటిగుంతలోపడి ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లో చదువుతున్న ముచ్చర్లపల్లి గ్రామానికిచెందిన శ్రీకాంత్ రెడ్డి కుమార్తె మధుశ్రీకృతి(14)(సిరి), కుమారుడు మధుశ్రీ మాన్య (11), శ్రీకాంత్‌రెడ్డిసోదరి చంద్రకళ ప్రభాకర్‌రెడ్డి కుమార్తె ఎడ్మస్నేహ(15) సెలవులు ఉండటంతో సొంతగ్రామానికి వచ్చారు. ఆదివారం వీరందరూ శ్రీకాంత్‌రెడ్డి గ్రామానికి సమీపంలో ఉన్న వేణుగోపాల్‌రెడ్డి అనేరైతు వ్యవసాయ పొలంవద్దకు వెళ్లారు. ఆడుకుంటున్న సమయంలో వ్యవసాయపొలంలో ఉన్న

తరువాయి 2లో






# చైనాతో వాణిజ్య ఒప్పందం చేసుకుంటే..
# కెనడాపై 100 శాతం సుంకం: ట్రంప్

**వాషింగ్టన్ :** చైనాతో వాణిజ్య ఒప్పందం చేసుకుంటే నూటికి నూరుశాతం సుంకాలు విధిస్తామని కెనడా ప్రభుత్వానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శనివారం సోషల్ మీడియా ద్వారా తాజా హెచ్చరిక జారీ చేశారు. ఏడాది క్రితం ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నుండి కెనడా–అమెరికా మధ్య సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. చైనాతో వాణిజ్య ఒప్పందం చేసుకుంటే ఆ దేశం కెనడాను పూర్తిగా నమిలి మింగేస్తుందని, చైనా వస్తువులను కెనడాలో దించి ఆ సరిహద్దులోంచి అమెరికాలోకి తరలించి (డ్రాప్ ఆఫ్ పోర్ట్) తమ దేశాన్ని కలుషితం చేయాలని ప్రయత్నిస్తున్నారని ట్రంప్ విరుచుకుపడుతున్నారు. ఇలాంటి తప్పిదాలకు పాల్పడితే తమ దేశంలోకి దిగుమతయ్యే అన్ని రకాల కెనడా ఉత్పత్తులపై 100 శాతం సుంకాలు విధిస్తామని సోషల్ మీడియా వేదికగా ట్రంప్ తాజా హెచ్చరిక చేశారు. కెనడా–గ్రీన్‌లాండ్–వెనిజులా భూభాగాలలో అమెరికా జెండా పాతి ఉన్న వీడియోలను కూడా ఈ వారంలో ట్రంప్ షేర్ చేశారు. ప్రపంచ క్రమాన్ని ట్రంప్ దెబ్బతీస్తున్నారంటూ ఆయన పేరు ప్రస్తావించకుండా గడచిన మంగళవారం కెనడా ప్రధానమంత్రి దావోస్ వేదికగా చేసిన ప్రసంగం అక్కడ



హాజరైన సభ్యుల స్టాండింగ్ ఒవేషన్ (నిలబడి హర్షధ్వానాలు చేయడం)తో మారుమోగిపోవడం ట్రంప్‌కు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. దీంతో గాజా పీస్ ఆఫ్ బోర్డులో చేరాల్సిందిగా మార్క్ కార్నీకి ఇచ్చిన ఆహ్వానాన్ని ట్రంప్ ఉపసంహరించుకున్నారు.అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరిపోవాలని కెనడా పాలకుడిని ట్రంప్ ఇప్పటికే ఎద్దేవా చేశారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీని చాలాసార్లు ఆయన ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే గవర్నర్ అంటూ సంబోధించి అవమానించారు. అమెరికాలోకి కెనడా నుండి విపరీతంగా వలసలు వస్తూ ఉండటంతో ఇక కెనడా ఒక దేశంగా ఉండకుండా అమెరికాలో ఒక రాష్ట్రంగా చేరిపోవాలని ఎగతాళి చేశారు. అమెరికా అనుసరిస్తున్న వాణిజ్య విధానాలను మార్క్ కార్నీ ప్రశ్నించడంతో ఆ దేశంపై విపరీతంగా సుంకాలు పెంచారు. ఈ నేపథ్యంలో మార్క్ కార్నీ చైనా వైపు మొగ్గుచూపారు. "కార్నీ..అమెరికాపై ఆధారపడి అమెరికా కారణంగానే కెనడా మనుగడ సాగిస్తోంది, ఈసారి మీరు ఏదైనా ప్రకటన చేసేటప్పుడు ఆ విషయం గుర్తుంచుకోండి" అని దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక నుండి ట్రంప్ హెచ్చరించారు. ఆ మరునాడే మార్క్ కార్నీ మరో ప్రకటన చేస్తూ, అమెరికాపై ఆధారపడి కెనడా జీవించడంలేదని స్పష్టం చేశారు. ఈ విధంగా అమెరికా–కెనడా మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఐతే చైనా వాణిజ్యంతో సంబంధం ఉన్న శాఖ పర్యవేక్షణ చేస్తున్న కెనడా మంత్రి డొమినిక్ లేబ్లాంక్ మాత్రం ట్రంప్ విమర్శలను ఘాటుగా తిప్పికొట్టారు. చైనాతో వాణిజ్య ఒప్పందాలు జరగలేదని, కొన్ని ముఖ్యమైన సుంకాల సమస్యలను పరిష్కరించుకున్నామని ఆయన తెలియజేశారు.

# సురక్షిత బంకర్‌లోకి ఖమేనీ!

**టెహ్రాన్:** అమెరికా విమానవాహక యుద్ధ నౌకలు గల్ఫ్ ప్రాంతానికి చేరుకోవడంతో ఇరాన్‌పై దాడులు జరుగుతాయన్న ఆందోళన పెరిగింది. ఈ నేపథ్యంలో ఇరాన్ సర్వాధినేత ఆయెతొల్లా అలీ ఖమేనీని రక్షణ అధికారులు ఒక సురక్షితమైన బంకరులో ఉంచినట్లు నివేదికలు తెలియజేశాయి. అమెరికా ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడినా, ప్రత్యక్ష దాడి సంకేతాలు పంపినాగానీ పూర్తిస్థాయి యుద్ధం చేయడానికి ఇరాన్ గార్డులు సిద్ధమయ్యారు.

దేశంలోని అన్ని రంగాలను యు ద్ధ వాతావరణానికి అనుకూలంగా సన్నద్ధం చేసి ఉంచడంతో సర్వాధినేత ఖమేనీని అజ్ఞాతంలో ఒక బంకరులో ఉంచారు. ఖమేనీ కార్యాలయం నిర్వహించే బాధ్యతలన్ని తాత్కాలికంగా ఆయన కుమారుడు ఆయతుల్లా అలీ ఖమేనీ స్వాధీనం చేసుకున్నారు. ఖమేనీపై దాడి జరిగితే దానిని పూర్తిస్థాయి యుద్ధంగా పరిగణిస్తామని ఇరాన్ ఇప్పటికే పలుసార్లు అమెరికాకు హెచ్చరిక చేసిం ది. ఇరాన్‌లో డిసెంబరు చివరిలో ప్రారంభమైన ప్రజా ఉద్యమానికి అమెరికా మద్దతు ఇవ్వడంతో ఈ రెండు దేశాలమధ్య తాజా వివాదం చెలరేగింది.

**ఇరాన్ అల్లర్లలో 36,500 మంది మృతి?**

ఇరాన్‌లో గత ఏడాది డిసెంబరు 28 నుండి ఇప్పటివరకూ ప్రపంచం ఊహకు అందని రీతిలో 36,500 మంది మరణించారా? ఇంకా ధృవీకరించని నివేదికలు ఈ విషయాన్నే చెబుతున్నాయి. ఒకవేళ ఈ నివేదికకు ధృవీకరణ లభిస్తే, ఇరాన్ చరిత్రలో ఈ కరెన్సీపతన వ్యతిరేక నిరసన ఉద్య మం అత్యంత దారుణమైన మారణహోమంగా మిగిలిపోతుంది. ఇరాన్ వ్యాప్తంగా 400 నగరా లు, పట్టణాలు, గ్రామాల్లో ఉన్న 4000 ప్రాంతాలలో హింసాత్మక ఘటనలు చెలరేగాయి. ముఖ్యం గా జనవరి 8,9 తేదీలలో ఇరాన్ ప్రభుత్వం చేపట్టిన దారుణ అణచివేతలో 36,500 మంది ప్రదర్శకులు ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ పత్రాలు, ఇతర సాక్ష్యాలను సమీక్షించిన "ఇరాన్ ఇంటర్నేషనల్ ఎడిటోరియల్ బోర్డు" ప్రకటించింది. ఐతే ఈ నివేదికను అధికారికంగా ధృవీకరించలేదు.

ఇరాన్ భద్రతా ఏజన్సీలు, క్షేత్రస్థాయి నివేదికల ప్రకారమే రెండు రోజుల్లో 12,000 మంది మరణించినట్లు ధృవీకరణ ఉంది. ఈ ఏడాది జనవరి 21న ఇరాన్ పార్లమెంటుకు ఇచ్చిన నివేదిక ప్రకారం, మరణాల సంఖ్య 27,500 నుండి ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్‌కు ఇచ్చిన నివేదికలో 36,500 కంటే ఎక్కువగా ఉందని ఇంటర్నేషనల్ ఎడిటోరియల్ బోర్డు చూసిన పత్రాలు వెల్లడించాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌లో దాదాపు 400 గంటలకు పైగా విద్యుత్, ఇంటర్నెట్ సదుపాయాలు ప్రజలకు అందుబాటులో లేవు.

# మిన్నెసోటాలో మరొకరిని కాల్చి చంపిన ఐసిఇ ఏజెంట్

**మిన్నెపొలిస్ :** మిన్నెసోటా నుండి వలస ప్రజలను వెళ్లగొట్టేందుకు ట్రంప్ పంపించిన ఐసిఇ ఏజంట్లు మరో స్థానికుడిని కాల్చి చంపడంతో అక్కడ కొనసాగుతున్న నిరసనలు, ప్రజాగ్రహం పరాకాష్ఠకు చేరుకుంది. మిన్నెపొలిస్ నగరంలో అమెరికా పౌరుడు అలెక్స్ ప్రెట్టీ (37)ని ఫెడరల్ ఏజెంట్లు ఆదివారం కాల్చి చంపారు. ఆయన మిన్నెపొలిస్ వెటరన్స్ ఎఫైర్స్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు. ఈ ఘటనపై తక్షణం దర్యాప్తు జరపాలని డెమోక్రటిక్‌పార్టీ చట్టసభ్యులు డిమాండ్ చేశారు. ఐతే అతడు తమపై దాడికి యత్నించాడని వారు ఆరోపిస్తున్నారు. ప్రదర్శకులు తమ వేళ్లు కొరికేశారని అధికారులు ఆరోపిస్తున్నారు. అలెక్స్ ప్రెట్టీ బంధువులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆయనకు గన్ లైసెన్సు ఉందని, ఏనాడూ ఆయన తనవెంట గన్ తీసుకువెళ్లలేదని వివరణ ఇచ్చారు. మృతుడు అలెక్స్ ఆ ప్రాంతంలో ఎంతో కరుణా హృదయుడుగా పేరు పొందడంతో ప్రజలు ఆయన మరణంతో ఆగ్రహం చెందుతున్నారు. హోంలాండ్ భద్రతామంత్రి క్రిస్టీ నోయిమ్ మాట్లాడుతూ, అలెక్స్ ప్రెట్టీ హింసకు పాల్పడేందుకు యత్నించగా అధికారులు ఆత్మరక్షణకోసం కాల్పులు జరిపారని వివరణ ఇచ్చారు. మిన్నె



సోటా గవర్నర్ టిమ్ వాల్జ్ అవన్నీ వట్టి కల్పిత కథలని విమర్శించారు. ఈనెలారంభంలో రెనీగుడ్ (37) అనే మహిళను వలసల నిర్మూలన అధికారులు అతి సమీపంనుండి కాల్చి చంపడంతో మిన్నెసోటా అంతటా గడచిన 20 రోజులుగా వేలాదిమంది నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. తక్షణం నేషనల్ గార్డ్స్‌ను, ఫెడరల్ అధికారులను మిన్నెసోటా నుండి బయటకు పంపేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వారి డిమాండ్‌కు మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్ గట్టి మద్దతు ఇస్తున్నారు. స్థానికంగా మిన్నెసోటా ప్రభుత్వం అల్లరి మూకలను వెనకేసుకొస్తోందని, అందుకే వారు రెచ్చిపోయి చట్టబద్ధ కార్యకలాపాలు జరగకుండా అడ్డుకుంటున్నారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మిన్నెసోటా స్థానిక ప్రభుత్వం ఆందోళనకారులకు మద్దతు ఇవ్వడంవల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ట్రంప్ విమర్శించారు. అమెరికా రక్షణమంత్రి పెటా హెగ్సెత్ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెడుతూ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) ఏజంట్లకు మద్దతు ఇచ్చారు. "దేశభక్తులకు కృతజ్ఞతలు, మీరు దేశాన్ని కాపాడుతున్నారు, మీకు మేం నూటికి నూరుశాతం మద్దతు ఇస్తున్నాం, మిన్నెసోటాలో పాలకులు సిగ్గుపడాలి, వారు వీధుల్లో పిచ్చివాళ్ళలా ప్రవర్తిస్తున్నారు" అని ధ్వజమెత్తారు. మిన్నెసోటా వీధుల్లో వలసలు వచ్చిన నేరగాళ్ళు విచ్చలవిడిగా తిరుగుతున్నారని ఫెడరల్ అధికారులు ఆరోపిస్తుండగా, ట్రంప్ మిన్నెసోటాను రణరంగంగా మారుస్తున్నారని స్థానిక గవర్నర్ టిమ్ వాల్జ్ విమర్శించారు. మిన్నెపొలిస్ మేయర్ జాకబ్ ఫ్రే ఆదివారం మధ్యాహ్నం పాత్రికేయులతో మాట్లాడుతూ, నేషనల్ గార్డులు స్థానిక పోలీసులకు సహాయం చెయ్యాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఇద్దరు స్థానికులు ఐసిఇ అధికారుల కాల్పుల్లో నిర్దాక్షిణ్యంగా మరణించారని, అందువల్ల స్థానిక ప్రజల ఆవేదన, వారి భావోద్వేగాలను అర్థం చేసుకోవాలని ఆయన కోరారు.

# మయన్మార్‌లో మూడోదశ పోలింగ్..
# భారత్‌సహా పలువురు పరిశీలకులు హాజరు

**యాంగాన్ :** మయన్మార్‌లో తుది విడత (మూడోవిడత) సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఆదివారం ముగిసింది. వచ్చేనెల రెండోవారం నాటికి ఎన్నికల ఫితాలు వెలువడతాయి. ఈ ఎన్నికల్లో జుంటా సైనిక పాలకులు మద్దతు ఇస్తున్న నేషనల్ ఇంట్రెస్ట్ డవలప్‌మెంట్ పార్టీ (ఎన్‌ఐడిపి) ఏకపక్షంగా ఎన్నికల్లో విజయం సాధించే అవకాశాలు ఉన్నాయి. ఈ తుది విడత పోలింగ్ ప్రక్రియను చూసేందుకు భారత్ సహా కొందరు అంతర్జాతీయ పరిశీలకులు కూడా యాంగాన్‌కు వచ్చారు. ఎన్నికల సంఘం ఛైర్మన్ యూథాన్ సోయీ, యాంగాన్ ప్రాంతీయ మంత్రులు అంతర్జాతీయ పరిశీలకులకు ఆహ్వానం పలికి దగ్గరుండి వారికి పోలింగ్ బూత్‌లను చూపించారు. బెలారస్, కాంబోడియా, నేపాల్, ఇండోనేసియా, వియత్నాం, నికరాగువా, ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఏసియన్ పొలిటికల్ పార్టీస్ (ఐసిఎపి) ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారు. మయన్మార్ ఎన్నికల సంఘం అధికారులు, మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా



ఆరు రాజకీయపార్టీలు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని, 24.22 మిలియన్ల ఓటర్లు ఈ పోలింగ్‌లో పాల్గొనేందుకు అర్హులుగా ఉన్నారని అంతర్జాతీయ పరిశీలకులకు అధికారులు తెలియజేశారు. రాష్ట్రం, ప్రాంతీయస్థాయిల్లో 51 పార్టీలో ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని, ఈ విధంగా మొత్తం దేశ,రాష్ట్ర,స్థానిక స్థాయిల్లో 57 పార్టీలు ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్నాయని మయన్మార్ పాలక ప్రతినిధులు, ఎన్నికల అధికారులు తెలియజేశారు.వివిధ పార్టీలు 60 రోజుల పాటు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాయని తెలియజేశారు. ఓటింగ్ యంత్రాల ద్వారా చాలా ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ ఇప్పటివరకూ జరిగిందని అధికారులు తెలియజేశారు.

# బంగ్లాదేశ్‌లో మైనారిటీ యువకుడిని సజీవ దహనం

**ఢాకా :** బంగ్లాదేశ్‌లో మైనార్టీ వర్గానికి చెందిన మరో హిందూ యువకుడిని సజీవ దహనం చేశారు. జమాత్–ఎ–ఇస్లామీ పార్టీపై ఉన్న ఆంక్షలు ఎత్తివేసి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతి ఇచ్చిన తర్వాత బంగ్లాదేశ్‌లో మైనారిటీల హత్యలు పెరుగుతున్నాయి. ఢాకా సమీపంలోని నార్సింగ్డి జిల్లాలో ఈ ఘటన జరిగింది. ఒక దుకాణంలో చంచల్ భౌమిక్ (23) అనే యువకుడు నిద్రిస్తున్న సమయంలో అల్లరి మూకలు అర్ధరాత్రి దుకాణంపై దాడి చేశాయి. బయట నుండి దుకాణం తలుపులు మూసివేసి పెట్రోలు పోసి దుకాణాన్ని దగ్ధం చేశాయి. దీంతో ఆ యువకుడు దుకాణంలోపలే సజీవదహనమయ్యాడు. అధికారులు నిందితులకోసం పెద్ద ఎత్తున గాలింపు ప్రారంభించారు. ఈ గాలింపు చర్యల్లో స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సేవకులు సహకరిస్తున్నారు. గడచిన ఆగస్టు నెల నుండి బంగ్లాదేశ్‌లో మైనార్టీలను ఉద్దేశపూర్వకంగా హత్యలు చేస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కానీ హిందూ మైనారిటీలను మతం పేరుతో హత్య చేసినట్లు ఎలాంటి ఆధారాలూ లేవని యూనుస్ తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది.

## బడ్జెట్ పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సదాలక్ష్మి, ఉపాధ్యక్షులు ఎస్.ఛాయదేవి, సహాయక కార్యదర్శి ఎం.డి ఫమీద,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.హైమావతి, మాదవితో కలిసి నిషా సిద్దు మాట్లాడుతూ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, నిధులను తగ్గించిందని విమర్శించారు. నగరాల పేర్లను మార్చినంత మాత్రాన మోదీ విశ్వగురువు కాలేరని, మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించాలని, వారికి నాణ్యమైన విద్యను, వైద్యాన్ని అందించాలని, రక్షణ కల్పించాలని హితువుపలికారు. రాజస్థాన్‌లో గత ప్రభుత్వం రూ.25 లక్షల వరకు చికిత్సను అందించే అవకాశాన్ని తగ్గించి, బిజెపి ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పేరుతో కేవలం రూ.5 లక్షల వరకే చికిత్సను అందిస్తున్నారని దుయ్యబట్టారు. మణిపూర్‌లో మహిళలు, బాలికలపైన దాడులు జరిగినప్పటికీ మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదని నిషాసిద్దు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు 2030 నాటికి అమలు చేస్తామనడం విడ్డూరమన్నారు. 'సర్' పేరుతో తమకు అను కూలంగా లేని వారిని ఓటరు జాబితా నుంచి తొలగిస్తున్నారని, 14 రాష్ట్రాలలో ఓటరు జాబితా నుంచి చాలా మందిని తొలగించారని దుయ్యబట్టారు. మహిళలకు ఓటు హక్కు కూడా లేకుండా చేస్తున్నారన్నారు.

ఎన్.జ్యోతి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మహిళా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రించాలని, డ్రగ్స్‌ను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విచ్చలవిడిగా మద్యాన్ని సరఫరా చేశారని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మద్యం, డబ్బుల ప్రభావం లేకుండా చూడాలని ఆమె కోరారు. ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మహిళా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా తమ వంతు పాత్రను పోషించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు నాయకులు షహీదా, అంజమ్మ, లావణ్య, ప్రమీల, బాలమణి, సునీత, చంద్రమ్మ పాల్గొన్నారు.

# ఐదుగురికి పద్మవిభూషణ్

**న్యూఢిల్లీ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో అసమాన సేవలు అందించిన వారికి తాజాగా పద్మ పురస్కారాలు ప్రకటించింది. ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించింది. బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర, కేరళ మాజీ సిఎం అచ్యుతానందన్‌కు మరణానంతరం పద్మవిభూషణ్ ప్రకటించింది. కేరళకే చెందిన కె.టి.థామస్, సాహితీవేత్త పి.నారాయణన్‌కు కూడా పద్మవిభూషణ్ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. కళల విభాగంలో ఉత్తర ప్రదేశ్‌కు ఎన్.రాజాంకు పద్మవిభూషణ్ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ప్రముఖ గాయని ఆల్కా యాజ్ఞిక్, మాజీ గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారికి పద్మభూషణ్ ప్రకటించింది. వైద్యరంగంలో తమిళనాడుకు చెందిన కల్లిపల్లి రామస్వామి పళనిస్వామి, ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడికి పద్మభూషణ్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కళల విభాగంలో మళయాళం దిగ్గజ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. కళల రంగంలో మహారాష్ట్రకు చెందిన పీయూష్ పాండేకు మరణానంతరం పద్మభూషణ్ ప్రకటించింది. సామాజిక సేవారంగంలో తమిళనాడుకు చెందిన ఎస్‌కెఎం మయిలనందన్, కళల రంగంలో కర్ణాటకకు చెందన శకవర్ధనీ గణేష్‌కు మూడో అత్యున్నత పురస్కారం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. జార్ఖండ్ మాజీ సిఎం శిబూసోరేన్‌కు మరణానంతరం పద్మభూషణ్ ప్రకటించిన కేంద్రం, ప్రజావ్యవహారాల విభాగంలో వి.కె.మల్హోత్రాకూ ఇవ్వనున్నట్లు తెలిపింది. వాణిజ్య రంగంలో ఉదయ్ కోటక్, ప్రజా వ్యవహారాల రంగంలో కేరళకు చెందిన వల్లాపల్లి నటేషన్, క్రీడారంగంలో విజయ్ అమృతరాజ్ పద్మభూషణ్ పురస్కారాలకు ఎంపికయ్యారు.

**అన్‌సంగ్ హీరోస్‌కు కూడా!**

మొత్తం 113 పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించిన కేంద్రం, వారిలో 45 మంది అన్‌సంగ్ హీరోలను ఎంపిక చేసింది. సినీ రంగానికి సంబంధించి ప్రముఖ నటులు మురళీమోహన్ (తెలుగు), రాజేంద్ర ప్రసాద్ (తెలుగు), ఆర్. మాధవన్(తమిళ్)కు పద్మశ్రీలను ప్రకటించింది. క్రీడారంగంలో రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్, హాకీ క్రీడాకారిణి సవిత పూనియాకు పద్మశ్రీలు అందిస్తామని తెలిపింది. ఇక తెలంగాణకు చెందిన డాక్టర్ కుమారస్వామి తంగరాజ్, రామారెడ్డి మామిడి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. కుమారస్వామి తంగరాజ్ ప్రముఖ (సిసిఎంబి) శాస్త్రవేత్త. మానవ పరిణామ క్రమం, జన్యుసంబంధ వ్యాధులపై ఆయన పలు పరిశోధనలు చేసి, అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. మరోవైపు పశుసంవర్థక, పాడి పరిశ్రమకు చేసిన కృషికిగానూ రామారెడ్డికి పద్మశ్రీ పురస్కారం వరించింది.

### పద్మవిభూషణ్

ధర్మేంద్ర (మరణానంతరం)
అచ్యుతానందన్ (కేరళ) (మరణానంతరం)
కె.టి.థామస్ (కేరళ) (పద్మవిభూషణ్)
పి.నారాయణన్ (కేరళ) (సాహితీవేత్త)
ఎన్.రాజాం (ఉత్తరప్రదేశ్) (కళలవిభాగంలో)

### పద్మభూషణ్

నోరీ దత్తాత్రేయుడు (వైద్యం)– అమెరికా
మమ్ముట్టి (కళలు) – కేరళ
అల్కా యాజ్ఞిక్ (కళలు) – మహారాష్ట్ర
కల్లిపట్టి రామసామి పళనిస్వామి (వైద్యం) – తమిళనాడు
పీయూష్ పాండే (మరణాంతరం) (కళలు) – మహారాష్ట్ర
ఎస్‌కెఎం మెయిలానందన్ (సామాజిక సేవ) – తమిళనాడు
శతావధాని ఆర్ గణేశ్ (కళలు) – కర్ణాటక
శిబూ సోరెన్ (మరణాంతరం) (ప్రజావ్యవహారాలు) – జార్ఖండ్
ఉదయ్ కొటక్ (వాణిజ్యంపరిశ్రమలు) మహారాష్ట్ర
వికె మల్హోత్రా (మరణాంతరం) (ప్రజావ్యవహారాలు)– ఢిల్లీ
వెల్లప్పల్లి నటేశన్ (ప్రజావ్యవహారాలు)– కేరళ
విజయ్ అమృత్‌రాజ్ (క్రీడలు) – అమెరికా
భగత్‌సింగ్ కోశ్యారీ (ప్రజావ్యవహారాలు)– ఉత్తరాఖండ్



## చిన్నారులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

నీటిగుంతలో బంతి పడటంతో తీసుకొచ్చేందుకు వెళ్లిన మధుశ్రీమాన్య నీటిలో పడిపోయాడు. అతడినికాపాడే ప్రయత్నంలో మధుశ్రీకృతి, ఎడ్మ స్నేహ సైతం నీటిగుంతలో పడిపోయారు. అక్కడే ఉన్న వేణుగోపాల్‌రెడ్డి కుమార్తె విద్యాధరణి పిల్లలను కాపాడే ఆందోళనలో గోతిలో కాకుండా పక్కనే లోతుగా ఉన్న ఉన్నచోట పడిపోయింది. అరుపులువిని పక్కన పొలంలో పనిచేస్తున్న రాణి అనే మహిళ పరుగుపరుగున వచ్చి ప్రాణాప్రాయ స్థితికి చేరుకుంటున్న విద్యాధరణిని బయటకు తీసింది. పిల్లలు ముగ్గురు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోతున్నా వారిని కాపాడేందుకు ఈతరాకపోవడంతో శ్రీకాంత్‌రెడ్డి విలవిలలాడాడు. అప్పటికే విషయం చుట్టుపక్కల వారి ద్వారా గ్రామస్తులకు తెలియజేయడంతో అందరూ ఘటనా స్థలికి చేరుకొని నీటిగుంతలో పడి ప్రాణాలు కోల్పోయిన వారిని వెతికి బయటకు తీశారు. ఒకేరోజు ముగ్గురు పిల్లలు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

## ఆహుతి

(మొదటి పేజీ తరువాయి)

బంధువులకు అప్పగించారు. మృతుల బంధువుల రోధనలతో మార్చురి వద్ద తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.అగ్నిమాపక శాఖ, జిహెచ్‌ఎంసి, పోలీసు అధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు 22 గంటల పాటు నిరాఘటంగా కొనసాగాయి. మంటలు పూర్తిస్థాయిలో ఆదివారం 11 గంటల వరకు అదుపులోకి రావడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. ఏకదాటిక మంటలు రావడంతో భవనం నాణ్యతపై అధికారులు ప్రత్యేక బృందాలను రప్పించి పరిశీలించే పనిలో నిమగ్నమయ్యారు. వీరు ఇచ్చే నివేధిక ఆధారంగానే భవనం కూల్చాలా వద్దా అనేది ఆధారపడుతుందని అధికారులు తెలుపారు.

**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా: మంత్రి పొగులేటి**

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను మంత్రి పొగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు.ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందనకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్నిమాపక నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి, ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కఠిన నియంత్రణ చర్యలు అమలు చేస్తామని తెలిపారు.ప్రాథమిక విచారణలో షాపు యజమాని నిర్లక్ష్యం వల్లే ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్లు తేలిందని, సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జి ప్లస్ నాలుగు అంతస్తుల భవనంలో ఉన్న ఫర్నిచర్ మాల్‌లో ఎలాంటి ఫైర్ సేఫ్టిలు లేవని, నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించారని ఫైర్ డిజి విక్రమ్‌మాన్ సింగ్ స్పష్టం చేశారు.

**యజమానిని అరెస్టు చేశాం: అబిడ్స్ ఎసిపి ప్రవీణ్ కుమార్**

అగ్నిప్రమాదంలో మృతి చెందిన అఖీల్, ప్రణీత్‌ల తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆబిడ్స్ ఎసిపి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఫర్నిచర్ షాప్ యజమాని సతీష్ బచా (54)ను అరెస్ట్ చేసి , ఫైర్ యాక్సిడెంట్ కింద బిఎన్‌ఎస్ 110 యాక్ట్ కింద కేసు నమోదు చేసి , రిమాండ్ కు తరలించామని పేర్కొన్నారు. షర్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. రెండు రోజుల క్రితమే బిల్డింగ్ లిఫ్ట్ రిపేర్ జరిగింది , అందులో వైరింగ్ సమస్య వల్ల ప్రమాదం సంభవించి ఉండొచ్చు అని అనుమానిస్తున్నామన్నారు. సెల్లర్ లో ఫర్నిచర్ నిలువ ఉంచడం కారణంగా మంటలు తొందరగా వ్యాప్తి చెందాయన్నారు.సెల్లర్ లో ఉన్న వాళ్ళు పొగాకు ఉరిపి ఆడక మరణించారని తెలిపారు. త్వరలో అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు.

**బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం**

నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఫర్నిచర్ షాప్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. అగ్ని ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ప్రకటించారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించి నిబంధనలు పాటించకుండా ఘటనకు కారణమైన షాపు యజమానిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు జరగకుండా జిహెచ్‌ఎంసి, పోలీస్, రెవెన్యూ, హైడ్రా అధికారులు సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని భవనాలు ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు.

# ఘర్షణాత్మక ప్రపంచంలో భారత్ ఒక శాంతి దూత

**రాష్ట్రపతి ముర్ము గణతంత్ర దినోత్సవ సందేశం**

**న్యూఢిల్లీ :** ఘర్షణాత్మక ప్రపంచంలో భారతదేశం ఒక శాంతి సందేశ దూత అని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము అన్నారు. గణతంత్ర దినోత్సవం 77వ వేడుకల సందర్భంగా ఆమె జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ, అనేక ఖండాలలో భౌగోళిక,ప్రాదేశిక ఉద్రిక్తతల విస్తరణ మధ్య భారతదేశం ప్రపంచానికి శాంతి సందేశ ప్రచారకర్తగా ఉందని అన్నారు. మానవాళి భవితవ్యాన్ని రక్షించేందుకు ఈ శాంతి ప్రచారమే కీలకమైనదని అన్నారు. ఆపరేషన్ సిందూర్, మహిళా సాధికారత సహా వందేమాతరం, వృద్ధి చెందుతున్న దేశ ఆర్థిక వ్యవస్థ వంటి అనేక అంశాలను రాష్ట్రపతి తన సందేశంలో ప్రధానంగా ప్రస్తావించారు. సార్వత్రిక సామరస్యం కోసం ప్రపంచవ్యాప్తంగా పురాతన నాగరికతకు ఊతమిస్తూనే సమకాలీన ప్రపంచంలో భారతదేశం ఒక శాంతిదూతగా,శాంతి ప్రచారకర్త స్థానంలో ఉందని రాష్ట్రపతి పునరుద్ఘాటించారు. "మన సంప్రదాయంలో యావత్ ప్రపంచ శాంతికోసం, సార్వత్రిక శాంతికోసం ప్రార్థనలు చేస్తాం, ప్రపంచంలో శాంతి ఉన్నప్పుడే మానవాళి భవితవ్యం భద్రంగా ఉంటుంది, ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో ఇప్పుడు వాతావరణం ఘర్షణాత్మకంగా ఉంది, భారతదేశం శాంతి సందేశాన్ని విస్తరింపజేస్తోంది" అన్నారు. అదేవిధంగా ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్ విజయాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ జాతీయ భద్రతకు తాము కట్టుబడి ఉన్నామని ఉద్ఘాటించారు. సరిహద్దులు దాటి వచ్చి దాడులు చేసిన ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలను, వ్యవస్థలను ధ్వంసం చేశామని గుర్తుచేశారు. "గత ఏడాది మన దేశం నిర్దేశిత లక్ష్యాలపై గురిపెట్టి ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసింది, అనేకమంది ఉగ్రవాదులకు ప్రధానమైన వనరులుగా ఉన్న కేంద్రాలను భారత సైన్యం నాశనం చేసింది, ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది" అన్నారు. ఈనాడు భారతదేశం స్వయంసమృద్ధికే ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రక్షణరంగంలో దేశం చరిత్రాత్మకమైన విజయాలు సాధించామన్నారు. సాయుధ బలగాల శక్తి సామ ర్థ్యాలను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావిస్తూ, సియాచిన్ సైనిక కేంద్రం, సుఖోయ్ యుద్ధ విమానంలో ప్రయాణం, రాఫెల్ యుద్ధ విమాన ప్రయాణం, ఐఎన్‌ఎస్ విక్రాంత్ జలాంతర్గామిలో తన ప్రయాణ అనుభవాలను ఉటంకిస్తూ భారత సైనిక సామర్థ్యాన్ని ప్రస్తుతించారు. భూతల,గగన, సముద్రతలాలలో భారతదేశ బలగాలు సంపూర్ణ సన్నద్ధతతో ఉన్నా యన్నారు. నారీశక్తి సామర్థ్యాన్ని ఆమె ప్రశంసించారు. 2047 నాటికి లక్ష్యాలు సాధించే దిశగా దేశ ప్రయాణంలో నారీశక్తే మూలమన్నారు. దేశంలో పదికోట్ల మంది మహిళలు స్వయంసేవా సంఘాలలో సభ్యులుగా సమైక్య ఉన్నారని, గ్రామస్థాయిలో ఆర్థిక వ్యవస్థకు వారు పునర్నిర్వచనం ఇస్తున్నారన్నారు.



పంచాయతీరాజ్ వ్యవస్థలో దేశంలో 46 శాతం మహిళలు ప్రతినిధులుగా ఉన్నారని, నారీశక్తి వందన్ అధినియమ్ అనేది రాజకీయ సాధికారత అసాధారణ శిఖరాలు అధిరోహించే దిశగా వెళుతోందన్నారు. మహిళల నాయకత్వంలో దేశాభివృద్ధే జాతీయ ప్రాధాన్యత అన్నారు. గత ఏడాది భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదని, దేశానికి భారతీయ కుమార్తెలు గర్వకారణంగా నిలిచారని, వారు క్రీడారంగంలో ప్రత్యేకించి ఐసిసి మహిళా క్రికెట్ వరల్డ్ కప్ విజయం సాధించారన్నారు. టి–20లో భారత్ వరల్ కప్ సాధించింది. సాయుధ బలగాలలో, అంతరిక్ష అన్వేషణలో, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా కూడా మహిళలు గణనీయమైన విజయాలు సాధిస్తు న్నారన్నారు. బేటీ బచావో, బేటీ పఢావో ప్రచారం ద్వారా విద్యారంగంలో బాలికలు దేశవ్యాప్తంగా ముందంజలో ఉన్నారన్నారు. దేశంలో మహిళల పాత్ర, వారి భాగస్వామ్యం పెరుగు తోందని, స్త్రీ పురుష సమానత్వం ఆధారంగా సర్వసమ్మి ళితంగా ఉన్నార న్నారు. భవిష్యత్ భారతదేశ వృద్ధిలో మహిళలను వేరుచేసి చూడలేమన్నారు. పేదరిక నిర్మూలనలో భారతదేశం పరివర్తన చెందుతోందన్నారు. లక్షలమంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారన్నారు.



## భూరికార్డులపై భరోసా కల్పించేలా సర్వేయర్‌లు పనిచేయాలి

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాక్షం/రఘునాథపాలెం :** భూరికార్డులపై రైతులకు భూ యజమానులకు భరోసా కల్పించేలా సర్వేయర్‌లు పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌరసంభందాల, గృహనిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌లతో కలిసి శిక్షణ పూర్తిచేసుకున్న లైసెన్స్ సర్వేయర్లకు ధృవీకరణ పత్రాలను అందజేశారు ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తు పేద ప్రజల కష్టాలను తొలగించేందుకు ఎన్నికల సమయలో ఇచ్చిన మాట ప్రకంర ధరణి వ్యవస్థను బంగాళఖాతంలో వేసి రైతులకు చుట్టంగా ఉండే విధంగా అధ్భుతమైన భూభారతి చట్టం ప్రవేశపెట్టామని అన్నారు. భూభారతి చట్టం నియమనిభంధనలు కూడా 90 రోజుల్లో ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి మనిషికి ఆధార్ కార్డు ఉన్న విధంగా భూములకు భూదార్ ప్రవేశపెడతామని మాట ఇచ్చారు. దీనికోసం అవసరమైన మేర సర్వేయర్‌లు అందుబాటులో ఉండే విధంగా వివిధ రాష్ట్రాల్లో అధ్యయనంచేసి అందులో అత్యుత్తమ విధానాన్ని అవలంబించి సర్వేయర్‌లను ప్రవేశపెట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, డిఆర్‌ఒ ఎ పద్మశ్రీ, సర్వేయర్ అండ్ ల్యాండ్ రికార్డ్ జాయింట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడి రాజేందర్, అర్టీఐ మెంబర్ వెంకన్న, వివిపాలెం సర్పంచ్ కాపా ఆదినారాయణ, తహసీల్దార్లు, లైసెన్స్ సర్వేయర్‌లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న మహిళలకు అండగా 'షీ టీమ్స్'

### ఏడాదిలో 1,149 ఫిర్యాదులు పరిష్కారం
### క్షేత్రస్థాయిలో ఆకతాయిలపై ప్రత్యేక నిఘా
### రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన 3,826 మంది పోకిరీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నమ్మి స్నేహం చేశారు. ఆ చనువుతో కొన్ని వ్యక్తిగత ఫొటోలు పంచుకున్నారు. అదే ఇప్పుడు ఆమె మెడకు ఉచ్చులా మారింది. 'డబ్బులిస్తావా.. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టమంటావా?' అంటూ నిత్యం వేధింపులు. చావలేక, బతకలేక నరకయాతన అనుభవించిన ఆ యువతి చివరకు 'షీ టీమ్స్'ను ఆశ్రయించి విముక్తి పొందారు. మరొకరు.. రోజూ ఆఫీస్‌కు వెళ్తుంటే చాలు, నీడలా వెంటపడటం, ప్రేమించకపోతే చంపేస్తానంటూ బెదిరింపులు. ఫోన్ బ్లాక్ చేసినా కొత్త నంబర్లతో బూతులు తిడుతూ పైశాచిక ఆనందం. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ మహిళకు 'షీ టీమ్స్' అండగా నిలిచింది.

ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే కాదు, హైదరాబాద్ నగరంలో ఎంతోమంది మహిళలు అనుభవించిన మూగవేదనకు ప్రతిరూపాలు. నగరంలో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ, వేధింపులకు పాల్పడే ఆకతాయిల ఆటకట్టించడంలో హైదరాబాద్ షీ టీమ్స్ మరోసారి తమ సమర్థతను చాటుకున్నాయి. ఏడాదిలో మొత్తం 1149 ఫిర్యాదులు అందగా, వాటన్నింటినీ షీ టీమ్స్ అత్యంత బాధ్యతాయుతంగా పరిష్కరించాయి.

**బ్లాక్‌మెయిలింగ్ భూతం నుంచి 366 మందికి విముక్తి..**

ఈ ఏడాది నమోదైన కేసులను విశ్లేషిస్తే, అత్యధికంగా 366 మంది బాధితులు 'బ్లాక్‌మెయిలింగ్' సమస్యతోనే షీ టీమ్‌ను ఆశ్రయించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమై, తీయని మాటలతో నమ్మించి చనువు పెంచుకోవడం, ఆపై వీడియో కాల్స్, వ్యక్తిగత ఫోటోల ద్వారా ఉచ్చు బిగించడం పరిపాటిగా మారింది. వీడియో కాల్ మాట్లాడుతున్నప్పుడు స్క్రీన్ రికార్డింగ్ చేయడం, పంపిన ఫోటోలను సేవ్ చేసుకుని డబ్బుల కోసం వేధిస్తున్నారు. మరికొన్ని కేసుల్లో ప్రేమ విఫలమైన తర్వాత, పాత ఫోటోలను అడ్డం పెట్టుకుని మాజీ ప్రేమికులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. 'నాతో మాట్లాడకపోతే, వేరే పెళ్లి చేసుకుంటే.. మన పాత ఫోటోలు నీ కాబోయే భర్తకు పంపిస్తా' అంటూ వేధిస్తున్న 366 కేసుల్లో షీ టీమ్స్ బాధితులకు అండగా నిలిచింది.

**మఫ్టీలో నిఘా.. 3,826 మందికి కౌన్సెలింగ్..**

కేవలం ఫిర్యాదులే కాకుండా, క్షేత్రస్థాయిలోనూ షీ టీమ్స్ దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. నగరవ్యాప్తంగా 15 బృందాలు బస్టాండ్లు, కాలేజీలు, రద్దీ ప్రదేశాల్లో మఫ్టీలో నిఘా వేసి, 2025లో ఏకంగా 3,826 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో మెజారిటీ ఆకతాయిలకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇవ్వగా, తీవ్రత ఎక్కువగా ఉన్న ఘటనల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి జైలుకు పంపారు.

**మహిళల జోలికొస్తే కఠిన చర్యలు తప్పవు: హైదరాబాద్ సిపి సజ్జనార్**

'మహిళల జోలికొస్తే, ఇక మీ ఆటలు సాగవు. ముఖ్యంగా 'బ్లాక్‌మెయిలింగ్' పేరుతో ఆడబిడ్డలను భయపెట్టాలని చూస్తే, మీ భవిష్యత్తు జైలు గోడల మధ్యే అంతమవుతుంది. సోదరీమణులారా.. అధైర్యపడకండి. మీ వివరాలు బయట పడతాయన్న భయం అస్సలు వద్దు, వాటిని అత్యంత గోప్యంగా ఉంచుతాం. వేధింపులను మౌనంగా భరించకండి, ఎదురించండి. మీరు ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు.. మీకు రక్షణ కవచంలా నిలబడటానికి 'షీ టీమ్స్' ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయి. ఆపదలో ఉన్నా, వేధింపులకు గురవుతున్నా తక్షణమే డయల్ 100 లేదా షీ టీమ్స్ వాట్సాప్ నెంబర్ 9490616555 ను సంప్రదించండి.

## 10 మంది డిఎస్‌పిల బదిలీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో పలువురు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డిఎస్‌పి) స్థాయి అధికారులకు బదిలీలు, నియామకాలు చేపట్టారు.ఈ మేరకు ఆదివారం డిజిపి బి. శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయి. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సిఫారసుల మేరకు ఈ మార్పులు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.బదిలీల వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్. ఆదినారాయణ హైదరాబాద్ సిసిఎస్ నుంచి కొత్తగూడెం ఎస్‌డిపిఒగా నియామకం. షేక్ అబ్దుల్ రెహమాన్ కొత్తగూడెం ఎస్‌డిపిఒగా ఉన్న ఆయనను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.డి.వి. ప్రదీప్ కుమార్ రెడ్డి సిటిసి నుంచి అదిలాబాద్ ఎసిపిగా బదిలీ. ఎం.ఆది మూర్తి సిఐడి నుంచి మియాపూర్ ట్రాఫిక్‌కు బదిలీ. ఎస్. చక్రపాణి – మల్కాజ్‌గిరి నుంచి జవహర్ నగర్ ఎసిపిగా మార్పు. బి. మోహన్ కుమార్ ఎస్‌బి నుంచి మేడిపల్లి ఎసిపిగా బదిలీ. రవీందర్ టాస్క్‌ఫోర్స్ ఎసిపి సిద్దిపేట నుంచి భువనగిరి ఎస్‌డిపిఒగా నియామకం.సిహెచ్. శ్రీధర్ నార్కోటిక్ బ్యూరో నుంచి మలక్‌పేట్ ఎసిపిగా బదిలీ ఎస్. సరంగపాణి తెలంగాణ పోలీసు అకాడమీ నుంచి యల్లందు ఎస్‌డిపిఒగా బదిలీ. ఎన్. చంద్ర భాను యల్లందు ఎస్‌డిపిఒగా ఉన్న ఆయనను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. బదిలీ అయిన అధికారులను సంబంధిత యూనిట్ అధికారులు రిలీవ్ చేసి, కొత్త పోస్టింగ్ ప్రాంతాల్లో విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని డిజిపి ఆదేశించారు.

## మహేష్ గౌడ్ గురించి మాట్లాడే స్థాయి కవితకు లేదు

### టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తాడు బొంగరం లేకుండా, గమ్యం లేని ప్రయాణం చేస్తున్న కల్వకుంట్ల కవిత, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌ని తన పార్టీలో చేరితే పదవి ఇస్తాననీ అనడం ఆమె స్థాయికి తగ్గ మాటలు కావని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ చురకలు అంటించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కవితకు తెలంగాణ రాజకీయాల్లో స్థానం ఉండదని, తెలంగాణ సమాజం ఆమెను నమ్మదని అన్నారు. తన స్థాయికి మించి మాటలు మాట్లాడితే సహించమన్నారు.



## జాతీయ నాస్తిక మేళా కరపత్రం విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గుంటూరు జిల్లా మంగళగిరిలోని చార్వాక ఆశ్రమంలో జరగనున్న జాతీయ నాస్తిక మేళాను జయప్రదం చేయాలని కోరుతూ వివిధ ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక సభ్యులు వామన కుమార్, వెంకటేశ్వర్లు, నాస్తిక సమాజం రాష్ట్ర నాయకులు దనగల్ల రవికుమార్, బంద్రపల్లి ఆంజనేయులు, ఆనంద్ కుమార్, అజయ్ కుమార్, సదానంద, మక్తల్ నాయకులు పోలప్ప, నర్సప్ప, సంఖ్యా పాల్గొని మేళా కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా రాఘవాచారి మాట్లాడుతూ వచ్చేనెల 14, 15వ తేదీలలో చార్వాక హాశ్రమము, మంగళగిరి గ్రామంలో 34వ జాతీయ నాస్తిక మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేళాను అభ్యుదయ రచయితలు, మేధావులు, విద్యార్థులు, ప్రజాస్వామిక వాధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఓటు హక్కు వినియోగంతో ప్రజాస్వామ్య వృద్ధి

### 16వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
### ఉత్తమ ఎన్నికల అధికారులకు అవార్డుల ప్రదానం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజలు తమ ఓటు హక్కును చురుకుగా వినియోగించుకొన్నప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని "నా భారతదేశం, నా ఓటు – భారత ప్రజాస్వామ్య హృదయంలో పౌరుడు" అనే థీమ్‌తో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువ ఓటర్లకు ఇపిక్ ఓటర్ ఐడి కార్డులను పంపిణీ చేశారు. ఎన్నో ఏళ్లుగా ఓటు వేస్తున్న సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సన్మానించారు. దీనికి ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విచ్చేయగా, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వర్చువల్‌గా పాల్గొన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల కల్పించడం, అర్హులైన ఓటర్లకు ఇంటి నుంచే ఓటు వేయించడం, ఎన్నికలను మరింత సమగ్రంగా నిర్వహించే సాంకేతికత చొరవను ప్రశంసనీయమన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక సందర్భంగా డ్రోన్ నిఘాను వినూత్నంగా ఉపయోగించడాన్ని అభినందించారు. జ్ఞానేశ్ కుమార్ వర్చువల్‌గా తన సందేశాన్నిస్తూ 1950 జనవరి 25న భారత ఎన్నికల సంఘం స్థాపించారు. దేశ ఎన్నికల వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. యువ ఓటర్లు సమాచారం, నైతిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, ప్రజాస్వామ్యానికి రాయబారులుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమగ్రత, పారదర్శక బలోపేతానికి అనేక చర్యలు చేపట్టామన్నారు. అనంతరం గవర్నర్ ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో అద్భుత పనితీరు కనబరిచిన అధికారులకు ఉత్తమ ఎన్నికల పద్ధతుల అవార్డులు–25 ప్రదానం చేశారు. కరీంనగర్ కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారిణి ఐఎఎస్ పమేలా సత్పతికి, జనగామ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషాషేక్‌కు, వరంగల్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సత్య శారదతోపాటు వివిధ జిల్లాల ఎన్నికల అధికారులకు అవార్డులు అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, అధికారులు పాల్గొన్నారు.



## ఎపిజె అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి

### అవార్డుల ప్రదానోత్సవంలో ఫిరోజ్ ఖాన్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** దేశవ్యాప్తంగా విద్య, యువత అభివృద్ధికి దివంగత మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం చేసిన సేవలు మరువలేనివని టిపిసిసి ప్రధానకార్యదర్శి ఎండి.ఫిరోజ్ ఖాన్ కొనియాడారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎపిజె అబ్దుల్ కలాం రూరల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సయ్యద్ శిరిన్ సుల్తాన ఆధ్వర్యంలో ఎపిజె అబ్దుల్ కలాం ప్రతిభా అవార్డుల –2025–26 ప్రదానోత్సవం జరిగింది. దీనికి ముఖ్యతిథిగా హాజరైన ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆయన జీవితంలో ఎక్కువ సార్లు విద్యార్థులతో గడుపుతూ వారిని సరైనమార్గంలో నడిచేలా తపించారన్నారు. నిస్వార్థసేవ చేసిన ఆ మహానీయుడు ప్రజల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 40 మందికి అబ్దుల్ కలాం అవార్డులు అందజేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐపిఎస్ హిసన్ రజ, సికిందర్ మసూకి, శాస్త్రవేత్త డా.స్వామి, షఫీ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో 'పెద్ద చేప'ను కాపాడేందుకే బిఆర్ఎస్ డ్రామాలు

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణిలో మేఘా కృష్ణారెడ్డి అనే 'పెద్ద తిమింగలాన్ని' రక్షించేందుకు బిఆర్ఎస్ సృజన్‌రెడ్డి అనే 'చిన్న చేప' చుట్టూ టెండర్ల వ్యవహారాన్ని తిప్పుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రూ. మేఘా సంస్థకు రూ. 25 వేల కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చే ప్రయత్నం జరుగుతున్నా బిఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సృజన్ రెడ్డికి గతంలో బిఆర్ఎస్ హయాంలోనే కాంట్రాక్టులు ఇచ్చారని, అప్పుడు ఆయన రేవంత్ రెడ్డి బావమరిది అని గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ చిన్న చేప చుట్టూ కథ తిప్పుతూ పెద్ద తిమింగలాన్ని రక్షిస్తున్నారని విమర్శించారు. కార్మికులకు ఇబ్బందులు ఎదురైతే కాంగ్రెస్, బిఆర్ఎస్ స్పందించలేదని, కానీ పెద్ద కాంట్రాక్టర్‌కు టెండర్ రాకపోతే మాత్రం ముందుకు వస్తున్నాయని విమర్శించారు. సింగరేణిలో అమలు చేస్తున్న ఎండిఓ విధానం వల్ల సంస్థకు నష్టాలు వస్తున్నాయని, దానిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ హయాంలో సింగరేణిపై రూ.25 వేల కోట్ల అప్పులు పెరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అవి రూ.50 వేల కోట్లకు చేరాయన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం జోక్‌గా మారిందని, బాధితులకు న్యాయం జరగడం లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసమే ప్రభుత్వం ఈ అంశాన్ని డ్రామాగా మార్చిందని విమర్శించారు. టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు కవిత 'ఓపెన్ ఆఫర్' ఇచ్చారు. ఆయనకు అనుభవం ఉంది కాబట్టి, తమ పార్టీలోకి వస్తే ఆయనకు 'నేషనల్ కన్వీనర్' పదవి ఇస్తాను అని అన్నారు. తాను కాంగ్రెస్‌లో చేరుతానంటూ మహేశ్ గౌడ్ చేస్తున్న వ్యాఖ్యలను కవిత కొట్టిపారేశారు. 'కాంగ్రెస్ అనేది ఒక ఓడిపోయే పార్టీ అని, అలాంటి పార్టీలో నేను ఎందుకు చేరుతాను అని ప్రశ్నించారు.

**హరీశ్‌రావుపై 'గుంటనక్క' విమర్శలు ...**

మాజీ మంత్రి హరీశ్ రావుపై కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయనను 'గుంటనక్క'గా సంబోధిస్తూ ఘాటు విమర్శలు చేశారు. హరీశ్ రావు తవ్విన గుంతలో కెటిఆర్ పడటం బాధాకరమని కవిత వ్యాఖ్యానించారు. హరీశ్ మాటలు నమ్మి కెటిఆర్ కూడా అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. తెలంగాణ జాగృతి మాత్రం ఎప్పటికీ సింగరేణి కార్మికుల పక్షాన పోరాడుతుందని, జాగృతి తరఫున ఒక ప్రత్యేక ప్రతినిధి బృందం నైనీ బ్లాక్‌ను సందర్శిస్తుందని కవిత తెలిపారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు.. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉగ్రవాదుల ముప్పు ఉందని కేంద్ర నిఘా సంస్థలు హెచ్చరికలు జారీ చేయడంతో ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వేడుకలు నిర్వహించే సికింద్రాబాద్ పరే గ్రౌండ్‌లో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. వేడుకలను వీక్షించేందుకు వచ్చే ప్రతి ఒక్కరిని మెటల్ డిటెక్టర్ ద్వారాల గుండానే రావాలని పోలీసులు సూచించారు. వేదికతో పాటు పార్కింగ్ ప్రదేశాలలో కూడా ముందు జాగ్రత్త చర్యగా బాంబ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీ చేశారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా ఉండేందుకు హైదరాబాద్ నగర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. వివిధ జిల్లాల నుంచి అదనపు పోలీసు బలగాలను నగరానికి తరలించి, పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. ముఖ్యమైన రహదారులు, కూడళ్ల వద్ద నిఘా పెంచడంతో పాటు, వాహనాల తనిఖీలు, అనుమానితులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా సిసిటివి కెమెరాల ద్వారా పర్యవేక్షణ, డ్రోన్ నిఘా, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నారు. విఐపి, వివిఐపి కదలికలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక భద్రతా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్ ఆంక్షలను పాటించాలని పోలీసులు కోరారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని అధికారులు స్పష్టం చేశారు.దీంతో పాటు రైల్వే, బస్ స్టేషన్‌లలో ప్రత్యేక దృష్టి సారించారు.

## రాజ్యాంగంపై బుల్డోజర్ నడిపించేందుకు బిజెపి సర్కార్‌యత్నం

### మానవ హక్కులు కాపాడుకోవాలంటే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ను తరిమికొట్టాలి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో మానవ హక్కులను కాపాడుకోవాలంటే బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్‌ను తరిమి కొట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ ప్యాట్రన్, ఎంపి బృందాకరత్ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగంపైన బుల్డోజర్ నడిపించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, రాజ్యాంగం అంటే ఒక కాగితాల పుస్తకం కాదని, ఆ పుస్తకంపైన బుల్డోజర్‌ను ప్రయోగించడమంటే, మానవ హక్కులనే బుల్‌డోజ్ చేయడమని తెలిపారు. ప్రజ అనుకూల విధానాలతో కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం దేశానికే వెలుగునిచ్చే పాలనను అందిస్తోందన్నారు. ఐద్వా జాతీయ 14వ మహాసభలో భాగంగా హైదరాబాద్‌లోని బస్‌భవన్‌మైదానంలో ఆదివారం ఐద్వా బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పి.కె. శ్రీమతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బృందాకరత్ ప్రసంగిస్తూ మహిళా ఉద్యమానికి తెలంగాణ గడ్డ స్ఫూర్తినిచ్చిందన్నారు. మహిళా హక్కులు అంటేనే మానవ హక్కులు అని, అలాంటి మహిళా హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. మహిళలకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ అత్యంత ప్రమాదకరమన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం హత్య చేసిందని, ఆ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించుకునేందుకు పోరాడాలని సూచించారు.మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని, ఇందుకు ఆర్‌ఎస్‌ఎస్ మహిళలు ప్రచారం చేస్తున్నారని, మైనార్టీలు,దళితులపైన దాడులు జరుగుతున్న పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ప్రధాని మోదీ చేసే సెల్యూట్ ప్రజలకు, రాజ్యాంగానికి కాదని, ఆ వేదిక నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌కు సెల్యూట్ చేస్తారన్నారు. పి.కె.శ్రీమతి మాట్లాడుతూ అన్ని రంగాల్లో కేరళ మొదటి స్థానంలో నిలిచిందని, డబల్ ఇంజన్ సర్కార్‌గా చెప్పుకునే బిజెపి పాలిత రాష్ట్రాలు ఎందుకు ముందు వరుసలో నిలువలేదని ప్రశ్నించారు. అత్యంత పేదరికం లేని రాష్ట్రంగా కేరళ నిలిచిందన్నారు. ఐద్వారాష్ట్ర ప్రధానకార్యదర్శి మరియందేవ్‌లే మాట్లాడుతూ భారతదేశాన్ని రక్షించుకునేందుకు మహిళలందరూ పోరాటం చేసేందుకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం, మానవ హక్కుల కోసం పోరాడుతున్న వారికి బెయిల్ రాదని, కానీ మహిళలపై దాడులకు,హత్యలకు పాల్పడే వారికి త్వరగా బెయిల్ లభిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా జాతీయ మహాసభల రిసెప్షన్ కమిటీ గౌరవాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ పురుషుల కంటే ఎక్కువగా మహిళలు శ్రమపడుతున్నప్పటికీ వారికి గుర్తింపు లేక, అసమానతలకు గురవుతున్నారన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ మహిళలను పిల్లలను కనే ఒక యంత్రాలుగా పరిమితం చేయాలన్న సంఘ్ పరివార్ కుట్రలను పారనివ్వబోమన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి మాట్లాడుతూ మహిళా హక్కులను కాపాడే దిశగా మహాసభల్లో తీసుకునే నిర్ణయాలను అమలు చేస్తామని అన్నారు. అంతకుముందు ఐద్వా ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి నుంచి ఆర్‌టిసి బస్‌భవన్ మైదానం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.




## మహిళా హక్కులు కాగితాలకే పరిమితం

### సినీ నటి రోహిణి



దేశంలో మహిళా హక్కులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, వారిపై ఆంక్షలు, వివక్ష ఇంటి నుంచే మొదలవుతున్నాయని, అందుకే ఇంటి నుంచే మార్పు ప్రారంభంకావాలని ప్రముఖ రచయిత, సినీనటి ఎం.రోహిణి అన్నారు. మహిళలు పోరాటాల ద్వారానే సమానత్వాన్ని సాధించగలరన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభలు హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళ్యాణ మండపంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. అంతకుముందు ఐద్వా జెండాను పికె శ్రీమతి ఆవిష్కరించారు. అనంతరం అమరులకు నివాళులర్పించారు. మహాసభలకు ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు పి.కె శ్రీమతి అధ్యక్షత వహించగా రోహిణి మహాసభ ప్రారంభోపన్యాం చేయగా, ఐద్వా మహాసభల ఆహ్వాన సంఘం చైర్‌పర్సన్ శాంతా సిన్హా స్వాగతోపన్యాం చేశారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) జాతీయ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధు, ఐద్వా జాతీయ ప్యాట్రన్ బందాకరత్, ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం దావ్‌లే, జాతీయ కార్యదర్శి ఎస్.పుణ్యవతి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రోహిణి మాట్లాడుతూ యువతరం సామ్రాజ్యవాద ప్రమాదాన్ని గమనించాలని, ఆ దిశగా వారిని చైతన్యవంతం చేయాల్సిన బాధ్యతను మహిళలే తమ భుజస్కందాలపై వేసుకోవాలని సూచించారు. శాంత సిన్హా మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమానత్వం,తమ హక్కుల కోసం మహిళలందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఏ ఒక్కరూ ఓటును అమ్ముకోవద్దని సూచించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించుకునేందుకు జాతీయ స్థాయిలో పోరాటాన్ని కొనసాగించాలన్నారు. బృందాకరత్ మాట్లాడుతూ రానున్న పలు రాష్ట్రాల్లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో వామపక్ష, ప్రజాస్వామిక శక్తులకు మద్దతుగా ఐద్వా ముందు ఉంటుందన్నారు. ఇటీవల కేరళకు వెళ్లిన ప్రధాని మోదీ అభివృద్ధిని ఉద్దేశించి మాట్లాడడం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) జాతీయ ప్రధాన కార్యదర్శి నిషా సిద్దు మాట్లాడుతూ మహిళల హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. సామ్రాజ్యవాదం పెరిగిపోతుందని, గజాలో అమానీయ పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఆహారం లభించని పరిస్థితులు నెలకొన్నాయని, సహాయం చేసేవారిపైన కూడా ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతోందన్నారు. అమెరికా సామ్రాజ్యవాద దాడులకు పాల్పడుతోందని దుయ్యబట్టారు.




## కాంగ్రెస్ ఓ సెక్యులర్ పార్టీ

### ఎఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట** : కాంగ్రెస్ ఓ సెక్యూలర్ పార్టీ అని మైనార్టీలకు పెద్దపీట వేస్తోందని ఎఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలు చూస్తున్నారని, ఈ అభివృద్ధియే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించి తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేగాక మైనార్టీలంతా ఏకతాటిపై ఉండి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా 34వ వార్డులోని మాజీ కౌన్సిలర్ యూసఫ్‌తోపాటు సుమారు 50 మంది కార్యకర్తలు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్‌ల సమక్షంలో పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ ఆధ్వర్యంలో చేరగా సర్వోత్తమ్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు గౌస్, సాజిద్ నీడ్స్, ఖాజా యూసుఫుద్దీన్, ఖమ్రుద్దీన్, ఇమ్రానుద్దీన్, శంసోద్దీన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల కళ్లల్లో ఆనందమే ప్రభుత్వ ధ్యేయం


### గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండలం మాందాపురం గ్రామంలో నూతనంగా 25 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాందాపురం సర్పంచ్ దంతూరి యాదమ్మ ఆంజనేయులు గౌడ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తుందని పేద ప్రజల కళ్ళలో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. అనంతరం 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు గరిసె రవి, మాజీ ఎంపీటీసీ వంగాల అశోక్ గౌడ్, బత్తిని సహదేవ్ గౌడ్, మాందాపురం ఉప సర్పంచ్ కుసంగి రాములు, వార్డ్ మెంబర్లు గ్రామపంచాయతీ స్థల దాతలు సోలిపురం ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రథమ పూజిత మహా గణపతి పూజతో ఉత్సవశోభ

### బ్రహ్మోత్సవాలు ప్రారంభించిన ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి** : తెలంగాణలో రెండవ శ్రీశైలంగా ప్రసిద్ధక్షేత్రంగా పేరొందిన చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభంతో చెర్వుగట్టుకు ఉత్సవ శోభ సంతరించుకుంది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథులుగా హాజరై బ్రహ్మోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. అతిథులకు ఆలయ సంప్రదాయాల ప్రకారం ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ,ఆలయ ఈ వో మోహన్ బాబు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం దేవాలయ మహా మండపంలో యాగ్నికులు సుబ్రహ్మణ్య దీక్షితావదాని మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవాల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మొదట యాగ ప్రదక్షణ, గణపతి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గర్భగుడిలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో చెర్వుగట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ వారాల రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, ధర్మకర్తలు, యువజన నాయకుడు వడ్డే భూపాల్ రెడ్డి,స్థానిక సర్పంచ్ నేతగాని కృష్ణ, నాయకులు శశిధర్ రెడ్డి పాల్గొన్నారు.

## అక్రమ నిర్బంధమే రాజేష్ ప్రాణం తీసింది

### ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సూర్యాపేట జిల్లాలో సంచలనం సృష్టించిన కర్ల రాజేష్ మృతి కేవలం పోలీసుల అక్రమ నిర్బంధం వల్లే జరిగిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణ కేంద్రంలోని పద్మశాలి భవనంలో నిర్వహించిన అఖిలపక్ష నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోదాడ పట్టణానికి చెందిన కర్ల రాజేష్ మృతికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, బాధితుల తరుపుననాయకులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై తక్షణమే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్ ) ఏర్పాటు ఏసి పోలీస్‌శాఖ గౌరవాన్ని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. విచారణలో పారదర్శకత ఉండాలంటే, సూర్యాపేట జిల్లాలకు చెందిన ఏ ఒక్క పోలీస్ అధికారి (హోంగార్డు నుండి ఎస్పీ వరకు)సీట్ బృందంలో ఉండకూడదని వారు డిమాండ్ చేశారు. ఇతర జిల్లాలకు చెందిన నిష్పక్షపాత అధికారులతో విచారణ జరిపించాలని డిజిపిని కోరారు.

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మౌనం వీడాలి..?** సూర్యాపేట జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని వారు ప్రశ్నించారు. గతంలో మరియమ్మ లాకప్‌డెత్ జరిగినప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి పోలీసుల అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడామని, గవర్నర్, ముఖ్యమంత్రికి లేఖలు కూడా రాశామని పేర్కొన్నారు.

**ప్రధాన డిమాండ్లు....?** సురేష్‌రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని బాధితులకు ప్రభుత్వం అండగా ఉండి న్యాయం చేయాలన్నారు. ఒక వేళ ప్రభుత్వం త్వరితగతిన స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజేపి రాష్ట్ర నాయకులు శానంపూడి సైదిరెడ్డి, బొబ్బా భాగ్యరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు జక్కుల నాగేశ్వరరావు, బెల్లకొండ అమర్‌గౌడ్, నాయకులు దూళిపాళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఓటుహక్కు శక్తివంతమైన ఆయుధం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఓటు హక్కు శక్తివంతమైన ఆయుధమని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.16 వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కు వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం వహించవద్దని,ప్రతి ఓటరు చైతన్యం కావాలన్నారు.దేశంలో యంగ్ ఇండియన్స్‌ను చైతన్యం చేసేందుకు వివిధారకాల ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవలి గ్రామ పంచాయతీ ఎన్నికలలో జిల్లాలో80 శాతం ఓటర్లు ఓటు వేశారని,అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్ లో 60 శాతం ఓటర్లు మాత్రమే ఓట్లు వేశారన్నారు. జిల్లాలో గ్రామ స్థాయిలో ని ప్రతి ఓటరు ను నమోదు చేసి ఎస్ఐఆర్ 74 శాతంపూర్తి చేసినందుకు జాతీయస్థాయిలో అవార్డు రావడం పట్ల ఈఆర్వోలను, బిఎల్ఓ లను అభినందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు సండే సైకిల్ అనే నినాదంతో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రారంభిస్తూ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటరు అవగాహనతో పాటు, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో సైకిల్ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి,రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రభాకర్, ఈఆర్వోలు, బిఎల్ఓలు,విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.



### ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలి :

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం 6 ద్వారా ఓటు నమోదు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు సూర్యాపేట జిల్లా అధికారులు, సిబ్బంది, స్కూల్, కాలేజీ విద్యార్థులు, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ క్యాడట్లు మందడి ఏవిన్యూ నుండి ఓటు యొక్క ప్రాముఖ్యత తెలియజేస్తూ ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ చేరుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఫారం 6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు కోసం కృషి చేసిన అధికారులకు, సిబ్బందికి, స్వచ్ఛంద సంస్థలకు ప్రశంసా పత్రాలు, షిల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వేణుమాధవ్, డిఇఓ అశోక్, డిఎస్‌పి ప్రసన్నకుమార్, సామాజిక పర్యావరణవేత్త సత్యనారాయణ, తహశీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



### ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

**ప్రజాపక్షం/యాదాద్రి** : ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలని స్థానిక సంస్థల, రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. ఆదివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ నుండి పట్టణ పుర విధులగుండా ర్యాలీ నిర్వహించారు. 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని, ర్యాలీలో జిల్లా అధికారులు, సీనియర్ సిటిజన్స్, ప్రజా ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## రాళ్ల జనగాంలో 'పులి' కలకలం దూడ మృతి!

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

### డ్రోన్ కెమెరాలతో గాలింపు చేపట్టాలని అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : యాదగిరిగుట్ట మండలం రాళ్ల జనగాం గ్రామ పరిధిలో పులి సంచారం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. గ్రామ శివార్లలోని ఓ వ్యవసాయ బావి వద్ద పులి దాడి చేసి ఒక దూడను హతమార్చింది. ఈ విషయం తెలియగానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వెంటనే స్పందించి, సంఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. పులి దాడిలో పశువును కోల్పోయిన బాధిత రైతును ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రభుత్వం తరపున బాధిత రైతుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అటవీ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి, తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామస్తులు ఎవరూ భయపడవద్దు, కానీ అప్రమత్తంగా ఉండాలని, పులి జాడను కనిపెట్టేందుకు డ్రోన్ కెమెరాలు, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టాలని అధికారులను ఆదేశించాం. బీర్ల అయిలయ్య, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గ్రామంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఎమ్మెల్యే గ్రామస్తులకు రైతులు, కూలీలు చీకటి పడకముందే ఇళ్లకు చేరుకోవాలి. పశువులను రాత్రి వేళల్లో సురక్షితమైన పాకలలో ఉంచాలి. ఒంటరిగా అటవీ ప్రాంతం లేదా వ్యవసాయ బావుల వద్దకు వెళ్లకూడదు. ప్రస్తుతం అటవీ శాఖ అధికారులు గ్రామంలో మోహరించి, పులి అడుగుజాడలను బట్టి అది ఏ ప్రాంతానికి వెళ్లిందో గుర్తించే పనిలో పడ్డారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట టౌన్ సిఐ భాస్కర్, దాతరుపల్లి సర్పంచ్ సరిత భాస్కర్, రాళ్ల జనగాం సర్పంచ్ తుమ్మల జ్యోతినాగరాజు, మాజీ సర్పంచ్ తెలుజూరి శ్రీశైలం, వార్డు మెంబర్లు పాండురాజు కమలాకర్, తుమ్మల సురేష్, తుమ్మల లక్ష్మ ణ్, పొన్నాల పాండు, జిల్లా ఈదాలు, బాలరాజ్, రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ప్రాణ రక్షణ కవచంలా భావించాలి

### మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్‌రాజు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్‌ను, ఫోర్ వీలర్ నడిపేవారు సీట్ బెల్ట్‌ను భారంలా కాకుండా ప్రాణరక్షణ కవచంలా భావించాలని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎస్వీ గార్డెన్స్‌లో నిర్వహించిన జనయేత్రి ఫౌండేషన్ ఐదవ వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు కాదు మంచి సంస్కారం ఇవ్వాలన్నారు. ఒక చిన్న నిర్లక్ష్యం కుటుంబం మొత్తాన్ని కోలుకోలేని విధంగా దెబ్బ తీస్తుందని అన్నారు. జనయేత్రి ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలకు పోలీసుల సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ప్రజలందరు పోలీసువారికి సహకరించి, ప్రయాణాల్లో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ప్రపంచ ప్రఖ్యాత బ్లడ్ డోనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ జనయేత్రి ఫౌండేషన్ విద్యా, వైద్యంలో మరిన్ని సేవలు అందించాలన్నారు. యువత రక్తదానాలు చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. హాస్య నటుడు సుమన్ శెట్టి మాట్లాడుతూ గతంలో డాక్టర్లే దేవుళ్లుగా భావించేవారని, ప్రస్తుతం పేద ప్రజలకు ఫౌండేషన్ ద్వారా సేవలు అందిస్తున్న వారే నిజమైన దేవుళ్లని అన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ కుల, మత, వర్గ, వైషమ్యాలకు తావు లేకుండా సహృదయంతో సేవానిరతిని పాటిస్తూ నిస్వార్థంగా పేదలకు, నిరుపేద విద్యార్థులకు, రోగులకు, ఆర్తితో తల్లడిల్లే అభాగ్యులకు సహాయ, సహకారాలు ఫౌండేషన్ ద్వారా అందిస్తున్నామన్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ సాజిదా ఖాన్, లింగారెడ్డి, అజ్మత్‌ఖాన్, శ్రీనివాస్‌రావు, చిలుముల బాల్‌రెడ్డి, పొనుగోటి హనుమంతరావు, జాజాల కృష్ణ, దయాకర్‌రెడ్డి, సయ్యద్ అజ్మత్, గాదె నరసింహా, కోట సైదులు, కిశోర్‌కుమార్, తాజ్ బాబా పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

### పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా:మంత్రి

**ప్రజాపక్షం/నల్లగొండ** : మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో 48 డివిజన్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర రోడ్లు,భవనాలు,గ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో పోటీ చేసే పలువురి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పేర్లను ఆదివారం మంత్రి ప్రకటించారు.ఈసందర్భంగా కార్పొరేషన్‌లోని 6వ డివిజన్లో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టి 25,41,19 డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమాలలో పాల్గొన్నారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే కార్పొరేషన్ ఎన్నికలలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలన్నారు.మున్సిపల్ కార్పొరేషన్‌లోని 48 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నందున పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ హాఫీజ్ ఖాన్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్,తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,డిసిసిబి మాజీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు జూలకంటి శ్రీనివాస్,కర్నాటి కరుణాకర్ రెడ్డి, కేసాని వేణుగోపాల్ రెడ్డి,గోగుల గణేష్,లోకేశ్వరి రెడ్డి,కత్తుల వెంక పాల్గొన్నారు.

## పోలీస్ పరేడ్ గ్రౌండ్ సిద్ధం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. జనవరి 26వ తేదీన జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు జిల్లా పోలీసు కార్యాలయం నందు నూతన పరేడ్ గ్రౌండ్ సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం గణతంత్ర దినోత్సవ పరేడ్ (ప్రాక్టీస్) రిహార్సల్‌ను ఎస్‌పి పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని వేడుకలకు హాజరయ్యే పౌరులకు అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. పరేడ్ కమాండర్‌గా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ వ్యవహరించ నున్నారు. ఎస్‌పి వెంట అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, డిఎస్‌పి నరసింహారావు, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఆర్ఐలు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

## యూరియా బుకింగ్ యాప్‌ని మండలానికి పరిమితి చేయాలి

**ప్రజాపక్షం/మునుగోడు:** గత డిసెంబరు 20 నుండి బుకింగ్ ద్వారా యూరియా రైతులు బుక్ చేసుకోవాలని ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ వలన రైతులకు చాలా ఇబ్బందికరంగా మారడంతో రైతులు రైతు సంఘాల నాయకులు ధర్నాల ద్వారా జిల్లా మంత్రి సూచన మేరకు వ్యవసాయ అధికారులు జిల్లా కాకుండా నియోజకవర్గం వారిగా యూరియా యాప్ ద్వారా తెచ్చు కోవాలని ప్రకటించారు.నియోజకవర్గమని నిబంధన ఎత్తివేసి ఏమండలానికి ఆ మండలం రైతులకు యూరియా సప్లై చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుజ రామచంద్రం డిమాండ్ చేశారు. రైతులు ఒక్క బస్తా రెండు బస్తాలకు నియోజకవర్గంలో ఏం మండలానికి పోవాలన్నమునుగోడు నుండి మర్రిగూడెం పోవాలంటే సుమారు 40 కిలోమీటర్లు దూరం పోవాల్సిన అవసరం ఉంటుందని వేరే మండలానికి రైతులు పోవడానికి అందరికీ వాహన సౌకర్యం లేక ప్రైవేటు వాహనాలు కిరాయికి తీసుకొనిపోతే కిరాయి భారం రైతులకు పడుతుందన్నారు.

## ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల కేంద్రంలో ఉన్న ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా చింతారెడ్డి గోపిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె గులాం హుస్సేన్, ఉపాధ్యక్షులుగా రమణ, రాకేష్, సహాయ కార్యదర్శిగా షేక్ అబ్దుల్ రహీం, కోశాధికారిగా రాజశేఖర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. వారితో పాటు గౌరవాధ్యక్షులుగా వై ప్రసాద్, గౌరవ సలహాదారులుగా ఎస్‌కె మక్బూల్ పాషా, కార్యవర్గ సభ్యులుగా సంజీవరెడ్డి, ఉదయ్ కుమార్, వీరబాబు, నరేందర్ రెడ్డి, మోతిరామ్, నరేష్, హనుమా రెడ్డి, నబి, రసూల్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గోపిరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై ఐక్యంగా పోరుడుతూ, ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించడమే ప్రెస్‌క్లబ్ ప్రధాన లక్ష్యమన్నారు. సభ్యులందరి సహకారంతో ప్రెస్‌క్లబ్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

## చైర్మన్ పీఠానికి బిఆర్ఎస్‌లో పోటాపోటీ

### డజన్‌కు పైగానే ఆశావహులు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో తమసత్తా చాటాలని బిఆర్ఎస్ తహతహ లాడుతుంది. మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజగ వర్గంలోని సూర్యాపేట మున్సిపాలిటిపై గులాబి జెండా ఎగురవేయాలని పావులు కదుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల కన్నా ఆ పార్టీకి సూర్యాపేట పట్టణంలో మరింత పట్టు ఉంది. దీంతో చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారు కూడా ఎక్కువగా ఉండడంతో తీవ్ర పోటీ నెలకొన్నది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి మూడు సార్లు జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీ నుండి జగదీష్ రెడ్డి వరుసగా శాసనసభ్యునిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. మొదటి నుండి పట్టణ ఓటర్లు అధికంగా బిఆర్ఎస్ వైపు ఎక్కువగా మొగ్గు చూపడంతో ఆయనను విజయం వరించిందన్నది స్పష్టమవుతుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత నియోజకవర్గ కేంద్రంగా ఉన్న సూర్యాపేటను జిల్లాగా మార్చేందుకు ఆయన చేసిన కృషి ఎంతో ఉంది. పదేండ్ల పాలనలో సూర్యాపేట పట్టణంలో వేల కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి పట్టణ రూపురేఖలను పూర్తిగా మార్చారు. ఆయన చేసిన అభివృద్ధి పనులు కండ్ల ఎదుట కనబడుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 26 నెలలు దాటినా పట్టణంలో జరుగాల్సిన అభివృద్ధి అంతా నిలిచిపోయిందని ప్రజలు వాపోతున్నారు.




2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన బిఆర్ఎస్ అభ్యర్థులకు ఎదురుగాలి వీచి చాలా మంది ఓటమి పాలయ్యారు. సూర్యాపేట నియోజకవర్గంలో ముచ్చటగా మూడవ సారి పోటీ చేసిన జగదీష్ రెడ్డిని మాత్రం ఓటర్లు అక్కున చేర్చుకొని ఆదరించడంతో విజయం సాధించారు. నియోజక వర్గంలో ఆ పార్టీకి చెందిన నాయకులు కొంతమంది కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ వీడినా... కీలక నేతలు పార్టీని వీడలేదు. జగదీష్ రెడ్డి నాయకత్వంపై వారికి ఉన్న నమ్మకంతోనే ఆయన వెంట నడుస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

**'పోటీ' రేసులో గండూరి ప్రకాష్...** బిఆర్ఎస్‌లో మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారు డజన్‌కుపైగానే ఉన్నారు. ఇందులో ప్రధానంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక భర్త ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గండూరి ప్రకాష్, మరో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్, 33వ వార్డు మాజీ కౌన్సిలర్ కొండపల్లి భద్రమ్మ భర్త సాగర్ రెడ్డితో పాటు ఆయన కుమారుడు కొండపల్లి శ్రవణ్ రెడ్డి, 42వ వార్డు మాజీ కౌన్సిలర్ అంగిరేకుల రాజశ్రీ భర్త ప్రముఖ విద్యావేత్త అంగిరేకుల నాగార్జున, 39వ వార్డు మాజీ కౌన్సిలర్ మొరిశెట్టి సుధారాణి భర్త ప్రముఖ వ్యాపారి మొరిశెట్టి శ్రీనివాస్, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్‌పర్సన్ ఉప్పల లలిత భర్త ప్రముఖ వ్యాపారవేత్త ఉప్పల ఆనంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, మన్నెం సదాశివరెడ్డి ఫంక్షన్ హాల్ అధినేత మన్నెం సదాశివరెడ్డి, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి గుర్రం సత్యనారాయణ రెడ్డి, సూర్యాపేట బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్య క్షులు, ప్రముఖ వ్యాపారి అంతటి విజయ్ కుమార్ తోపాటు ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు చింతలపాటి చినశ్రీరాములు మాదిగ, 19వ వార్డు మాజీ కౌన్సిలర్ సుంకరి అరుణ భర్త ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి సుంకరి రమేష్‌లు చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. వీరికి జనబలంతో పాటు ఆర్థిక బలం కూడా ఉండడంతో ఆ పార్టీలో చైర్మన్ పీఠం తమకే కావాలని పట్టుబడుతున్నారు. చైర్మన్ అభ్యర్థిగా తమ పేరును ప్రకటిస్తే మున్సిపాల్టీలోని 48 వార్డుల్లో పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థుల మంచి చెడు తామే చూసుకోవడంతోపాటు వారి గెలుపు బాధ్యతలు కూడా తమవే అంటూ తమ నాయకుడు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డికి చెబుతున్న పరిస్థితి. చైర్మన్ స్థానానికి తీవ్ర పోటీ ఉండ దంతో ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

వాయు కాలుష్యంతో ప్రజలు

## భారీ మూల్యం చెల్లిస్తున్నారు

పిల్లలు, వృద్ధులు ఎక్కువగా నష్టపోతున్నారు : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ:** వాయు కాలుష్యం కారణంగా ప్రజలు తమ ఆరోగ్యం, ఆర్థిక రూపంలో భారీ మూల్యం చెల్లిస్తున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాయు కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రజలు తమ గళమెత్తాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు రాహుల్ గాంధీ ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. వాయు కాలుష్యం లక్షలాది మంది భారతీయులను ఎలా ప్రభావితం చేసిందో తమ అభిప్రాయాలను తనకు తెలియజేయాలని కోరారు. 'మన ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థతో వాయు కాలుష్యానికి భారీ మూల్యం చేస్తున్నాము. కోట్లాది మంది సాధారణ భారతీయులు ప్రతిరోజూ ఈ భారాన్ని భరిస్తున్నారని రాహుల్‌గాంధీ తెలిపారు. వాయు కాలుష్యం వల్ల పిల్లలు, వృద్ధులే కాకుండా ముఖ్యంగా నిర్మాణ కార్మికులు, రోజువారీ వేతన జీవుల జీవనోపాధి తీవ్రంగా ప్రభావితమవుతుందన్నారు. వచ్చే శీతాకాలం వరకు సంక్షోభాన్ని మరచిపోలేమని పేర్కొంటూ, 'మార్పు వైపు మొదటి అడుగు మన గొంతులను లేవనెత్తడం' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు. 'వాయు కాలుష్యం మిమ్మల్ని లేదా మీ ప్రియమైన వారిని ఎలా ప్రభావితం చేసిందో' అనే కథనాన్ని https://rahulgandhi.in/awaaz bharatkiలో పంచుకోవాలని ఆయన ప్రజలను కోరారు. 'మీ గొంతు ముఖ్యం, దానిని లేవనెత్తడం నా కర్తవ్యం' అని ఆయన అన్నారు. రాహుల్‌గాంధీ పదే పదే వాయు కాలుష్యం అంశాన్ని లేవనెత్తుతున్నారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఈ అంశంపై చర్చ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

## నేడు ఢిల్లీలో భారీ భద్రత నడుమ...
# భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల ప్రదర్శన

ప్రత్యేక ఆకర్షణగా ప్రధాన ఆయుధ వ్యవస్థల నమూనాల శకటాల ప్రదర్శనలు



**న్యూఢిల్లీ:** ఉగ్రవాదులు దేశరాజధాని ఢిల్లీలో విధ్వంసకర చర్యలకు పాల్పడవచ్చన్న నిఘావర్గాల సమాచారం నేపథ్యంలో భారీ భద్రత నడుమ భారత ప్రభుత్వం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సమాయత్తమైంది. భారతదేశం నేడు (సోమవారం) నిర్వహించనున్న 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తన అభివృద్ధి ప్రయాణం, సాంస్కృతిక వైవిధ్యం, సైనిక బలశక్తిని కొత్తగా ఏర్పరచబడిన యూనిట్లు , ఆపరేషన్ సిందూర్ సమయంలో అభివృద్ధి చేయబడిన ప్రధాన ఆయుధవ్యవస్థల నమూనాలను ప్రదర్శించనుంది. దేశ రాజధానిలో జరిగే ఈ కార్యక్రమానికి యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లేయన్ ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. కర్తవ్యపథంలో జరిగే ఈ కార్యక్రమం ప్రధాన ఇతివృత్తం '150 సంవత్సరాల వందేమాతరం' ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నాయకత్వం వహించనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10 30 గంటలకు ప్రారంభమై 90 నిమిషాలపాటు అంటే 12గంటల సమయానికి ముగియనుంది. ఇది ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతీయ యుద్ధ స్మారక చిహ్నాన్ని సందర్శించడంతో ప్రారంభం అవుతుంది. అక్కడ ఆయన అమరవీరులకు పుష్ప గుచ్ఛం అందించడం ద్వారా దేశానికి నివాలులు అర్పిస్తారు. రాష్ట్రపతి, ముఖ్య అతిథులు 'సాంప్రదాయ బగ్గీ' లో వేదిక వద్దకు వస్తుండగా రాష్ట్రపతి అంగరక్షకులు వారికి ఎస్కార్ట్‌గా అనుసరించడం జరుగుతుంది. వివిధత మే ఏక్తా (భిన్నత్వంలో ఏకత్వం) అనే థీమ్‌తో జరిగే ఈ కవాతులో దాదాపు 100మంది సాంస్కృతిక కళాకారులు పాల్గొంటారు. ఈ కవాతు దేశ ఐక్యతను. గొప్ప సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించే సంగీతవాయిదాల అద్భుతమైన ప్రదర్శనగా ఉండనుంది. ధ్వజ్ ఫార్మేషన్‌లోని 129 హెలికాప్టర్ యూనిట్‌కు చెందిన నాలుగు ఎంఐ17 ఐవి హెలికాప్టర్లు పూల రేకుల వర్షం కురిపించనున్నాయి. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గౌరవ వందనం స్వీకరించడంతో కవాతు ప్రారంభం అవుతుంది. ఈ కవాతుకు సెకండ్ జనరేషన్ ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీస్ కమాండింగ్ పరేడ్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ భావ్‌నీశ్ కుమార్ నాయకత్వం వహిస్తారు. అత్యున్నత శౌర్యపతకాలను గెల్చుకున్న గర్వించదగ్గ విజేతలు వారి వారి బృందాలకు సారథ్యం వహించనున్నారు. ఆ జట్టులో పరమవీరచక్ర విజేతలుసుబేదార్ మేజర్ (గౌరవనీయ కెప్టెన్) యోగేంద్ర సింగ్ యాదవ్ (రిటైర్డ్), సుబేదార్ మేజర్ సంజయ్‌కుమార్ సారథ్యం వహించబోతున్నారు. అశోక్ చక్ర విజేతలు మేజర్ జనరల్ సి.ఏ. పితవాలియా (రిటైర్డ్), కల్నల్ డి. శ్రీరామ్ కుమార్ కూడా ఈ టీమ్‌లో భాగం అవుతారు. అంతేకాకుండా యురోపియన్ యూనియన్‌కు చెందిన ఒక చిన్న సైనిక దళం కూడా ఈ కవాతులో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నది. తొలిసారిగా ఈ కవాతులో భారత సైన్యం దశలవారీ శ్రేణి ఫార్మాట్ ప్రదర్శించబడనున్నది. ఇందులో హై మొబిలిటీ నిఘా వాహనం, భారతదేశం స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఆర్మర్డ్ లైట్ స్పెషలిస్ట్ వెహికిల్ వంటి వాటి ఏరియల్ సపోర్ట్ కూడా ఉంటుంది. స్వదేశీ ధృవ్ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ దాని సాయుధ వెర్షన్ రుద్ర, ప్రహార్ నిర్మాణంలో వైమానిక సహాయాన్ని అందిస్తాయని, ఇది యుద్ధ భూమి ఆకృతిని ప్రదర్శిస్తుందని అధికారులు తెలియజేశారు. అనంతరం పోరాట అంశాలు టి90 భీష్మతో ఉంటాయి. అపాచీ ఏహెచ్64ఇ, ప్రచండ్ తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ల నుండి వైమానిక దాడులతో సెల్యూలైటింగ్ వేదికను దాటి దూసుకుపోతున్న ప్రధాన యుద్ధ ట్యాంక్ అర్జున్‌కు సంబంధించినవి అనుసరిస్తాయి. ఇతర యాంత్రికస్తంభాలలో నాగ్ క్షిపణి వ్యవస్థ (ట్రాక్ట్) ఎంకె2 తోపాటు బిఎంపిII పదాతి దళ పోరాట వాహనం ఉంటాయి. మే ప్రారంభంలో ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సైన్యం మోహరించిన ప్రధాన ఆయుధ వ్యవస్థల ప్రతిరూపాలను ప్రదర్శించే త్రివిధ దళాల శకటం ప్రధాన ఆకర్షణగా నిలువనుందని భావిస్తున్నారు. జాతీయ భద్రతా సవాళ్లను ప్రతిస్పందించడానికి భారతదేశం సంకల్పాన్ని ఈ శకటం ప్రతిబింబిస్తుంది. ఆపరేషన్ సిందూర్ నిర్వహణను క్లుప్తంగా వర్ణించే గాజుతో కప్పబడిన ఇంటిగ్రేటెడ్ ఆపరేషనల్ సెంటర్ కర్తవ్య మార్గంలో కూడా కదులుతుంది. భారత నావికాదళంలో 144మంది యువ సిబ్బంది ఉంటారు. వీరికి లెఫ్టినెంట్ కరణ్ నగ్యాల్ నాయకత్వం వహించగా, కాంటిజెంట్ కమాండర్‌గా లెఫ్టినెంట్ పవన్ కుమార్ గాండి, లెఫ్టినెంట్ ప్రీతి కుమారి, లెఫ్టినెంట్ వరుణ్ ద్రేవేరియా ప్లాటూన్ కమాండర్లుగా ఉంటారు. దీని తర్వాత బలమైన దేశం కోసం బలమైన నావికాదళం అనే ఇతివృత్తాన్ని ప్రదర్శించే నావికా శకటం ఉంటుంది. ఈ శకటం 5వ శతాబ్దానికి చెందిన ఒక ఓడను వర్ణిస్తుంది. ఇప్పుడు దీనిని ఐఎన్ఎస్‌వి కౌండిన్య అని పిలుస్తున్నారు. మరాఠా నావికాదళం గురాబ్ తరగతి నౌకలను, విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ఉదయగిరితో సహా ఫ్రంట్ లైన్ స్వదేశీ వేదికలను వర్ణిస్తుంది. కర్తవ్య మార్గంలో మొత్తం 30శకటాలు, 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, 13 వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు ప్రదర్శించబడతాయి. ఈ శకటం జాతీయగీతం వందేమాతరం 150సంవత్సరాల ప్రత్యేక మిశ్రమ, దేశం శరవేగంతో కూడిన పురోగతిని ప్రదర్శించనుంది.ఈ ఏడాది ప్రతీ రాష్ట్రం, కేంద్రపాలిత పారంతం నుండి దాదాపు 2,500 మంది సాంస్కృక కళాకారులు కర్తవ్యపథంలో ప్రదర్శనలు ఇవ్వబోతున్నారు. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్), సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బి)నుండి తీసుకోబడిన మోటార్ సైకిల్ రైడర్ల ఉమ్మడి డేర్‌డెవిల్స్ బృందం ప్రేక్షకులను ఆకట్టుకునేలా ప్రదర్శితం కానున్నది. కవాతులో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న కార్యక్రమాలలో ఒకటైన ఈ వైమానిక విన్యాసంలో 16 ఫైటర్ జెలు, 4 రవాణా విమానాలు, 9 హెలికాప్టర్లు సహా మొత్తం 29 వైమానిక దళం భాగస్వామ్యం కానున్నాయి. వీటిలో రాఫెల్ ఎస్‌యు30 ఎంకెI, ఎంఐజి29, జాగ్వార్ ఎయిర్ క్రాఫ్ట్ ఉన్నాయి. వీటితో పాటు వ్యూహాత్మక ఆస్తులుసి130, సి295, భారత నావికాదళం పి8i విమానాలు కూడా ఉన్నాయి. వీటిలో అర్జాన్, వజ్రాంగ్, వరుణ, విజయ్ ఉన్నాయి.

ప్రజాస్వామ్య ప్రక్రియల్లో పాల్గొనడం

## ఓటర్లకు లభించే గొప్ప అవకాశం

ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి



**న్యూఢిల్లీ:** ఓటరుగా ఉండటం కేవలం రాజ్యాంగపరమైన హక్కు మాత్రమే కాదు... భారత దేశ భవిష్యత్తును రూపొందించడంలో ప్రతి పౌరుడికి గళాన్ని ఇచ్చే ముఖ్యమైన విధి అని ప్రధానమంత్రి నరేంద్ర మో డీ పేర్కొన్నారు. ఈ ప్రజాస్వామ్య ప్రక్రియల్లో ప్ర జలు పాల్గొనాలని కోరారు. భారత ఎన్నికల సం ఘం స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా 'మై – భారత్' వలంటీర్లకు రాసిన లేఖలో భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో విధిని నిర్ణయించేవారు (భాగ్య విధాత) ఓటర్లని ఆయన అభివర్ణించారు. ఓటరుగా ఉండటం ప్రజాస్వామ్యంలో గొప్ప హక్కు, బాధ్యత అని, ఓటు వేయడం అనేది పవిత్రమైన రాజ్యాంగ హక్కు అన్నారు. భారతదేశ భవిష్యత్తులో పాల్గొనడానికి గుర్తుని చెప్పారు. ఓటరు మన అభివృద్ధి ప్రయాణంలో భాగ్య విధాత, వేలుపై ఉన్న ఆ చెరగని సిరా మన ప్రజాస్వామ్యం ఉత్సాహంగా, ఉద్దేశపూర్వకంగా ఉండేలా చూసే గౌరవ చిహ్నం అని మోదీ వివరించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలను బలోపేతం చేయడానికి భారత ఎన్నికల కమిషన్‌తో అనుబంధించబడిన వారందరినీ అభినందిస్తున్నానన్నారు. 'ప్రజాస్వామ్య ప్రక్రియలలో ఎల్లప్పుడూ పాల్గొనడం ద్వారా మన ప్రజాస్వామ్య స్ఫూర్తిని గౌరవిద్దామని, తద్వారా వికసిత్ భారత్ పునాదులను బలోపేతం చేద్దామని చెప్పుకొచ్చారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ప్రజలు అభివర్ణిస్తారని, అదే సమయంలో, ఇది ప్రజాస్వామ్యానికి తల్లి అని కూడా ఆయన తరచుగా చెబుతూ ఉంటారు. 'మన నారీ శక్తి, ముఖ్యంగా యువతుల భాగస్వామ్యం, సమ్మిళిత ప్రజాస్వామ్యానికి చాలా ముఖ్యమైనదని నొక్కి చెప్పాలనుకుంటున్నాను.

## 982 మందికి పోలీస్ పతకాలు



**న్యూఢిల్లీ:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా 982 మంది పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు, పౌర రక్షణ, దిద్దుబాటు సేవల సిబ్బందికి శౌర్య, వివిధ సేవా పతకాలను ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డులలో 125 శౌర్య పతకాలు (గ్యాలంటరీ మెడల్స్ (జిఎం)) ఉన్నాయని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. జమ్ముకశ్మీర్ ఆపరేషన్స్ థియేటర్‌లో మోహరించిన సిబ్బందికి 45 మందితో గరిష్ఠంగా సాహస పతకాలు వరించాయి. తరువాత 35 మంది నక్సల్ హింస ప్రభావిత ప్రాంతాల నుండి, ఈశాన్య ప్రాంతంలో నియమించబడిన ఐదుగురు ఉన్నారు. శౌర్య పతక విజేతలలో నలుగురు అగ్నిమాపక దళ రక్షకులు ఉన్నారని మంత్రిత్వశాఖ పేర్కొంది. జమ్ముకశ్మీర్ పోలీసులకు అత్యధికంగా 33 మంది శౌర్య పతకాలు రాగా, 31 మంది మహారాష్ట్ర పోలీసులకు, 18 మంది ఉత్తరప్రదేశ్ పోలీసులకు, 14 మంది ఢిల్లీ పోలీసులకు లభించాయి. కేంద్ర సాయుధ పోలీసు దళాలలో 12 పతకాలతో ధైర్య ప్రశంసలు పొందిన ఏకైక దళం సిఆర్‌పిఎఫ్. ఈ జాబితాలో అధికారులు, సిబ్బందికి 101 రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం (పిఎస్ఎం), మెరిటోరియస్ సర్వీస్ (ఎంఎస్ఎం)కు 756 పతకాలు వచ్చాయి.

**31 మంది సిబిఐ అధికారులకు కూడా...**

కోల్‌కతాలోని ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య, హేతువాది నరేంద్ర దభోల్కర్ హత్య కేసు దర్యాప్తులను పర్యవేక్షించిన సిబిఐ అధికారులు 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు పతకాలు అందుకున్న కేంద్ర దర్యాప్తు సంస్థకు చెందిన 31 మంది సిబ్బందిలో ఉన్నారు. గుజరాత్ కేడర్‌కు చెందిన 2000 బ్యాచ్ ఐపిఎస్ అధికారి జాయింట్ డైరెక్టర్ వి చంద్రశేఖర్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవ పతకం లభించింది. కోల్‌కతా ఆసుపత్రిలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన దారుణమైన అత్యాచారం, హత్య కేసు దర్యాప్తును ఏజెన్సీ జాయింట్ డైరెక్టర్‌గా అధికారి పర్యవేక్షించారు. పోలీస్ సూపరింటెండెంట్ అమిత్ శ్రీవాస్తవ, అదనపు పోలీసు సూపరింటెండెంట్ ముఖేష్ శర్మ, సబ్‌ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ కుమార్ యాతి, అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ చమన్ లాల్ , హెడ్ కానిస్టేబుల్ రాము గొల్లలకు కూడా రాష్ట్రపతి విశిష్ట సేవ పతకం లభించింది. ఈ ఏజెన్సీ నుండి ఇరవై ఐదు మంది అధికారులకు మెరిటోరియస్ సర్వీస్ కోసం పోలీస్ మెడల్ లభించింది. వీరిలో ఏజెన్సీలో జాయింట్ డైరెక్టర్‌గా నియమితులైన 2007 బ్యాచ్ ఐపిఎస్ అధికారి సి. వెంకట సుబ్బారెడ్డి, ఉత్తరాఖండ్‌లోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా తన కేడర్‌లో చేరడానికి ఏజెన్సీని డిఐజిగా విడిచిపెట్టిన సదానంద్ శకర్‌రావు డేటే ఉన్నారు. డిప్యూటీ లీగల్ అడ్వైజర్ మన్మోహన్ శర్మ; అదనపు ఎస్పీలు బైద్యనాథ్ సమల్ , కైలాష్ సాహు; డిప్యూటీ ఎస్పీలు రూబీ చౌదరి, మనీష్ కుమార్ ఉపాధ్యాయ్, అన్మోల్ సచన్, నిషు కుష్వాహా, అరిజిత్ సిన్హా, శరద్ సురేశ్ భవార్, తాహిర్ అబ్బాస్ పి, ధర్మేంద్ర కుమార్‌లు మెరిటోరియస్ సర్వీస్ (పిఎంఎంఎస్)కు పోలీసు మెడల్ పొందిన వారిలో ఉన్నారు. ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్, ప్రోగ్రామర్ దీప్తి వశిష్ట, ఎస్ఐ వినోద్ కుమార్, ఆఫీసర్ సూపరింటెండెంట్ నారికోటే నందిని, హెడ్ కానిస్టేబుళ్లు నేత్రమ్ చౌరసియా, పురాణ్ మల్ గుజ్జర్, భోలా రాయ్, బాబు వర్గీస్, విక్రమ్ సింగ్, అలాగే కానిస్టేబుళ్లు సంజీవ్ కుమార్, వైఖోమ్ రాజేష్ సింగ్‌లకు కూడా ప్రధాన మంత్రి అవార్డు లభించింది.

## మిగిలిన రాష్ట్రాల్లో త్వరలో 'సర్'

పారదర్శక ఓటర్ల జాబితాలే ప్రజాస్వామ్యానికి పునాది

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా మిలిగిన రాష్ట్రాల్లో కూడా త్వరలోనే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) అమలు చేస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్(సిఇసి) జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. పారదర్శక ఓటర్ల జాబితాలే ప్రజాస్వామ్యానికి పునాది అని స్పష్టం చేశారు. జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా జరుగుతోంది. స్వచ్ఛమైన ఓటర్ల జాబితాలే ప్రజాస్వామ్యానికి పునాది. ఆ లక్ష్యంతోనే అర్హత గలిగిన ప్రతి ఓటరి పేరు జాబితాలో చేర్చాం. అనర్హుల పేర్లను తొలగించడం కోసమే ఈ ఎస్ఐఆర్‌ను ప్రారంభించాం. బిహార్‌లో ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. అక్కడ ఓటర్లు తుది జాబితాపై ఒక్క అప్పీల్ కూడా దాఖలు కాలేదు. ఇది ఎస్ఐఆర్ ప్రక్రియ విశ్వసనీయతకు నిదర్శనం. అసోంలో ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతోంది. మిగిలిన అన్ని రాష్ట్రాల్లో కూడా త్వరలోనే అమలు చేస్తాం' అని జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు.

**అంతర్జాతీయ స్థాయిలో భారత ఎన్నికల నిర్వహణకు గుర్తింపు**

బిహార్‌లో ఎస్ఐఆర్ తర్వాత నిర్వహించిన ఎన్నికలు చారిత్రాత్మక మైలురాయిగా నిలిచాయని జ్ఞానేశ్ కుమార్ అన్నారు. 1951 తర్వాత అత్యధికంగా 67.13 శాతం ఓటింగ్ నమోదైందని తెలిపారు. ఇంతవరకు లేనంతగా మహిళ ఓటర్లు 71.78శాతం మంది పాల్గొన్నారు. భారత్ ఎన్నికల నిర్వహణలో ప్రపంచ నాయకత్వాన్ని ప్రదర్శిస్తున్నట్లు సిఇసి తెలిపారు. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్ట్రోరల్ అసిస్టెంట్ (ఐడిఇఎ) అధ్యక్షత బాధ్యతను భారత్‌కు అప్పగించినట్లు చెప్పారు. జనవరి 21 నుంచి 23 వరకు జరిగిన ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ ఎన్నికల నిర్వహణ సదస్సును ఇసి నిర్వహించినట్లు తెలిపారు. ఈ సదస్సులో 70కు పైగా దేశాల ఎన్నికల సంఘాల అధిపతులు, సీనియర్ అధికారులు హాజరైనట్లు వెల్లడించారు.

**'ఇసి విజయాల సంవత్సరం 2025'**

2025 సంవత్సరాన్ని ఎన్నికల సంఘం విజయాలు, ఆవిష్కరణల సంవత్సరంగా జ్ఞానేష్ పేర్కొన్నారు. సుమారు 30 కీలక కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. వాటిలో భాగంగా, ఢిల్లీలో ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన 5వేల మందికిపైగా బూత్ లేవల్ అధికారులు పర్యవేక్షకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ఓటర్ల సౌలభ్యానికి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. ఇసిఐనెట్ యాప్ ప్రారంభం అన్ని ఓటరు సేవలను ఒకే డిజిటల్ వేదికపై అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మొబైల్ డిపాజిట్ సదుపాయం, ఒక్కో పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,200 మంది ఓటర్ల పరిమితి చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## నిరంతర ఒత్తిడిలో ఎన్నికల కమిషన్

దాని స్వతంత్రతను కాపాడాల్సిన అవసరం ఉంది : ఖర్గే

**న్యూఢిల్లీ :** ఇటీవలి కాలంలో ఎన్నికల కమిషన్ వంటి సంస్థలు నిరంతర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. అందువల్ల ప్రజాస్వామ్యం మనుగడ సాగించడమే కాకుండా నిజంగా అభివృద్ధి చెందేలా వాటి స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం మన బాధ్యత అని చెప్పారు. 'ఓటు చోరీ' ప్రణాళిక లేని 'సర్' ద్వారా ఓటు హక్కును లాక్కోవడం వల్ల భారత ప్రతిష్టాత్మకమైన ప్రజాస్వామ్యం మసకబారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేస్తూ నేడు ఒక దేశ భవిష్యత్తు ప్రజలపైనే ఉందని, మన సమష్టి స్వరం ఉమ్మడి విధిని రూపొందించగలదన్నారు. 'భారత ప్రజలు స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన, నిర్భయమైన ఎన్నికలకు అర్హులు. ఇక్కడ సచ్ఛమైన ఓటర్ల జాబితాలు, సమాన స్థాయి ఆట స్థలం ప్రాథమిక అవసరం అని ఖర్గే పేర్కొన్నారు. భారతదేశం గణతంత్ర రాజ్యంగా మారడానికి ఒక రోజు ముందు, జనవరి 25, 1950న ఎన్నికల సంఘం స్థాపించబడింది. గత 16 సంవత్సరాలుగా, ఈ రోజును జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్నారు.


## సీనియర్ జర్నలిస్ట్ మార్క్ టుల్లీ కన్నుమూత



**న్యూఢిల్లీ :** ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ మార్క్ టుల్లీ (90) కన్నుమూశారు. ఢిల్లీలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. అక్టోబర్ 24, 1935న కోల్‌కతాలో జన్మించారు. 1960 నుంచి ఆయన జర్నలిస్టుగా సేవలందించారు. అంతర్జాతీయ మీడియా సంస్థ బిబిసిలో న్యూఢిల్లీ బ్యూరో చీఫ్‌గా రెండు దశాబ్దాలకుపైగా సేవలందించారు. రచయితగానూ సత్తా చాటారు. దక్షిణాసియాకు సంబంధించిన అనేక అంశాలతో పాటు చారిత్రక, రాజకీయ నేపథ్యం ఉన్న వార్తల్లో తనదైన ముద్రవేశారు. దేశాన్ని కుదిపేసిన ఆపరేషన్ బ్లూ స్టార్ (1984)పై ఆయన విశ్లేషణాత్మక కథనాలు అందించారు. బిబిసి రేడియోలోనూ సేవలందించారు. 'సంథింగ్ అండర్‌స్టుడ్' కార్యక్రమాన్ని నిర్వమించారు. ఫారిన్ కరస్పాండెంట్‌గా జాతీయ, అంతర్జాతీయ అంశాలను బిబిసి ద్వారా ప్రజలకు అందించారు. సంస్థకు ఇండియా తరఫున బ్యూరో చీఫ్‌గా అత్యధిక కాలం సేవలందించి ఆయనే. మరోవైపు రచయితగానూ సత్తా చాటారు. నో ఫుల్ స్టాప్స్ ఇన్ ఇండియా, ఇండియా ఇన్ స్లో మోషన్, ద హార్ట్ ఆఫ్ ఇండియా వంటి పుస్తకాలు రచించారు. రచయితగా, జర్నలిస్టుగా ఆయన అందించిన సేవలకు పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు దక్కాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆయనకు 1992లో పద్మశ్రీ పురస్కారం దక్కగా, 2005లో పద్మభూషణ్ పురస్కారం దక్కింది. 2002లో నైట్‌హుడ్ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. టుల్లీ మృతికి పలువురు రాజకీయ నేతలు, జర్నలిస్టులు సంతాపం ప్రకటిస్తున్నారు.

## 'హిందీ'కి తమిళనాడులో ఎప్పటికీ స్థానం లేదు

భాషా అమరవీరుల దినోత్సవంలో సిఎం స్టాలిన్ స్పష్టీకరణ



**చెన్నై :** తమిళనాడులో హిందీకి ఎప్పటికీ స్థానం లేదని, భవిష్యత్తులోనూ ఉండదని ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ స్పష్టం చేశారు. గతంలో హిందీ వ్యతిరేక ఆందోళనలో ప్రాణ త్యాగం చేసిన రాష్ట్రంలోని 'భాషా అమరవీరులను' డిఎంకె అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదివారం ప్రశంసించారు. భాషా అమరవీరుల దినోత్సవం సందర్భంగా వారికి నివాళి అర్పించారు. తమిళ భాషను ప్రాణంలా ప్రేమించే రాష్ట్రంలో హిందీ విధించడంపై ఐక్యంగా పోరాడిందన్నారు. హిందీని రాష్ట్ర ప్రజలపై రుద్దాలని చూసిన ప్రతిసారీ అదే తీవ్రతతో నిరసన తెలిపారన్నారు. అప్పుడు, ఇప్పుడు మరియు ఎప్పటికీ (తమిళ్‌లో) హిందీకి చోటు లేదని సామాజిక మాధ్యమంలో స్టాలిన్ పేర్కొన్నారు. 1965లో తారాస్థాయికి చేరుకున్న హిందీ వ్యతిరేక ఆందోళనకు సంబంధించిన చరిత్ర సంక్షిప్త వీడియోను షేర్ చేశారు. అందులో అమరవీరుల ప్రస్తావనలు, భాషా సమస్యలో దివంగత డిఎంకె ప్రముఖులు సిఎన్ అన్నాదురై, ఎం కరుణానిధి చేసిన కృషి కూడా ఉంది. కాగా, హిందీ వ్యతిరేక ఆందోళనకు నాయకత్వం వహించడం ద్వారా తమిళనాడు ఉపఖండంలోని వివిధ భాషా జాతీయ జాతుల హక్కు, గుర్తింపును కాపాడుకుందని స్టాలిన్ అన్నారు. 'తమిళం కోసం తమ విలువైన ప్రాణాలను అర్పించిన అమరవీరులకు నా కృతజ్ఞతాపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. భాషా యుద్ధంలో ఇక ప్రాణం పోదు; తమిళం పట్ల మన ప్రేమ ఎప్పటికీ చనిపోదు! హిందీ విధించడాన్ని మేము ఎప్పటికీ వ్యతిరేకిస్తాము' అని ముఖ్యమంత్రి అన్నారు. భాషా అమరవీరులు తలముత్తు, నటరసన్ స్మారక చిహ్నం వద్ద కూడా ముఖ్యమంత్రి నివాళులర్పించారు. అంతేకాకుండా, నగరంలోని చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సిఎండిఎ) భవనంలో వారి ప్రతిమలను ఆయన ప్రారంభించారు. 1964–65లో తమిళనాడు అంతటా జరిగిన హిందీ వ్యతిరేక ఆందోళనలో ప్రధానంగా ఆత్మాహుతి ద్వారా తమ ప్రాణాలను త్యాగం చేసిన వారిని భాషా అమరవీరులు అంటారు. ఈ రోజు వరకు దక్షిణాది రాష్ట్రం తమిళం, ఇంగ్లీష్ రెండు భాషా సూత్రాన్ని అనుసరిస్తుంది. కేంద్రం ఎన్ఇపి–2020 ద్వారా హిందీ విధించాలని చూస్తోందని డిఎంకె ఆరోపిస్తోంది. ఇదిలా ఉండగా, ప్రతిపక్ష నేతలు ఎఐఎడిఎంకె చీఫ్ ఎడప్పాడి కె పళనిస్వామి, తమిళగ వెట్రి కజగం నాయకుడు విజయ్ కూడా భాషా అమరవీరులకు నివాళులు అర్పించారు. తమిళ తల్లి మన ప్రాణంతో సమానం అని రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు కూడా అయిన పళనిస్వామి సోషల్ మీడియా పోస్ట్‌లో అన్నారు.

## ఆర్‌జెడి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తేజస్వీ యాదవ్



**పాట్నా:** బిహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు తేజస్వి ప్రసాద్ యాదవ్ రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. పార్టీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఆదివారం పాట్నాలోని ఒక హోటల్‌లో జరిగిన ఆర్‌జెడి జాతీయ కార్యవర్గ సమావేశం తర్వాత తేజస్వీ యాదవ్ నియామకాన్ని ప్రకటించారు. కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో లాలూ ప్రసాద్, రబ్రీ దేవి, మిషా భారతి, పార్టీలోని ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బిహార్ ఆర్‌జెడి చీఫ్ మంగని లాల్ మండల్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తేజస్వీ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. తేజస్వి మరింత బాధ్యతగా వహించాలని సమావేశంలో ఉన్న నాయకులలో విస్తృత ఏకాభిప్రాయం ఉందని పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు తెలిపారు. తేజస్వీ సోదరుడు, మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్, సోదరి రోహిణి ఆచార్య ఎన్నికల్లో పార్టీ పరాజయానికి ఆయనను, ఆయన సహచరులను నిందించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉ ండగా, తేజస్వీని ఆర్‌జెడి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు వార్తలు వెలువండిన వెంటనే రోహిణి తేజస్వీని లక్ష్యంగా చేసుకుని, తన సన్నిహితులు ఆర్‌జెడి ఎంపి సంజయ్ యాదవ్, మాజీ ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ రమీజ్ నేమత్ ఖాన్‌లను చొరబాటుదారులు, కుట్రదారులుగా అభివర్ణించారు. సమావేశానికి కొన్ని గంటల ముందు, ఆ తర్వాత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఉదయం పార్టీ నియంత్రణ ద్రోహులు, కుట్రదారుల చే తుల్లోకి వెళ్లిపోయిందని ఆరోపించారు. ప్రత్యర్థులు పంపిన వ్యక్తులే ఇప్పుడు పార్టీని నాశనం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని ఆమె ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. పార్టీ పరిస్థితిపై బాధ్యత వహించాల్సిన నేతలు ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మౌనం పాటిస్తున్నారని రోహిణి విమర్శించారు. లాలువాద్ సిద్ధాంతాన్ని కాపాడాల్సినవారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శ్రేయస్సు కోసం మాట్లాడేవారిని దుర్భాషలాడుతున్నారని పేర్కొన్నారు.

జరిగేది ఎన్నికల పోరుకాదు...

## ప్రజాస్వామ్య యుద్ధం



తమిళనాడు ఎన్నికల్లో ఒంటరిగానే విజయం సాధిస్తాం : విజయ్

**మామల్లపురం:** త్వరలో తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను కేవలం ఎన్నికల పోటీగా కాకుండా అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య యుద్ధంగా టివికె చీఫ్ విజయ్ అభివర్ణించారు. స్థిరపడిన రాజకీయ శక్తులను సవాలు చేయడానికి తన పార్టీది ప్రత్యేక స్థానం అని అన్నారు. 'ఇప్పుడు జరగబోయేది కేవలం ఎన్నికలు కాదు; ఇది ప్రజాస్వామ్య యుద్ధం. ఈ ప్రజాస్వామ్య యుద్ధానికి నాయకత్వం వహించబోయే కమాండర్లు మీరే' అని ఆదివారం చెన్నైలో జరిగిన తమిళగ వెట్రి కజగం (టివికె) కార్యకర్తల సమావేశంలో పార్టీ చీఫ్ విజయ్ అన్నారు. ప్రస్తుతం పాలిస్తున్న 'దుష్టశక్తి'ని, గతంలో రాష్ట్రాన్ని పరిపాలించిన 'అవినీతి శక్తి'ని ఎదుర్కోవడానికి ధైర్యం, వైఖరి టివికె మాత్రమే ఉందని విజయ్ ప్రకటించారు. అధికార డిఎంకె, ప్రతిపక్ష ఎఐఎడిఎంకెనుద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. 'ఈ దుష్టశక్తి అయినా లేదా ఆ అవినీతి శక్తి అయినా, రెండూ తమిళనాడును పాలించకూడదు. అటువంటి పార్టీలను నిజాయితీగా, ధైర్యంగా వ్యతిరేకించే ధైర్యం, వైఖరి తమకు మాత్రమే ఉంది అని విజయ్ అన్నారు. హాని కలిగించాలని అనుకునే వారి నుండి ప్రజలను, భూమిని రక్షించడానికి తాము అండగా ఉంటామని భరోసానిచ్చారు. తన రాజకీయ ప్రవేశ ప్రధాన లక్ష్యాన్ని కూడా ఆయన వివరించారు. తాము ఎవరి కోసమో లేదా దేని కోసం ఎప్పుడూ రాజీ పడబోమన్నారు. తనపై అవినీతి మరక పడబోనీయనన్నారు. రాజకీయ ఒత్తిడి లేదా జాతీయ పార్టీలకు లొంగిపోవడం అనే పుకార్లను కూడా ఆయన తోసిపుచ్చారు. గత పాలకులు 'బిజెపికి బానిసలు' అని ఆయన ఆరోపించారు. ప్రస్తుత డిఎంకె ప్రభుత్వం ఆకర్షణీయమైన ప్రకటనల పరోక్షంగా లొంగిపోయిందన్నారు. కానీ వ్యవస్థను శుభ్రపరచడం అనేది ఒక ప్రక్రియ అని, వ్యక్తిగత లాభం కోరుకోని నాయకుడు అవసరమని ఆయన ఒప్పుకున్నారు. తన పార్టీ కార్యకర్తలను 'ఫ్రంట్‌లైన్ యోధులు', 'కమాండర్లు' అని ముద్ర వేస్తూ, ప్రత్యర్థులు తన బలాన్ని తక్కువగా అంచనా వేస్తున్నప్పటికీ, ప్రజలు ఇప్పటికే తనకు స్పష్టమైన ఆదేశాన్ని ఇవ్వాలని నిర్ణయించుకున్నారని విజయ్ పేర్కొన్నారు. ఇతర పార్టీలకు బూత్ అనేది ఓటు వేయడానికి, కొన్నిసార్లు ఓట్లను దొంగిలించడానికి ఒక స్థలం అని పేర్కొంటూ, తన పార్టీకి, బూత్‌లు 'ప్రజాస్వామ్య మందిరాలు' అని ఆయన నొక్కి చెప్పారు. టివికె సైన్యం చాలా ధైర్యంగా ఉందని, ఒంటరిగా నిలబడినా గెలవగలదన్నారు. కాగా, సమావేశంలో విజయ్ తన పార్టీ చిహ్నమైన 'విజిల్' ను ఆవిష్కరించారు.

# వికసించిన సాహితీ కుసుమాలు

మిగతా రంగాలతో పోలిస్తే, ఈ ఏడాది పద్మ అవార్డుల్లో సాహిత్యం–విద్యకు అధిక ప్రాధాన్యం దక్కింది. ఒకరికి పద్మవిభూషణ్, ముగ్గురికి పద్మభూషణ్ అవార్డులు లభించడం సాహిత్యానికి లభించిన సముచిత గౌరవం. కేరళకు చెందిన ఎంటి వాసుదేవన్ నాయర్ (పద్మవిభూషణ్), డా.బిబేక్ డెబ్రాయ్ (పద్మభూషణ్)కు మరణానంతరం అవార్డు లభించగా, డాక్టర్ ఆర్కల్‌గడ్ అనంతరామయ్య సూర్యప్రకాశ్, రాంబహదూర్ రాయ్ (పద్మభూషణ్) దక్కించుకుంటే, 26 మందికి పద్మశ్రీ దక్కింది. సాహిత్యానికి పెద్దపీట వేయడం కొంత ఆనందించతగిన విషయమేగానీ, వీరిలో ఎక్కువ మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బిజెపి లేదా కేంద్ర ప్రభుత్వానికి మద్దతునిచ్చేవారే ఉండడం ఒక దుష్ట సంప్రదాయానికి నిదర్శనం. సాహిత్యాన్ని కూడా రాజకీయం చేయడం దుర్మార్గం. ఏదిఏమైనా, సాహితీ రంగానికి ఆదరణ లభించడం మాత్రం ఆహ్వానించ పరిణామమే. సామర్థ్యానికి, నిజమైన ప్రజాహిత రచయితలకు అవార్డులు దక్కివుంటే, వాటికి మరింత శోభ చేకూరేది. 'పద్మవిభూషణుడు' వాసుదేవన్ నాయర్‌ను అభిమానులు ప్రేమగా 'ఎంటి' అని పిలుచుకుంటారు. సాహితీ రంగానికి విశిష్ట సేవలు అందించారు. కేరళకు చెందిన ఆయన మలయాళ భాష, సాహిత్యం, సినిమాల రంగాల్లో అపూర్వమైన ముద్ర వేసిన సాంస్కృతిక మహావ్యక్తి. రచయితగా మాత్రమే కాకుండా, సినిమా దర్శకుడు, కథా రచయిత (స్క్రీన్‌ప్లే రైటర్), సంపాదకుడు, వక్తగా ఆయన చేసిన సేవలు తరతరాల పాఠకులను, ప్రేక్షకులను అత్యంత ప్రభావితం చేశాయి. ఆయన సాహిత్య దృష్టి, కళాత్మక ప్రమాణాలు, సాంస్కృతిక అవగాహన మలయాళ సాహిత్యాన్ని, సినిమాను కొత్త దశకు తీసుకెళ్లాయని చెప్పవచ్చు. వాసుదేవన్ నాయర్ 1933 జూలై 15న కేరళ రాష్ట్రం పాలక్కాడ్ జిల్లా కుడల్లూరు అనే చిన్న గ్రామంలో జన్మించారు. చిన్ననాటి నుంచే చదవడం, రాయడం పట్ల ఆయనకు అపారమైన ఆసక్తి ఉండేది. పుస్తకాలు ఆయన జీవితంలో విడదీయరాని భాగంగా మారాయి. ఆయన పాలక్కాడ్‌లోని గవర్నమెంట్ విక్టోరియా కాలేజీలో పట్టభద్రులయ్యారు. చదువు పూర్తయ్యేలోపే సాహిత్య రంగంలో ఆయన ప్రతిభ వెలుగులోకి వచ్చింది. 1954లో న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి 'వరల్డ్ షార్ట్ స్టోరీ' పోటీలో మలయాళంలో ఉత్తమ కథకు మొదటి బహుమతి గెలుచుకోవడం ద్వారా ఎంటి పేరు సాహిత్య ప్రపంచంలో మార్మోగింది. ఇది ఒక యువ రచయితగా ఆయనకు వచ్చిన గొప్ప గుర్తింపు. విద్య పూర్తయ్యాక ఆయన కొంతకాలం పాలక్కాడ్‌లోని ఎంబి ట్యుటోరియల్ కాలేజీలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అయితే, సాహిత్యంపై ఉన్న మక్కువ ఆయనను జర్నలిజం వైపు నడిపించింది. 1957లో కేరళలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మలయాళ పత్రిక 'మాతృభూమి'లో సబ్ ఎడిటర్‌గా చేరడం ఆయన జీవితంలో కీలక మలుపు. ఈ సంస్థతో ఆయన అనుబంధం దశాబ్దాల పాటు కొనసాగి, మలయాళ సాహిత్య దిశనే మార్చినంత ప్రభావం చూపింది. 1958లో ప్రచురితమైన ఆయన తొలి నవల 'నాలుకెట్టు' మలయాళ సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ నవలకు కేరళ సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. సంప్రదాయ కుటుంబ వ్యవస్థ, మారుతున్న సామాజిక విలువలు, వ్యక్తిగత సంఘర్షణలు వంటి అంశాలను లోతుగా, సున్నితంగా చిత్రించిన ఈ నవల ఆయన రచనా శైలికి ప్రతీకగా మారింది. తరువాత 1965లో ఆయన రాసిన తొలి సినిమా కథ రచన 'మురప్పెన్ను', ఆయన స్వంత చిన్న కథ ఆధారంగా తెరకెక్కింది. ఇది కూడా సాహిత్యం – సినిమా మధ్య ఉన్న బలమైన సంబంధానికి నిదర్శనం. 1968లో ఎంటి 'మాతృభూమి వీక్లీ' సంపాదకుడిగా నియమితులయ్యారు. దాదాపు మూడు దశాబ్దాల పాటు సాగిన ఆయన సంపాదకత్వ కాలంలో, అనేకమంది కొత్త మలయాళ రచయితలను గుర్తించి, ప్రోత్సహించారు. ఆయన సంపాదకత్వం కేవలం పత్రిక నిర్వహణకే పరిమితం కాకుండా, మలయాళ సాహిత్యాన్ని ఒక సృజనాత్మక ఉద్యమంగా మార్చింది. కొత్త ఆలోచనలు, కొత్త రచనా శైలులు పాఠకుల ముందుకు రావడానికి ఆయన వేదికగా నిలిచారు. సినీ రంగంలో ఆయన తొలి దర్శకత్వ చిత్రం 'నిర్మాల్యం' (1973). ఈ చిత్రం మలయాళ సినిమాకు ఒక క్లాసిక్‌గా నిలిచింది. గ్రామీణ జీవితంలోని ఆచారాలు, విశ్వాసాలు, అంతర్గత సంఘర్షణలను అద్భుతంగా తెరపై ఆవిష్కరించిన ఈ చిత్రం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు గెలుచుకుంది.


ఎం.టి.వాసుదేవన్ నాయర్


సూర్యప్రకాశ్

1973లో ఉత్తమ చిత్రానికి ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, జకార్తా ఆసియన్ ఫిలిం ఫెస్టివల్‌లో 'గరుడ అవార్డు' వంటి ప్రతిష్ఠాత్మక గౌరవాలు ఈ చిత్రానికి దక్కాయి. ఎంటి వాసుదేవన్ నాయర్ సాహిత్య సృష్టి విస్తృతమైనది. ఆయన 200కు పైగా చిన్న కథలు, 8 నవలలు, అనేక వ్యాసాలు, ప్రయాణ వర్ణనలు, ఒక నాటకం రచించారు. మలయాళ సినిమాలో కథా రచనకు (స్క్రీన్‌ప్లేకు) ఒక స్పష్టమైన నిర్మాణం, శాస్త్రీయమైన రూపం ఇవ్వడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన మొత్తం 55 సినిమాలకు కథా రచన చేయడంతో పాటు, చిన్న చిత్రాల సంకలనానికీ రచయితగా ఉన్నారు. ఆయన దర్శకత్వం వహించిన 7 చిత్రాల్లో చాలా వరకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు గెలుచుకున్నాయి. స్క్రీన్‌ప్లేలను పుస్తక రూపంలో ప్రచురించిన తొలి వ్యక్తుల్లో ఎంటి ఒకరు. దీనివల్ల స్క్రీన్‌ప్లేకు కూడా సాహిత్య విలువ ఉందనే భావన బలపడింది. తరువాతి తరాల అనేకమంది సినిమా రచయితలకు ఆయన రచనలు ఒక మార్గదర్శక గ్రంథంలా మారాయి. 'మాతృభూమి' సాహిత్య పత్రిక సంపాదకుడిగా ఉన్నప్పుడు, ఇతర భారతీయ భాషలతో పాటు ఇంగ్లీష్‌లోని ప్రముఖ రచనలను మలయాళంలోకి అనువదింపజేయడంలో ఆయన ముఖ్య పాత్ర వహించారు. దీని ద్వారా మలయాళ పాఠకులు ప్రపంచ సాహిత్యాన్ని చేరువగా అనుభవించే అవకాశం పొందారు. భాష, సంస్కృతి పరిరక్షణ అవసరాన్ని ముందుగానే గ్రహించిన దూరదృష్టి గల వ్యక్తి ఎంటి 1992లో ఆయన తుంచన్ స్మారక సంస్థ బాధ్యతలు స్వీకరించారు. ఆధునిక మలయాళ భాషకు పితామహుడిగా భావించబడే తుంచత్తు రామానుజన్ ఎజుతచ్చన్‌కు తగిన స్మారకాన్ని నిర్మించేందుకు ఆయన మూడు దశాబ్దాల పాటు అంకితభావంతో కృషి చేశారు. ఈ రోజు అది భారతదేశంలో ఒక భాషకు, ఆ భాషా స్థాపకుడికి అంకితమైన అత్యంత పవిత్రమైన, గౌరవనీయమైన స్మారకంగా నిలుస్తోంది. ఎంటి తన జీవితకాలంలో అనేక పురస్కారాలు, గౌరవాలు అందుకున్నారు. 1970లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1995లో జ్ఞానపీఠ్ అవార్డు, 2013లో సాహిత్య అకాడమీ ఫెలోషిప్ ఆయనకు లభించాయి. 2005లో భారత ప్రభుత్వం ఆయనను 'పద్మభూషణ్'తో సత్కరించింది. జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ కథా రచనకు గాను ఆయన నాలుగు సార్లు (1989, 1991, 1993, 1994) అవార్డులు గెలుచుకుని రికార్డు సృష్టించారు. అంతేకాకుండా 17 రాష్ట్ర అవార్డులు ఆయన ఖాతాలో ఉన్నాయి. వయలార్ అవార్డు, కేరళ సాహిత్య అకాడమీ ఫెలోషిప్, ఎజుతచ్చన్ పురస్కారం, జె.సి. డేనియల్ అవార్డు, కేరళ జ్యోతి పురస్కారం వంటి అనేక గౌరవాలు ఆయన ప్రతిభకు నిదర్శనాలు. 2024 డిసెంబర్ 25న ఎంటి కన్నుమూశారు. ఆయన శరీరం మట్టిలో కలిసిపోయినా, ఆయన సాహిత్యం, సినిమాలు, ఆలోచనలు మాత్రం మలయాళ సంస్కృతిలో శాశ్వతంగా నిలిచిపోయాయి. ఎం.టి. వాసుదేవన్ నాయర్ అనేది కేవలం ఒక రచయిత పేరు కాదు; అది మలయాళ భాషకు, కళకు, సంస్కృతికి ఒక శాశ్వత ప్రతీక.

మీడియా రంగంలో విశేష అనుభవం ఉన్న డాక్టర్ ఆర్కల్‌గడ్ అనంతరామయ్య సూర్యప్రకాశ్ భారతదేశంలోని ప్రముఖ పండితులలో ఒకరు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షకుడు. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన తన దీర్ఘమైన వృత్తి జీవితంలో ఆయన ముద్రిత, ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో విశేష సేవలు అందించారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, పార్లమెంటరీ విధానాలు, రాజ్యాంగ పరమైన అంశాలపై ఆయన చేసిన లోతైన అధ్యయనం దేశంలోని ప్రజా చర్చలను సమృద్ధిగా చేసింది. ముఖ్యంగా భారత ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలనే దిశలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనది. భారత దేశ ప్రజా ప్రసార సంస్థ అయిన ప్రసార్ భారతి ఛైర్మన్‌గా, అలాగే ప్రధానమంత్రి మ్యూజియం, గ్రంథాలయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ వైస్‌చైర్మన్‌గా ఆయన నిర్వహించిన బాధ్యతలు దేశ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలుస్తాయి. డా.సూర్యప్రకాశ్ 1950 ఫిబ్రవరి 9న జన్మించారు. విద్యాపరంగా ఆయన అసాధారణమైన ప్రతిభను కనబరిచారు. బెంగళూరు విశ్వవిద్యాలయం నుండి బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ పట్టా, మైసూరు విశ్వవిద్యాలయం నుండి సమాజశాస్త్రంలో ఎంఎ పూర్తి చేశారు. భారత పార్లమెంట్ పనితీరుపై చేసిన పరిశోధనకు గాను తుమకూరు విశ్వవిద్యాలయం ఆయనకు డి.లిట్ డిగ్రీ ప్రదానం చేసింది. అంతేకాకుండా చౌదరి చరణ్ సింగ్ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో ఎల్‌ఎల్‌బి పట్టా కూడా పొందారు. ఈ విభిన్న విద్యా నేపథ్యం ఆయనకు రాజ్యాంగ, న్యాయ, పార్లమెంటరీ వ్యవస్థలను సమగ్రంగా అర్థం చేసుకునే సామర్థ్యాన్ని ఇచ్చింది. 1995లో ఆయన రాసిన 'వాట్ ఎయిల్స్ ఇండియన్ పార్లమెంట్' అనే గ్రంథం భారత పార్లమెంట్ పనితీరుపై వచ్చిన అత్యంత ప్రామాణికమైన అధ్యయనాలలో ఒకటి. ఈ పుస్తకంలో ఎంపిలు రెండు సభల్లో తమ బాధ్యతలను ఎలా నిర్వర్తిస్తున్నారు, అలాగే నియోజకవర్గాల ఒత్తిళ్లను ఎలా ఎదుర్కొంటున్నారు అనే అంశాలను లోతుగా విశ్లేషించారు. 2013లో ప్రచురితమైన 'పబ్లిక్ మనీ, ప్రైవేట్ ఎజెండా – ది యూజ్ అండ్ అబ్యూజ్ వం ఎంపిలాడ్స్' పుస్తకంలో ఎంపి స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం (ఎంపిలాడ్స్) పనితీరును విమర్శాత్మకంగా పరిశీలించారు. ఈ పుస్తకం దేశవ్యాప్తంగాఎంపిలాడ్స్ సమర్థతపై పెద్ద చర్చకు దారి తీసింది. 2002లో లోక్‌సభ సెక్రటేరియట్ ప్రచురించిన 'ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ ఇండియన్ పార్లమెంట్' అనే గ్రంథంలో, రాజకీయ పార్టీల పనితీరును నియంత్రించాల్సిన అవసరంపై ఆయన ఒక కీలక అధ్యాయాన్ని రచించారు. ఈ రచనలు భారత ప్రజాస్వామ్య సంస్థలపై ఒక విమర్శాత్మక ఆడిట్‌లా పనిచేశాయని చెప్పవచ్చు. ప్రజాస్వామ్య అధ్యయన రంగంలో అందుబాటులో ఉన్న సాహిత్యాన్ని ఇవి సుసంపన్నం చేశాయి. ఈ క్రమంలోనే ఆయనకు ఎన్నో అవార్డులు, రివార్డులు లభించాయి. 1995లో జర్మనీలోని ఫ్రెడ్రిచ్ ఎబర్ట్ ఫౌండేషన్ ఫెలోషిప్ ద్వారా ఆయన బుండెస్టాగ్ కమిటీల పనితీరును అధ్యయనం చేసే అవకాశం పొందారు. 2002లో నిర్భయ జర్నలిజానికి గాను బిపిన్ చంద్ర పాల్ సమ్మాన్, 2010లో కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారం, 2025 ఫిబ్రవరిలో హర్యానాలోని ఎస్‌జిటి విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డి.లిట్ ఆయనకు లభించాయి. తాజా 'పద్మభూషణ్' ఆయన కీర్తికిరీటంలో మరో కలికితురాయి.

బిబేక్ డెబ్రాయ్‌ది భారత మేధో ప్రపంచంలో అరుదైన సమన్వయ వ్యక్తిత్వం. ఆయన కేవలం ప్రముఖ ఆర్థికవేత్త మాత్రమే కాదు.. విధాన సలహాదారు, ఆలోచనావేత్త, రచయిత, అలాగే ప్రాచీన భారతీయ తత్త్వసాహిత్యాన్ని ఆధునిక ప్రపంచానికి అనుసంధానించిన విశిష్ట పండితుడు. ఆర్థిక విధానాలు, పాలన, న్యాయ సంస్కరణలు, సంస్కృత గ్రంథాల అధ్యయనం.. వంటి విభిన్న రంగాల్లో ఆయన చేసిన కృషి భారత మేధోచరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. 1955 జనవరి 25న జన్మించిన డా.డెబ్రాయ్ విద్యా ప్రయాణం అసాధారణమైనది. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కాలేజీలో ఆర్థిక శాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసి, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. అనంతరం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్‌సి డిగ్రీ సాధించారు. ఈ బలమైన విద్యా నేపథ్యం ఆయనను అంతర్జాతీయ స్థాయి ఆర్థికవేత్తగా తీర్చిదిద్దింది. వందకు పైగా పుస్తకాలు రచించిన లేదా సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించిన డెబ్రాయ్ రచనలు ఆర్థిక విధానాలు, పాలన, న్యాయం, మిథాలజీ వంటి రంగాలను సమగ్రంగా ఆవిష్కరిస్తాయి.

భారత జర్నలిజం చరిత్రలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ చైతన్యం, సామాజిక బాధ్యతలను ఒకే తాటిపై నిలబెట్టిన అరుదైన వ్యక్తిత్వాల్లో రాంబహదూర్ రాయ్ ప్రముఖుడు. 1946 జులై ఒకటో తేదీన ఉత్తరప్రదేశ్ ఘాజీపూర్ జిల్లా సోనాడి గ్రామంలో జన్మించిన రాయ్, విద్యార్థి దశలోనే సామాజిక, రాజకీయ అంశాలపై లోతైన ఆసక్తి పెంచుకున్నారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి 1969లో ఆర్థిక శాస్త్రంలో ఎంఎ పూర్తి చేసి, అనేక ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. తూర్పు పాకిస్తాన్ విముక్తి ఉద్యమంలో ఆయన భాగస్వామ్యం, ఆలోచనల విస్తృతిని ప్రతిబింబిస్తుంది. 2015లో ఆయనకు 'పద్మశ్రీ' పురస్కారం లభించింది. అవధేశ్ ప్రతాప్ సింగ్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. రాంబహదూర్ రాయ్ జర్నలిజం మాత్రమే కాక, ప్రజాస్వామ్య పరిరక్షణలో, ప్రజా చైతన్యంలో, విద్యాసామాజిక రంగాల్లో నిరంతర ప్రేరణగా నిలిచిన మేధావి.

— ఎస్‌విఆర్

# మారుతున్న 'సాహిత్య' నిర్వచనం

సాహిత్యం అంటే ఏమిటనే ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టం. నేటి కాలంలో ఇది మరింత సంక్లిష్టం. సాహిత్య నిర్వచనం రోజురోజుకూ కొత్త రూపాలను సంతరించుకుంటున్నది. ఒకప్పుడు గ్రంథాలు.. అత్యంత సంక్లిష్టమైన పదజాలంతో కూడిన రచనలే సాహిత్యంగా చెలామణి అయ్యేవి. తదనంతర కాలంలోశాస్త్రం, స్మృతికథనం, జర్నలిజం, రాజకీయ ఆలోచనల రంగాల్లో వెలువడుతున్న కొత్త తరహా రచనలు–మన కాలానికి నిర్వచనంగా మారిన ఒక సత్యాన్ని ఎదుర్కొంటున్నాయి. అదే వాతావరణ మార్పు, దానితో ముడిపడిన సామాజిక, ఆర్థిక, నైతిక సంక్షోభం. ప్రాచీన కాలపు మహా అంతరించుటల నుంచి హిమాలయ పర్వత ప్రాంతాల దైనందిన జీవితం వరకూ, పాడుబడ్డ నగర ప్రాంతాల నుంచి ప్రపంచ శక్తి నిర్మాణాల వరకూ–ఈ పుస్తకాలు అన్నీ కలిసి మనిషి ఎలా నిలబడగలడు, ఎలా అనుగుణంగా మారగలడు, ఎలా కొత్త జీవన దృక్పథాన్ని నిర్మించగలడో ప్రశ్నిస్తున్నాయి. సర్వైవింగ్ క్లైమేట్ త్‌ండ కేయాస్: డైనోసార్లు వాతావరణ మార్పు మరియు సహనశక్తి గురించి మాకు ఏమి నేర్పుతాయి (డిసెంబర్ 2025) అనే గ్రంథంలో ఇవాన్ జెవ్నికార్ భౌగోళికంగా అత్యంత దీర్ఘకాలమైన గతాన్ని ఆశ్రయించి మనకు దృష్టికోణాన్ని అందిస్తాడు. సాధారణ డైనోసార్ కథనాలకు భిన్నంగా, వాటి పరిణామాన్ని అప్పటి వాతావరణ మార్పులతో గాఢంగా అనుసంధానించి వివరిస్తాడు. 252 నుంచి 66 మిలియన్ సంవత్సరాల క్రితం కొనసాగిన మెసోజోయిక్ యుగంలో, ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే, కార్బన్ అధికంగా ఉన్న వాతావరణానికి అనుకూలమైన శరీర నిర్మాణం వల్ల డైనోసార్లు ఎదిగి, విస్తరించాయి. అయితే 66 మిలియన్ సంవత్సరాల క్రితం జరిగిన గ్రహశకలం ఢీకొనడం వలన ఏర్పడిన ఆకస్మిక వాతావరణ మార్పు, అత్యంత ప్రత్యేక లక్షణాలు కలిగిన (ప్రత్యేకంగా ఎగరలేని) డైనోసార్లు కూడా తట్టుకోలేని స్థాయిలో మారిపోయింది. నేటి మానవ చర్యల వల్ల జరుగుతున్న వాతావరణ మార్పులు కూడా అప్పటి ప్రకృతి విపత్తులను తలపిస్తున్నాయని జెవ్నికార్ చెబుతాడు. తీవ్రమవుతున్న తుఫాన్లను ట్రయాసిక్ కాలపు మాన్సూన్‌లతో పోల్చుతూ, శిలాజ ఇంధనాల దహనంతో వెలువడుతున్న కార్బన్ ఉద్గారాలను ప్రాచీన అగ్నిపర్వత కార్యకలాపాలతో అనుసంధానిస్తాడు. అయినప్పటికీ, ఆయన వినాశన భవిష్యత్తును ప్రవచించడు. అటవీ పునరుద్ధరణ, కార్బన్‌ను పట్టిపడేసే సాంకేతికతలు, వ్యక్తిగత స్థాయిలో వాతావరణ చైతన్యం వంటి పరిష్కార మార్గాలను సూచిస్తూ, మనిషిని బాధితుడిగా కాకుండా భూమి సంరక్షకుడిగా చూపిస్తాడు. ఇదే వాతావరణ మార్పును విశాల కాలప్రమాణంలో చూసిన జెవ్నికార్‌కు భిన్నంగా, అనురాధ రాయ్ రచించిన కాల్డ్ బై ద హిల్స్: ఎ హోమ్ ఇన్ ది హిమాలయ (జనవరి 2026) వ్యక్తిగత అనుభవాల ద్వారా ఈ సమస్యను మన ముందుకు తెస్తుంది. గత 25 సంవత్సరాలుగా రాణిఖేత్ కొండ ప్రాంతాన్ని తన నివాసంగా చేసుకున్న రాయ్, అడవుల్లో సంచరించే చిరుతలు, ఇళ్ల పైకప్పులపై ఆడే లంగూర్ కోతులు, తానే నాటిన చెట్ల కథలను మనతో పంచుకుంటుంది. ఆమె రచనలోని సహనం, వ్యక్తిగత స్పర్శ–ఆమె తోటను చూసుకునే విధానాన్ని తలపిస్తుంది. అయితే ఈ అందమైన చిత్రణ వెనుక, వాతావరణ మార్పు వల్ల ఋతువులు గందరగోళమవుతూ, ఒకప్పుడు శాశ్వతంగా అనిపించిన అడవులు అంతరించిపోతున్నాయనే విషాదం దాగి ఉంది.

ఈ పుస్తకం ఒకవైపు నివాసంపై ప్రేమలేఖగా, మరోవైపు నశిస్తున్న ప్రకృతిపై విలాపంగా నిలుస్తుంది. ఆశకు కేంద్రస్థానం ఇచ్చే గ్రంథం ఫ్రెడ్ పియర్స్ రాసిన డిస్ట్రస్ట్ ఇట్ ఆల్: ఎ హ్యాండ్‌బుక్ ఫర్ క్లైమేట్ హోప్‌ఫుల్స్ (ఫిబ్రవరి 2026). ఓటమి అనివార్యం అనే భావన మన ఆలోచనా పరిధిని సంకుచితం చేస్తుందని ఆయన వాదిస్తాడు. ఇది శాస్త్రీయ గ్రంథం కాదని చెప్పుకున్నప్పటికీ, స్పష్టమైన వివరణలు, విశ్వసనీయ ఆధారాలతో పాఠకుడిని విస్తృత చర్చ వైపు తీసుకెళ్తుంది. అసమానతలపై ఆయన చేసిన విశ్లేషణ ప్రత్యేకంగా ప్రభావవంతంగా ఉంటుంది. 1990 తర్వాత ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదలలో రెండుమూడవ వంతుకు కారణమైనది సంపన్నులైన 10 శాతం ప్రజలేనన్న వాస్తవాన్ని ఆయన ముందుంచుతాడు. వ్యక్తిగత జీవనశైలి మార్పులకంటే, సమిష్టి రాజకీయ, సాంకేతిక చర్యలే కీలకమని చెబుతూ, ఓజోన్ పొర రక్షణలో ప్రపంచ సమన్వయం సాధించిన విజయాన్ని ఉదాహరణగా చూపుతాడు. ఈ పుస్తకం ఆశను కల్పితంగా కాకుండా ఆధారాలతో నిలబెడుతుంది. సహనశక్తి అనే భావన హేజెల్ షెఫీల్డ్ రచించిన ఫ్రంటియర్‌ల్యాండ్స్ (ఫిబ్రవరి 2026)లో నిర్మిత పర్యావరణానికి విస్తరిస్తుంది. ప్రపంచంలో అత్యంత కేంద్రీకృత భూమి యాజమాన్యం ఉన్న దేశాల్లో యుకే ఒకటని ఆమె పేర్కొంటుంది. కర్మాగారాలు మూసివేయడం, అద్దెల పెరుగుదల కారణంగా వేలాది భవనాలు పాడుబడి ఉన్నాయని వివరిస్తుంది. అయితే నిరాశకు లోనవకుండా, కళాకారులు, సంఘటకులు, కార్మికులు కలిసి ఈ స్థలాలను తిరిగి సమాజానికి ఉపయోగపడేలా మార్చుతున్న కథలను ఆమె నమోదు చేస్తుంది. సమూహ యాజమాన్యం, తక్కువ కార్బన్ పునర్నిర్మాణం, స్థానిక ఉత్పత్తి– ఇవన్నీ వాతావరణ మార్పులకి తగినట్లు జీవించడానికి మార్గాలని ఈ గ్రంథం వాదిస్తుంది. చివరగా, రెబెక్కా సోల్నిట్ రచించిన ది బిగినింగ్ కమ్స్ ఆఫ్టర్ ది ఎండ్ నోట్స్ ఆన్ ఎ వరల్డ్ ఆఫ్ చేంజ్ (మార్చి 2026) నాగరికత స్థాయి మార్పును ప్రతిపాదిస్తుంది. నేటి ధ్రువీకరణ, నియంతృత్వ పునరుద్ధరణ, ప్రగతిశీల విలువలపై దాడులను ఆమె ఒక విస్తృత చారిత్రక ప్రవాహంలో ఉంచుతుంది. గర్భస్రావ వేదనలతో కొత్త జీవితం పుట్టే ఉపమానాల ద్వారా, ప్రస్తుత సంక్షోభం ఒక పాత వ్యవస్థ అంత్యదశ అని, కొత్త ప్రపంచ ఆరంభ సంకేతమని ఆమె చెబుతుంది. ఆదివాసీలకు భూమి తిరిగి ఇవ్వడం వంటి సంఘటనలు, ఉద్యమాల విజయాలు.. ఈ గ్రంథానికి ఆశకు బలమైన ఆధారాలు.ఈ పుస్తకాలన్నీ కలిపి ఒకే మాట చెబుతున్నాయి. వాతావరణ మార్పు ఒక శాస్త్రీయ సమస్య మాత్రమే కాదు; అది చారిత్రకమైనది, వ్యక్తిగతమైనది, రాజకీయమైనది. భవిష్యత్తు అనిశ్చితమైనదైనా, లొంగిపోవడం మాత్రమే మనకు ఉన్న మార్గం కాదని ఇవి గుర్తుచేస్తున్నాయి. గత అంతరించుటల నుంచి నేర్చుకోవడం, నశిస్తున్న ప్రకృతిని ప్రేమతో కాపాడటం, అసమానతలను ప్రశ్నించడం, సమాజాలను తిరిగి నిర్మించడం–ఇవన్నీ కలిసి మనిషి నిలబడటమే కాదు, కొత్త ప్రపంచాన్ని సృజించగలడని ఈ రచనలు విశ్వాసాన్ని కలిగిస్తున్నాయి.

ఈ వారం కవితలు

## దేశమా నీకు ఇదే వందనం

దేశమా నీకు ఇదే వందనం
గణతంత్ర మా నీకు ఘన స్వాగతం
ఈ దేశం నాది ఈ రాజ్యం నాది
అని ప్రతి పౌరుడుకి ఉండాలి
ప్రతి పౌరుడు సైనికుల పోరాడాలి!!

మూడు రంగుల జెండా మురిసిపోవాలి
భారతీయులంతా కలసి రావాలి
గణతంత్ర దినోత్సవ సంబరాలలో
మన దేశ ఖ్యాతి దిగంతాలు దాటాలే!!

నాటి నేతల స్ఫూర్తిని పునికి పుచ్చుకోవాలి
అభివృద్ధి బాటలో అడుగులు వేయాలి
భారతావని గుండెల్లో వెలుగులు నింపాలి
విజ్ఞాన గనిగా నింగినంటాలి
నా భారతదేశం!!

– దేవులపల్లి రమేశ్
9963701294

## రండి రండి పోదాం.. మేడారం జాతర.!

పల్లవి
జాతరంటే జాతర...
మేడారం జాతర.!
సమ్మక్క సారలమ్మలు
వెలిసినట్టి జాతర!

రెండేళ్ల కొకసారి
సాగేటి జాతర
తెలంగాణ కుంభమేళా
గిరిజనుల జాతర
కోట్లమంది భక్తులొచ్చే
ప్రఖ్యాత జాతర

కాకతీయ రాజులతో
పోరాడిన శివంగులంట
అవినీతిని ఎదిరించిన
త్యాగనిరతి వీరిదంట

కన్నెపల్లి సారలమ్మ
చిలుకలగుట్ట సమ్మక్కలు
కలుసుకునే రోజంట
నియంతపాలకుల
నిప్పులతో కడగమని
వేడుకొని వొద్దాము
యుద్ధం జేసిన నేలను
చూసొద్దాము.

– గద్దమీది చంద్రమోహన్ గౌడ్
9866510399

## గెలవాలి.. గెలవాలి..

గెలవాలి.. గెలవాలి..
ఆటల్లో గెలవాలి,
ఆత్మవిశ్వాసాన్ని కవచం చేసుకుని
శ్రమిస్తూ, చమట కారుస్తూ
మైదానంలో మెరుపులు చిందించాలి.

పాటల్లో గెలవాలి,
స్వరాల సవ్వడితో
మనసుల్ని దోచుకుని
హృదయాల్లో హరివిల్లులు
పూయించాలి.

మాటల్లో గెలవాలి,
మాధుర్యమే మంత్రంగా,
మంచితనమే మార్గంగా
వాక్యాలతో విజయాన్ని ముద్దాడాలి.

వేటలో గెలవాలి,
లక్ష్యాన్ని కళ్లలో నిలిపి,
ఓర్పును ఒడిలో పెట్టుకుని
సాధనతో సాఫల్యం అందుకోవాలి.

చేతల్లో గెలవాలి,
కష్టాన్ని కౌగిలించుకుని,
కళగా మలచిన పనితో
సమాజానికి నైపుణ్యం చూపాలి.

రాతల్లో గెలవాలి,
అక్షరాలకు ప్రాణం పోసి,
భావాలకు రెక్కలు కట్టి
సాహిత్యంలో చిరంజీవిగా నిలవాలి.

పోటీల్లో గెలవాలి,
ఈర్ష్యను పక్కన పెట్టి,
ప్రతిభతో ముందుకు దూకి
విజయ మేడలు అధిరోహించాలి.

జీవితంలో గెలవాలి,
పతనాల్లో పాఠాలు నేర్చుకుని,
విజయాల్లో వినయం నిలిపి
భవిష్యత్తును బంగారం చేసుకోవాలి.

– గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం


## చదవాల్సిన పుస్తకం

### ఆత్మశోధనే 'త్వమేవాహం'



ప్రఖ్యాత తెలుగు కవి, రచయిత అరుద్ర (పూర్తి పేరు: భాగవతుల సదాశివ శంకర శాస్త్రి) రచించిన 'త్వమేవహం' ఆధునిక తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రాముఖ్యమైన కావ్యంగా గుర్తింపు పొందింది. ఈ గ్రంథం పేరు అర్థం 'నీవే నేను' (నువ్వూ నేనూ సమానం) అన్న తాత్విక భావాన్ని వ్యక్తం చేస్తుంది. స్వాతంత్ర్యం అనంతర కాలంలో, ముఖ్యంగా 1948లో హైదరాబాద్ సంస్థానంలో జరిగిన రజాకార్ ఉద్యమం సమయంలో చోటుచేసుకున్న హింస, అరాచకత్వం, సామాజిక అసమానతలే ఈ కావ్యానికి నేపథ్యం. సమకాలీన రాజకీయ–సామాజిక పరిణామాలను కవిత్వ రూపంలో విశ్లేషించిన అరుదైన రచనగా ఇది నిలుస్తుంది. ఈ కావ్యంలో కథానిర్మాణం సాంప్రదాయ పద్ధతిలో కాకుండా, ఒక అలంకారాత్మక భావనపై ఆధారపడి ఉంటుంది. ఇందులో మరణం ఒక వ్యక్తిగా అవతరించి మనిషితో మాట్లాడుతుంది. 'నువ్వూ నేనూ వేరు కాదు' అని ప్రకటించడం ద్వారా, హింసకు పాల్పడేవాడు.. బలయ్యేవాడు, అధికారి... పీడితుడు అన్న భేదాలు చివరికి ఒకే మానవ వాస్తవంలో కలిసిపోతాయని రచయిత సూచిస్తాడు. ఈ రచనపై మార్క్సిస్టు/కమ్యూనిస్టు దృక్కోణం స్పష్టంగా కనిపిస్తుంది. సమాజాన్ని వర్గాలుగా విభజించి, అధికార సంబంధాలు ఎలా పనిచేస్తాయో అరుద్ర కవితాత్మకంగా ఆవిష్కరించాడు. ఇందుకోసం ఆయన వినూత్న సాహిత్య పరికరాలను వినియోగించాడు. కాలాన్ని చూపించడానికి కల్పిత ఇసుకగడియారం, నీటిగడియారంలను ఉపయోగించాడు. ఇందులో గంటలు ధనిక వర్గానికి ప్రతీకగా, నిమిషాలు మధ్యతరగతిని సూచించగా, క్షణాలు కార్మిక వర్గాన్ని ప్రతినిధ్యం వహిస్తాయి. అదేవిధంగా, స్టాప్‌వాచ్‌ను విప్లవానికి చిహ్నంగా, తాళం చెవిను విప్లవాన్ని రగిలించే శక్తిగా, అలారంను సమాజానికి ఇచ్చే హెచ్చరికగా రూపకంగా వినియోగించడం ఈ కావ్యానికి విశేష బలాన్ని ఇచ్చింది. విమర్శకుల దృష్టిలో 'త్వమేవహం' స్వాతంత్ర్యం తర్వాత కాలంలో రచించబడిన అత్యుత్తమ తెలుగు కావ్యాల్లో ఒకటి. భావపరంగా గాఢత, శైలిలో ఆధునికత, సామాజిక స్పృహ... ఈ మూడింటి సమ్మేళనంగా ఇది ప్రత్యేక స్థానం సంపాదించింది. కేవలం కవిత్వం మాత్రమే కాక, ఒక కాలపు చైతన్యాన్ని ప్రతిబింబించిన సాహిత్య పత్రంగా ఇది విలువైనదిగా భావించబడుతుంది. ప్రస్తుతం ఈ గ్రంథం వివిధ పుస్తక విక్రయ కేంద్రాలలో అందుబాటులో ఉంది. 'త్వమేవహం' అరుద్రను కేవలం కవిగా కాక, సమాజాన్ని ప్రశ్నించిన ఆలోచనాశీలిగా నిలబెట్టిన మైలురాయి రచనగా చెప్పవచ్చు.

### మార్క్సిస్టు తత్వాన్ని ఆవిష్కరించిన 'ది థియరీ ఆఫ్ నాలెడ్జ్'




బ్రిటిష్ మార్క్సిస్టు తత్వవేత్త మారిస్ కార్న్‌ఫోర్త్ రచించిన 'ది థియరీ ఆఫ్ నాలెడ్జ్' మార్క్సిస్టు తత్వశాస్త్రంలో అత్యంత కీలకమైన గ్రంథాలలో ఒకటి. ఈ పుస్తకం ముఖ్యం గా జ్ఞానం ఎలా ఏర్పడుతుంది, అది వాస్తవంతో ఏవిధంగా సంబంధం కలిగి ఉంటుంది అనే ప్రశ్నలకు మార్క్సిస్టు–ద్వంద్వ భౌతికవాద దృష్టితో సమాధానం ఇస్తుంది. తత్వశాస్త్రాన్ని అబ్స్ట్రాక్ట్ చర్చల నుంచి బయటకు తీసుకుని, సామాజిక–చారిత్రక వాస్తవాలతో అనుసంధానించిన రచనగా దీనికి ప్రత్యేక స్థానం ఉంది. 'ది థియరీ ఆఫ్ నాలెడ్జ్'లో కార్న్‌ఫోర్త్, తత్వశాస్త్రంలో ఉన్న ఆదర్శవాదం, యాంత్రిక భౌతికవాదం.. రెండింటినీ విమర్శిస్తాడు. జ్ఞానం అనేది కేవలం మనస్సులో పుట్టే ఆలోచన మాత్రమే కాదు, అలాగే అది ఒక స్థిరమైన ప్రతిబింబం కూడా కాదని స్పష్టం చేస్తాడు. జ్ఞానం అనేది మనిషి–ప్రకృతి–సమాజం మధ్య నిరంతర పరస్పర చర్య ఫలితం అని ఈ గ్రంథం ప్రధానంగా వాదిస్తుంది. ఈ పుస్తకంలో కార్న్‌ఫోర్త్ శాస్త్రీయ అభివృద్ధి, సామాజిక మార్పులు, మానవ శ్రమ పాత్రను ఉదాహరణలతో వివరిస్తాడు. తత్వశాస్త్రాన్ని సామాన్య పాఠకుడికి అర్థమయ్యేలా స్పష్టమైన భాషలో చెప్పడం ఈ గ్రంథానికి బలమైన అంశం. అందువల్ల ఇది కేవలం తత్వవేత్తలకే కాదు, రాజకీయ కార్యకర్తలకు, విద్యార్థులకు కూడా ఉపయోగపడే రచనగా నిలుస్తుంది. ఈ పుస్తకం పూర్తిగా మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతం మీద ఆధారపడి ఉంటుంది. ఇందులోని ముఖ్యమైన మార్క్సిస్టు భావనలను పరిశీలిస్తే, మొదటిది భౌతిక ప్రపంచం మనస్సుకు ముందే ఉంది. ఆలోచనలు, భావనలు, సిద్ధాంతాలు అన్నీ భౌతిక వాస్తవం నుంచి పుట్టినవే. ఇది మార్క్సిజంలో మౌలికమైన సిద్ధాంతం. చైతన్యం వాస్తవాన్ని నిర్ణయించదు; వాస్తవమే చైతన్యాన్ని నిర్ణయిస్తుంది అనే మార్క్సిస్టు భావనను ఈ గ్రంథం బలంగా ప్రతిపాదిస్తుంది. ఇందులోని రెండో అంశం, జ్ఞానం స్థిరంగా ఉండదు.. అది అభివృద్ధి చెందుతుంది, మారుతుంది.



ఈ మార్పు విరుద్ధాల సంఘర్షణ వల్ల జరుగుతుంది. నిజం–తప్పు, సిద్ధాంతం–ఆచరణ, వ్యక్తి–సమాజం మధ్య జరిగే పరస్పర చర్యల ద్వారా జ్ఞానం మరింత ఉన్నత స్థాయికి చేరుతుందని కార్న్‌ఫోర్త్ వివరిస్తాడు. ఇది హెగెలియన్ డయలెక్టిక్స్‌ను భౌతికవాద పునాది మీద నిలబెట్టిన మార్క్సిస్టు దృక్కోణం. మూడవది, ఆచరణ అవసరాన్ని వివరిస్తుంది. మార్క్సిస్టు సిద్ధాంతంలో ఆచరణే సత్యానికి ప్రమాణం. కార్న్‌ఫోర్త్ కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా చెబుతాడు. మనిషి శ్రమ, సామాజిక చర్యలు, ఉత్పత్తి ప్రక్రియల ద్వారానే జ్ఞానం పరీక్షించబడుతుంది. కేవలం సిద్ధాంతం సరిపోదు; అది ఆచరణలో నిజమని నిరూపితమవాలి. నాలుగో అంశంగా జ్ఞానం, వర్గ స్వభావం గురించిన వివరణ ఉంటుంది. జ్ఞానం తటస్థమైనది కాదని, అది సమాజంలోని వర్గ సంబంధాలతో ముడిపడి ఉంటుందని కార్న్‌ఫోర్త్ వాదిస్తాడు. పాలక వర్గాలు తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఆలోచనా విధానాలను రూపొందిస్తాయి. అందువల్ల శాస్త్రం, తత్వశాస్త్రం కూడా ఒక వర్గ స్వభావం కలిగి ఉంటాయి. ఇది మార్క్సిస్టు ఐడియాలజీ విశ్లేషణకు కేంద్ర బిందువు. చివరగా ఆదర్శ వాదంపై విమర్శ. కాంట్, బర్క్‌లీ వంటి తత్వవేత్తల ఆదర్శవాద దృక్కోణాలను కార్న్‌ఫోర్త్ తీవ్రంగా విమర్శిస్తాడు. వాస్తవాన్ని మనస్సు సృష్టించిందని చెప్పే సిద్ధాంతాలు చివరికి సామాజిక మార్పును అడ్డుకుంటాయని ఆయన అభిప్రాయం. మార్క్సిజం మాత్రం వాస్తవాన్ని మార్చే శక్తి మనిషి సామూహిక ఆచరణలో ఉందని చెబుతుంది. మొత్తానికి 'ది థియరీ ఆఫ్ నాలెడ్జ్' ఒక తత్వశాస్త్ర గ్రంథం మాత్రమే కాదు; అది మార్క్సిస్టు ప్రపంచ దృష్టిని అర్థం చేసుకునే మార్గదర్శిని. జ్ఞానం ఎలా పుడుతుంది, అది సమాజంతో ఎలా ముడిపడి ఉంటుంది, ఆచరణ ఎందుకు కీలకం అన్న ప్రశ్నలకు ఇది స్పష్టమైన సమాధానాలు ఇస్తుంది. మార్క్సిజాన్ని సిద్ధాంతంగా కాకుండా, జీవితాన్ని అర్థం చేసుకునే శాస్త్రీయ పద్ధతిగా చూడాలనుకునేవారికి ఈ పుస్తకం అత్యంత ముఖ్యమైన గ్రంథంగా నిలుస్తుంది.

## పెంచికలపేట్‌లో వన్యప్రాణుల గణన

బొక్కివాగు ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్‌లో భాగంగా పెంచికలపేట్ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల గణన సర్వేను నిర్వహించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో మూడు రోజుల పాటు శాకాహార జంతువులు, మరో మూడు రోజులు మాంసాహార జంతువుల వివరాలను క్రోడీకరించారు. ఈ సర్వేలో అటవీ శాఖ సిబ్బందితో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అటవీ ప్రేమికులు పాల్గొన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ హరిత బొక్కివాగు ప్రాజెక్టును సందర్శించి అక్కడ ఉన్న వివిధ రకాల పక్షులను పరిశీలించారు. పక్షుల గణన కార్యక్రమంలో భాగంగా కెమెరాల సహాయంతో వాటి సంఖ్యను గుర్తించారు. ఎల్లూరు సర్పంచ్ చప్పిడి రవీందర్ పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. బొక్కివాగు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, పోర్రు మత్తడి వద్ద బ్రిడ్జి నిర్మించాలని, కట్టపై సిసి రోడ్డు వేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, ఈ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

## తహసీల్దార్ మొహమ్మద్ రహీముద్దిన్



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత శక్తివంతమైన వజ్రాయుధమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రాథమిక బాధ్యత అని సిర్పూర్ టి తహసీల్దార్ మొహమ్మద్ రహీముద్దిన్ పేర్కొన్నారు. 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలో విద్యార్థులు, అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దేశంలో 18 ఏండ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ప్రతి ఎన్నికల్లో విధిగా ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని భావితరాలకు అందించవచ్చని వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం కలిగిన మన దేశంలో ఓటు హక్కు ప్రాధాన్యతను పౌరులందరికీ తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజలను చైతన్యం చేస్తూ, ఓటు విలువపై అవగాహన కల్పించి అందరూ ఓటర్లుగా నమోదయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అదనపు తహసీల్దార్ బక్కయ్య, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జెండా ఆవిష్కరించిన డిసిసి ప్రెసిడెంట్ ఆంక్ష రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్:** గజ్వేల్ మున్సిపాలిటీ రెండో వార్డులో ఆదివారం కాంగ్రెస్ పార్టీ జెండాను సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో కలిసి ఆవిష్కరించారు.2వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా షహనాజ్ సమీర్ ను బలపరుస్తున్నట్లు స్పష్టం చేశారు. షహనాజ్ సమీర్ ను వార్డు ప్రజలు ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు పరచి అద్భుతమైన ప్రజాపాలన అందిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, రాబోయే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని, అలాగే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ లోని 20 వార్డుల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎంఎ వహీద్, పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకమైనది



**ప్రజాక్షం/భీమ్‌గల్ :** ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. 16వ ఓటరు జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వేల్పూర్ రోడ్డు లోని మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తహసీల్దార్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ప్రజాప్రతినిధులు ఓటర్ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పలు వీధుల గుండా జాతీయ ఓటరు దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించి బడాభీమ్‌గల్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద ఓటరు ప్రతిజ్ఞ చేసి మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉన్న పౌరులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎస్ఐ తిరుపతి, అధికారులు అశ్విన్‌బాబు, శ్రీనివాస్, సాయగౌడ్, మల్లేష్, స్వాతి, శ్రీనివాస్‌రెడ్డి, అజ్మత్, శివ, పల్లవి, హారిక, శారద, రజిత, అంజయ్య, చిన్నసాహెబ్, రాహుల్, నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## ముగిసిన డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు

ఫైనల్ విజేత కుంటాల టీమ్

**ప్రజాపక్షం/కుంటాల :** కుంటాల మండల కేంద్రంలో డివిజన్ స్థాయి ఆర్.ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి.భైంసా డివిజన్ పరిధిలోని కుంటాల, కుబీర్,లోకేశ్వరం,తానూర్,ముధోల్,భైంసా మండలాల ఆర్ఎంపీలు పోటీలలో తల పడ్డారు.ఫైనల్లో కుంటాల ,భైంసా జట్లు హోరాహోరీగా తలోపడ్డాయి..కుంటాల జట్టు ఫైనల్లో అద్భుతమైన ఆట తీరుతో ఫైనల్ విజేతగా నిలిచింది .రన్న రఫ్ గా భైంసా జట్టు నిలిచింది.గెలుపొందిన జట్టును సర్పంచ్ జక్కుల గజేంధర్,డివిజన్ అధ్యక్షుడు ఆశ మొల్ల మోహన్,ఉప సర్పంచ్ పరికిపండ్ల వెంకట రమణలు మె మోంటో,కప్పు ను అందజేశారు.రాష్ట్ర ఆర్ఎంపీల సంఘం నా యకులు రమేష్ యాదవ్,ఆర్గనైజర్‌లు ఓడ్నామ్ రమేష్ ,సట్ల శ్రీను,పెద్ద కాపు మల్లేష్,బోనగిరి రవికుమార్,దేవేందర్,సట్ల శ్రీనివాస్,నవీన్,బోజన్న,వివిధ మండలాల ఆర్ఎంపీలు, నిర్మల్ ,భైంసా ప్రముఖ వైద్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# రూ.రెండు వందల కోట్లతో మెదక్ అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



**ప్రజాపక్షం/మెదక్ :** రెండు వందల కోట్లతో మెదక్ పట్టణ అభివృద్ధి జరుగుతుందని,ప్రస్తుతంగా అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, అభివృద్ధిని చూసి పట్టణ ప్రజలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు స్పష్టం చేశారు. సర్వే ప్రకారం మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులకు అవకాశం ఉంటుందని,అవకాశం లేని వారికి పార్టీలో మంచి గుర్తింపు, నామినేటెడ్ పదవులు కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటామని హన్మంతరావు తెలిపారు.ఆదివారం మెదక్ జిల్లా కేంద్రం లోని వెంకటేశ్వర గార్డెన్స్ లో పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నేత చింతల నర్సింలు తన అనుచరులు,పార్టీ శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి మైనంపల్లి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మెదక్ పట్టణ అభివృద్ధి జరగడం లేదని మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. 10 ఏండ్లు పాలించిన బీఆర్ ఎస్ నేతలు ఎంత అభివృద్ధి చేశారో అందరికి తెలిసిందని ఎద్దేవా చేశారు. మెదక్ వచ్చి హరీష్ రావు మాటలని కోరారు. ఇసుక దొంగలు హరీష్ రావు,కేటీఆర్‌ని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ లో పటిష్టమైన క్యాడర్ కాంగ్రెస్ పార్టీకి ఉందని,ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ని ఏడుపాయలకు,మెదక్ చర్చికి తీసుకొచ్చిన ఘనత మాదేనన్నారు. జిల్లాలో వరదలు వచ్చినపుడు సీ ఎం వచ్చి సహాయం చేశాడని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రతి ఇంటి గడప, గడపకు వివరించి చెప్పి ఎన్నికల్లో ఓట్లు అడగాలని నాయకులకు, కార్యకర్తలకు మైనంపల్లి సూచించారు. టీపీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, పట్టణ అధ్యక్షులు గంగాధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నాయకులు మధుసూదన్ రావు, రాగి అశోక్, వెంకట రమణ, శంకర్, పరుశురాంగౌడ్, కిరణ్ గౌడ్, బొద్దుల కృష్ణ, భూపతి రాజుతో పాటు సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలి



**ప్రజాక్షం/నిజామాబాద్ :** ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కును ఓటర్లు తప్పక వినియోగించుకోవాలని వక్తలు సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటర్లుగా నమోదు కావలని సూచించారు. 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ అంకిత్ ముఖ్యఅతిథిగా ప్రధానంగా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అనంతరం భారత ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేశ్‌కుమార్ సందేశం వినిపించారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఎన్నికల సంఘం పకడ్బందీగా ఎన్నికలు జరిపిస్తోందని ప్రతిసారి వినూత్న పద్ధతులను ప్రవేశపెడుతూ ప్రజలలో చైతన్యాన్ని పెంపొందిస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధంతో ఓటర్లు తమకు నచ్చిన వారిని పాలకులుగా ఎన్నుకునే అవకాశం రాజ్యాంగం కల్పించినందున ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సర్వేలో ముందున్న వారికే టికెట్లు




**ప్రజాక్షం/నిజామాబాద్ :** సర్వేలో ముందున్న వారికే టికెట్లు ఇవ్వనున్నామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి, జిల్లా మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్పోరేషన్ సహా జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగురవేయటమే లక్ష్యంగా నాయకులు సమరశంఖం పూరించారు. సర్వేలో ముందున్న వారికే టికెట్లు అనే నినాదంతో అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ మాట్లాడుతూ కష్టపడి పని చేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. మైనార్టీల మద్దతుతో క్లీన్ స్వీప్ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రజల్లో చెప్పుకుని సులువుగా గెలవచ్చన్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సర్వే ఆధారంగానే టికెట్ల కేటాయింపు ఉంటుందని కాంగ్రెస్ శ్రేణులు అర్థం చేసుకోవాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి హోదాలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తూకీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని దీనికి క్రమశిక్షణే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## ఇద్దరు మెడికల్ ఉద్యోగులపై కలెక్టర్ వేటు

ఒకరు సస్పెండ్, ఒకరికి షోకాజ్ నోటీస్



**ప్రజాపక్షం/మెదక్ :** ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను హెచ్చరించారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ దవాఖాన లో పబ్లిక్ హెల్త్ డయాగ్నటిక్ ల్యాబ్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ దవాఖాన లో ఉన్న పబ్లిక్ హెల్త్ డయగ్నటిక్ లాబొరేటరీలో ఇద్దరి ఉద్యోగులు గైర్హాజర్ అయినట్లు కలెక్టర్ తనిఖీ లో రుజువైనందున ల్యాబ్ టెక్నీషియన్ ను సస్పెండ్ చేశారు. ల్యాబ్ మేనేజర్ కు షోకాజ్ నోటీసులు అందించారు. ఎవరైనా ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం చేస్తే, సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవన్నారు.

# భక్తుల సౌకర్యార్థం 24 గంటల వైద్య శిబిరం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్. అనిత

**ప్రజాపక్షం / మంచిర్యాల :** సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే భక్తుల ఆరోగ్య సంరక్షణ కోసం మంచిర్యాల జిల్లా కేంద్రంలో 24 గంటల పాటు అందుబాటులో ఉండే ఆదివారం వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్. అనిత ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిత మాట్లాడుతూ జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా తక్షణ చికిత్స అందించేలా వైద్యులను, సిబ్బందిని అందుబాటులో ఉంచామని తెలిపారు. అత్యవసర మందులతో పాటు ప్రథమ చికిత్స కిట్లు సిద్ధంగా ఉన్నాయని, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీలత, డాక్టర్ రమ్య, డాక్టర్ అమన్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రశాంతి, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు. 16 వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మెదక్ జిల్లా కేంద్రం లోని మున్సిపాలిటీ కార్యాలయం నుండి బాలుర జూనియర్ కళాశాల మైదానం వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ జిల్లా అధికారులు, ఓటర్లలందరితో ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని అందరు ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించాలని, ప్రతి ఒక్కరు ఓటు హక్కుపై అవగాహనా కలిపించికోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. 18 సంవత్సరాలు పూర్తి అయిన ఎనిమిది మందికి ఓటు హక్కు కలిపిస్తూ బ్యాడ్జీలు పంపిణి చేశారు.



ప్రజాస్వామ్యములో 85 సంవత్సరాల నుండి ఓటు హక్కు వినియోగించుకున్న ముగ్గురు సీనియర్ సిటిజన్స్‌కు శాలువాలతో సన్మానం చేశారు. అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, వ్యవసాయ అధికారి దేవకుమార్ , ఉద్యోగులు,విద్యార్థులు, పాల్గొన్నారు.

## వాసవి స్కూల్స్ వార్షికోత్సవ వేడుకలు

'వాసవీ దర్పణ్-ప్రతిభకు ప్రతిబింబం'

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని వాసవి స్కూల్స్ వార్షికోత్సవ వేడుకలు "వాసవీ దర్పణ్‌ప్రతిభకు ప్రతిబింబం" శీర్షికతో ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిర్మల్ (ఏ.ఎస్.పి)శ్రీ ఉపేందర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా డీఈఓ డి.భోజన్న,ఇప్ప ముత్యం రెడ్డి (అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆదిలాబాద్) హాజరై దీప ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.విద్యార్థులు వివిధ రాష్ట్రాల సంప్రదాయాలను ప్రతిబింబించే నృత్యాలు,భక్తి గీతాలు,దేశభక్తి గేయాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.వారి ప్రదర్శనలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయి. వాసవి వరల్డ్ స్కూల్ విద్యార్థులు రూపొందించిన "నిర్మల్ టూరిజం" వైబ్‌సైట్‌ను ()ఏ.ఎస్.పి ఉపేందర్‌రెడ్డి,నిర్మల్ జిల్లా డీఈఓ డి.భోజన్న,చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ వెబ్‌సైట్ ద్వారా నిర్మల్ జిల్లా పర్యాటక ప్రాధాన్యతను ప్రపంచానికి చాటే ప్రయత్నం అభినందనీయమని వలువురు విద్యార్థులను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రసంగించిన డి.ఈవో భోజన్న నేటి తరం విద్యార్థులు సాంకేతికత ఆధారిత విద్య, వినూత్న ఆలోచనలు,సృజనాత్మకత ఎంతో అవసరమని,వాటిని నేర్చుకుంటూ విద్య విలువలను పెంపోందించుకోవాలని నిర్మల్ జిల్లా స్థానాన్ని విద్యారంగంలో ముందుంచాలని వారు కొనియాడారు.అనంతరం వారిని పాఠశాల యాజమాన్యం శాలువా సరస్వతీమాత మెమొంటోతో సన్మానించడం జరిగింది.పాఠశాల ప్యాట్రన్ ఇ లింగ రెడ్డి,కార్యదర్శి జగదీశ్‌రెడ్డి,కరస్పాండెంట్ ఇ. పోతారెడ్డి,ప్రిన్సిపల్స్,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.




# నిర్మల్‌లో అందుబాటులోకి కార్పోరేట్ వైద్యం

మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి

అత్యాధునిక లేజర్ హెయిర్ రిమూవల్ యంత్రాన్ని ప్రారంభించిన చక్రవర్తి




**ప్రజాపక్షం/నిర్మల్ :** ఒకప్పుడు కేవలం మహానగరాలకే పరిమితమైన ఖరీదైన కార్పొరేట్ వైద్య సేవలు,ఇప్పుడు నిర్మల్ లాంటి పట్టణ ప్రాంతాలకు విస్తరించడం ఎంతో అభినందనీయమని నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చ క్రవర్తి అన్నారు.ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాంధీ చర్మ వ్యాధుల ఆసుపత్రి() లోఏర్పాటు చేసిన అత్యంత అధునాతనమైన 'లేజర్ హెయిర్ రిమూవల్'(అవాంచిత రోమాల నిర్మూలన చికిత్స) యంత్రాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అప్పాల గణేష్ చక్రవర్తి మాట్లాడుతూ..గతంలో లేజర్ చికిత్సలు లేదా చర్మ సంబంధిత అత్యాధునిక ఆపరేషన్లు చేయించుకోవాలంటే సామాన్యులు హైదరాబాద్,ముంబై లేదా ఢిల్లీ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు.

### తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం

వైద్యులు కేవలం లాభాపేక్షతో కాకుండా, సామాజిక బాధ్యతతో అత్యాధునిక సాంకేతికతను స్థానికులకు తక్కువ ధరకే అందించాలని ఆయన కోరారు.నిర్మల్ పట్టణాన్ని వైద్య హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఇటువంటి ప్రయాత్నాలు ఎంతో దోహదపడతాయని,స్థానిక వైద్యులు ,గ్లోబల్ టెక్నాలజీని ఇక్కడికి తీసుకురావడం గర్వకారణమని కొనియాడారు.ఈ సందర్భంగా గాంధీ అండ్ ఐ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ బి.అమరేశ్వర్,డాక్టర్ శృతి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కొత్త లేజర్ మెషిన్ ద్వారా అత్యంత సురక్షితంగా,ఎటువంటి నొప్పి లేకుండా చికిత్స అందిస్తామని వివరించారు.స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ డైరెక్టర్ నేరెళ్ల ప్రమోద్,ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్ గౌడ్,మాజీ కౌన్సిలరు కొండ సబిత శ్రీధర్,గోపు గోపి,సైన్ల శ్రీధర్ ,పట్టణ ప్రముఖులు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గజ్వేల్‌పై కెసిఆర్ సవతితల్లి ప్రేమ

మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్ :** సవతి తల్లి ప్రేమ చూపిస్తూ గజ్వేల్ ప్రజల సొమ్మును అప్పనంగా మేస్తున్న ఎమ్మెల్యే కెసిఆర్ పదవి పట్టుకొని వేలాడుతుండడం సిగ్గుచేటని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులలో జెండా పండుగ నిర్వహించిన వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను అండగా నిలిచి ఆశీర్వదించాలని, తద్వారా గజ్వేల్ అభివృద్ధి సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. అందుకు భిన్నంగా కెసిఆర్ కు ఓటు వేస్తే సిద్ధిపేటలో మాత్రమే అభివృద్ధి జరుగుతుందని, గత ప్రభుత్వ హయాంలో గజ్వేల్ పై సవతి తల్లి ప్రేమ చూపించిన ఆయన సిద్దిపేట, చింతమడకకు నిధుల వరద పారించినట్లు విమర్శించారు. గత రెండేళ్లుగా ఇక్కడి ప్రజలకు కేసీఆర్ అందుబాటులో ఉండకపోగా, సిద్ధిపేట పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు అంక్షా రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి, సర్పంచులు ఛానరెడ్డి, కర్ణాకర్, అమరేందర్, పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శిలు మొనగారి రాజు, నక్క రాములు గౌడ్, నేతలు నాయిని యాదగిరి, సమీర్, అజహార్, సయ్యద్ మతిన్, రేగొండ గౌడ్, ఊడెం సారిక శ్రీనివాస్ రెడ్డి, షరీఫ్, గుంటుకు శ్రీనివాస్, గాడిపల్లి శ్రీనివాస్, జంగం రమేష్ గౌడ్, సత్తయ్య, నరేష్, నంగునూరి సత్యనారాయణ, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 5కోట్లతో అభివృద్ధి పనులు

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** గత కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిదులు మంజూరు చేయించగలిగామని, ఇందూరు అర్బన్ నియోజకవర్గం లో ప్రతి డివిజన్‌కు కోటి రూపాయల చొప్పున చేపడుతున్న అభివృద్ధి ప నులు కేవలం ఆరంభమేనని, రోబోయే రోజుల్లో మరింత పెద్ద స్థాయిలో అ భివృద్ధి కార్యక్రమాలు చేపడతామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. శనివారం సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో బ్రిడ్జి పనులకు భూమిపూజ పనులు ప్రారంబించారు.బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే అమ్మ వెంచర్, రింగ్ రోడ్డు ప్రాంతాలకు రాకపోకలు మరింత సులభమవుతాయని, భవిష్యత్తులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధికి కూడా అనుకూలంగా ఉంటుందన్నారు.

## మంచిర్యాల కార్పొరేషన్‌లో కాషాయ జెండా ఎగరేస్తాం

బిజెపి గర్మిళ్ల జోన్ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్

**ప్రజాపక్షం / మంచిర్యాల :** రాబోయే మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ గర్మిళ్ల జోన్ అధ్యక్షులు అమిరిశెట్టి రాజ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం కార్పొరేషన్ పరిధి లోని 12వ డివిజన్‌లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో ప్రజలు బిజెపికి బ్రహ్మరథం పడుతున్నారని, ఈసారి తమ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తెచ్చి మంచిర్యాలను స్మార్ట్ సిటీగా మారుస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరాలంటే బిజెపిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.



## ఓటు హక్కు తప్పక వినియోగించుకోవాలి: శివకుమార్




ప్రజాపక్షం/కరీంనగర్: ప్రజాస్వామ్య దేశంలో సామాన్య పౌరుడి ఆయుధం ఓటుహక్కు అని.. ఎన్నికల వేళ ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శివకుమార్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పాలకులను ఎన్నుకోవడంలో ప్రతి ఓటు ఎంతో కీలకమైందని అన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని, అప్పుడే ప్రజాస్వామ్యం మరింతగా పరిడవిల్లుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్ ప్రతిజ్ఞ చేశారు. ఉత్తమ సేవలు అందించిన ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలు, టెక్నికల్ మేనేజర్లు, బీఎల్వోలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. యువ ఓటర్లకు గుర్తింపు కార్డులు అందించా రు. పలువురు సీనియర్ సిటిజన్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులు పలు ప్రదర్శనలు ఇ చ్చారు. **ర్యాలీని ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్** :జాతీయ ఓటర్ దినోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియం నుంచి భగత్ సింగ్ చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ఈ ర్యాలీని ప్రారంభించారు. ఓటును మించి ఏది లేదు నేను కచ్చితంగా ఓటు వేస్తాను అనే నినాదంతో ర్యాలీ తీశారు. కరీంనగర్ క్రీడా పాఠశాల విద్యార్థులు, స్కౌట్, గైడ్స్ విద్యార్థులు, కలెక్టరేట్, రెవెన్యూ సిబ్బంది ఇతర శాఖల సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, జిల్లా క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, డీవైఎస్ఓ శ్రీనివాస్, జిల్లా యువజన అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట మున్సిపల్‌లో బడ్జెట్ దారి మళ్లిస్తున్నారు..



ప్రజాపక్షం/సిద్దిపేట: సిద్దిపేట మున్సిపాలిటీలో నిధులు దారి మళ్ళుతున్నాయని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అలంకుంట మహేందర్, సారి ఆనంద్,కౌన్సిలర్ రియాజుద్దీన్‌లు ఆరోపించారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షులు అత్తు ఆమామ్‌తో కలిసి వారు మాట్లాడుతూ సిద్దిపేట మున్సిపాలిటీలో ఇష్టారీతిగా బడ్జెట్ కేటాయింపులు చేస్తూ దోపిడికి పల్పడుతున్నారని అన్నారు. పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘంలో ఇప్పటికే ఫంక్షన్ హాలు పనులు మొదలయ్యాయని కానీ మున్సిపాలిటీలో 10 లక్షల మిగులు బడ్జెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. పట్టణంలోని 12వ వార్డులోని వ్యవసాయ క్షేత్రంలోని రోడ్డు వేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. కాలనీల్లో కొన్న చోట్ల రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సొంత పొలానికి రోడ్డు వేసుకోవడం టాక్స్‌ని దుర్వినియోగం చేయడమేనని అన్నారు. మున్సిపల్ జనరల్ ఫండ్ అనేది 43 వార్డుల్లోని పనులకు కేటాయించాలని దేవాలయాలకు,సంఘాలకు, మస్జీద్‌లకు తాము వ్యతిరేకమని ఉద్దేశపూర్వకంగా కొన్ని సంఘాలకు నిధులు కేటాయించడం దారుణమని అన్నారు. సిద్దిపేటలో కోమటి చెరువు తప్ప అభివృద్ధి కనిపించడం లేదని అన్నారు. పట్టణంలోని కొన్ని వార్డులకు మాత్రమే వాళ్ళకి అనుకూలమైన వారికి నిధులు కేటాయిస్తున్నారని మిగతావారిపై ఎందుకింత వివక్ష అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యానికి పునాది ఓటు




ప్రజాపక్షం/వీర్నపల్లి: ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అని, 18 సంవత్సరాలు నిండిని ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని వీర్నపల్లి గ్రామ సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న అరుణ్ కుమార్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు మండల నాయకులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం అని, సమర్థవంతమైన నేతలను ఎన్నుకునేందుకు భారత రాజ్యాంగం కల్పించిన సువర్ణ అవకాశం ఓటు హక్కు అని తెలిపారు. దేశం అభివృద్ధి దిశగా పయనించాలన్నా, సరైన ప్రభుత్వాలను ఎన్నుకోవాలన్నా ఓటరు చేతిలోనే ఉందని, ఎన్నికల సమయాల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా నిస్వార్థంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జక్కుల నరేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, వార్డు సభ్యులు భగవంతం, సంజీవ్, గోరెమియా, నవీన్, మహిళా సంఘం అధ్యక్షురాలు కళ, గ్రామ పెద్దలు గడ్డం దేవయ్య, లింబాద్రి, ఎల్లం, తిరుపతి, దేవయ్య, శేఖర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల్లో సమ్మక్క జాతర సందడి!



ప్రజాపక్షం/పాలకుర్తి: మరికొద్ది రోజుల్లో సమ్మక్క మహా జాతర ప్రారంభం కానుండటంతో పల్లెల్లో సందడి నెలకొంది. గృహాల్లో సమ్మక్క, సారాలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం పల్లెల్లో ప్రతి ఇంటా సమ్మక్క, సారాలమ్మలకు నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమను సల్లంగా చూడాలంటూ వనదేవతలను వేడుకుంటున్నారు. కుటుంబసభ్యులతో కలిసి మేడారం మహా జాతరకు తరలివెళ్లేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. అంతటా జాతర సందడి మొదలైంది.

# ధర్మపురి రూపురేఖలు మారుస్తా

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రజాపక్షం/ధర్మపురి: ధర్మపురి నియోజకవర్గ కేంద్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి పట్టణ రూపురేఖలు మారుస్తానని, రాబోవు 2027 గోదావరి నది పుష్కరాలు అంగరంగ వైభవంగా నిర్వహించి గొప్ప పుణ్యక్షేత్రంగా దేశవ్యాప్తంగా ధర్మపురి పేరు మారుమ్రోగేలా చేస్తానని రా ష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ధర్మపు రి పురపాలక పరిధిలో ఆదివారం మంత్రి రూ. 2 కోట్ల 54లక్షల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ధర్మపురి ప్రజల ఆశీర్వదించి ఎమ్మెల్యే గా గెలిపించి అసెంబ్లీకి పంపించారని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తున్నానని మంత్రి అన్నారు. ఆదివారం ధర్మపురి మున్సిపల్ పరిధిలో రూ.2 కోట్ల 54 లక్షలతో చేపట్టిన శంకుస్థాపనల్లో సీపీఆర్ నిధులు రూ.50 లక్షలు కాగా రూ.2 కోట్ల 4లక్షలు ఎస్డీఎఫ్ నిధులుగా పేర్కొన్నారు. 2009 నుండి ఎన్నికల్లో గెలిచినా ఓడినా ప్రజల మధ్య వుండి సమస్యల పరిష్కారానికి ప్రజలపక్షాన పోరాటం చేశానని గుర్తుచేశారు. దీనిని గుర్తించిన ధర్మపురి నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించారని, ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆశీస్సులతో మంత్రినయ్యాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. ధార్మిక క్షేత్రమైన ధర్మపురిలో రాబోవు పుష్కరాలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తామని చెప్పారు. దీనికోసం పట్టణంలోని అన్నివర్గాల ప్రజల సూచనలు స్వీకరించి ప్రణాళికతో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. బాసర నుండి మొదలుకొని భద్రాచలం వరకూ గోదావరి నది తీర దైవక్షేత్రాలలో జరుగు పుష్కరాల్లో భారీగా నిధులు కేటాయించి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గత ప్రభుత్వంలో మూతబడిన నైట్ కాలేజీ పునఃప్రారంభం చేశానని, ధర్మపురికి రెవెన్యూ డివిజన్ తీసుకురావడం, బస్సు డిపో ఏర్పాటు చేయడం త్వరలోనే పూర్తి కావడం జరుగుతుందని మంత్రి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు సంగనబట్ల దినేష్, వేముల రాజేష్, దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు జక్కు రవీందర్, నాయకులు చీపిరిశెట్టి రాజేష్, చిలుముల లక్ష్మణ్, సొల్ల భీమయ్య, ఐ.రామయ్య, వి.నాగలక్ష్మి, ఎస్.సంతోషి, పద్మ, ఎం. శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



## ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా కె.హైమావతి



ప్రజాపక్షం/సిద్దిపేట : రాష్ట్రంలో ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జాతీయ ఓటరు దినోత్సవం సంధర్భంగా ఎన్నికల సంఘం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ అవార్డును స్వీకరించారు. వీరితో పాటు దుబ్బాక శాసనసభ నియోజకవర్గ ఉత్తమ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా గరీమా అగ్రవాల్, ఉత్తమ బీఎల్‌వోగా బి.పుష్పలతలు అవార్డులను స్వీకరించారు. ఈ సంధర్భంగా జిల్లా అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

## 27న జరిగే బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు
# ఎఐటియుసి సంపూర్ణ మద్దతు

### టేకుమల్ల సమ్మయ్య ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి

ప్రజాపక్షం/కరీంనగర్: ఈనెల 27న దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గతంలో కేంద్ర ప్రభుత్వం తోటి బ్యాంకు ఉద్యోగుల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం ఐదు రోజుల పని దినాలను కల్పించాలని వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మెకు ఏఐటీయూసీ కరీంనగర్ జిల్లా సమితి తరఫున పూర్తి సంపూర్ణ మద్దతు తెలుపుతుంది. ఈ సందర్భంగా మల్ల సమ్మయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం బ్యాం కింగ్ రంగంలో ఐదు రోజుల పని విధానం గతంలో ఇచ్చిన హామీలను అమలుపై ప్రభుత్వం నుంచి ఏ లాంటి స్పష్టత ఇవ్వకపోవడం వలన బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు పోవాల్సి వస్తుందని దీనికి పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యతా రాహిత్యం వల్లనే ఈరోజు దేశ ప్రజలకు ఇబ్బంది జరిగే అవకాశం ఉన్నది. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ గతంలో కుదిరిన ఒప్పందాలను సైతం తుంగల తొక్కడం వల్లనే ఈ సమ్మెకు కారణం, 2017లో పదో దయపాక్షి ఏడో జెయింట్ నోటు ప్రకారం రెండు నాలుగో శనివారాలను సెలవులుగా ప్రకటించగా మిగతా రెండు శనివారాలను సైతం సెలవులుగా ప్రకటించాలనీ 2022–23 సంవత్సరంలో ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో రోజువారి పనిగంటల తో పాటు మరో 40 నిమిషాలను పెంచి మిగిలిన అన్ని శనివారాల్లో సెలవులు ప్రకటించేందుకు అంగీకారం తెలిపినప్పటికీ రెండేళ్లు కావస్తున్న కేంద్ర ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడంతో దేశ వ్యాప్తంగా అఖిల భారత స్థాయిలో బ్యాంకు ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 27వ తేదీన దేశవ్యాప్తకు బ్యాంకు ఉద్యోగుల సంఘాలు పిలుపునివ్వడం జరిగినది. ఈ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, లేకుంటే ఎఐటియుసి ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటంలో పాల్గొంటామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం.

## కాంగ్రెస్ జెండా ఆవిష్కరించిన వెలిచాల



ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్: కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ 64వ డివిజన్ ముకరంపురలో కాంగ్రెస్ జెండాను కార్పోరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్‌తో కలిసి క రీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు వెలిచాల రాజేందర్‌రావు ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఏసి మెకానిక్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కర్ర రాజశేఖర్, చక్రధర్‌రావు, అహ్మద్, మాజిద్ అలీ, రాజ్ కుమార్, బొబ్బిలి విక్టర్, డివిజన్ వాసులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కరీంనగర్ కలెక్టర్‌కు విశిష్ట గౌరవం

ప్రజాపక్షం/కరీంనగర్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి వేడుకల్లో కరీంనగర్ జిల్లాకు మరో విశిష్ట గౌరవం దక్కింది. ఎన్నికల నిర్వహణలో వినూత్న ఓటర్ల అవగాహన కార్యక్రమాలు, శిక్షణ, సామర్థ్యాభివృద్ధి రంగంలో చేసిన ఉత్తమ కృషికి గాను కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఈ అవార్డును కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్ దిశా నిర్దేశంలో ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర వహించే ఎన్నికల అధికారులు, సహాయక అధికారులు, పోలింగ్ సిబ్బంది, పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించడం,




సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచడం, పారదర్శకతతో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టడం ఈ అవార్డుకు ప్రధాన కారణంగా నిలిచాయి. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగం, ఎన్నికల అధికారులు, సిబ్బంది అందరి సమష్టి కృషి వల్లే ఈ అవార్డు సాధ్యమైంది అని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన ప్రతి ఒక్క అధికారికి అభినందనలు తెలిపారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన: మంత్రి పొన్నం

ప్రజాపక్షం/హుస్నాబాద్: తెలంగాణలో జరిగిన గత ఎన్నికల్లో అసెంబ్లి, ఎమ్మెల్సీ, సర్పంచు ఎన్నికల్లో కాం గ్రెస్‌కీ ఇచ్చిన మోజారిటి ఇచ్చి గెలిపించిన వారు నేడు హుస్నాబాద్ పట్టణంలో జరుగబోవు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు మెజార్టి సభ్యులను గెలిపించండి, హుస్నాబాద్ మున్సిపల్‌ను సమగ్రాభివృద్ధి చేసే బాధ్యత నాదేనని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు అన్నారు. ఆదివారం మంత్రి హుస్నాబాద్ పట్టణం లో కందుల కొనుగొలు కేంద్రంను ప్రారంబించారు. అ నంతరం పట్టణంలో జరుగుతున్న అగ్నిమాపక కేంద్రం పనులను 7.49లక్షలతో అధునికరించనున్న కొత్త చెరువు పనులకుశంకుస్తాపన, 3.5 కొట్లతో 5 వార్డులో మున్సపల్ స్థలంలో దుకాణల సముదాయంశంకుస్థాపన, 2.47 కొట్లతో మత్తడి మరమత్తు, 2.7 చెరువు మరమత్తు, జీఆర్అర్ కాలనిలో 30 లక్షలతో పైపులైను నిర్మాణం, డిఆర్ సిసి సెంటర్‌కు 27 లక్షల బ్రిడ్జి బెసిన్ ఏర్పటు , మున్సిల్ కార్యాలయం వద్ద ఫౌంటెన్, 7వార్డులో 2కోట్లతో దుకాణాల సముదాయం, చిన్న పిల్లల పార్కు, కాల్వ పనులకు పలు అభివృద్ధి పనులకు శంకుస్తాపన చేశారు. ఈ కార్యక్రమంలో లింగమూర్తి , బి శివయ్య, తిరుపతిరెడడి, మల్లికార్జున్, బంక చెందు, జయరాజ్‌తో పాటు ముఖ్య నేతలు పాల్గోన్నారు.



## గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం/బెజ్జంకి: గ్రామాల అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మానకొండూర్ ఎంఎల్‌ఏ టీపీసీసీ ఎస్సి సెల్ చైర్మెన్ డా.కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.ఆదివారం మండల పరిధిలోని రేగులపల్లి గ్రామంలో 27 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దడమే లక్ష్యమని అందుకు అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పని చేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గ దామోదర్,ఏఎంసీ చైర్మెన్ పులి కృష్ణ,సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షులు గూడెల్లి శ్రీకాంత్,సర్పంచ్ జంగిలి లక్ష్మీ తిరుపతి,ఉప సర్పంచ్ త్రిశూల్,నాయకులు రావుల నర్సయ్య,బైర సంతోష్,జెల్ల ప్రభాకర్,లింగం,శ్రీకాంత్,లింగరెడ్డి,భూమిరెడ్డి,తిరుపతి రెడ్డి,గైని శ్రీను,మాతంగి రమేష్,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి పొన్నం

ప్రజాపక్షం/కరీంనగర్: శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారి ప్రత్యేక పూజల్లో మంత్రి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యప్రభ వాహనంలో స్వామివారు విహరించగా ఈ వేడుకల్లో మంత్రి, సుడా చైర్మన్ పాల్గొన్నారు. అనంతరం మంత్రికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీఓ మహేశ్వర్, ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో కందుల సుధాకర్ పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



ప్రజాపక్షం/చొప్పదండి: మండల కేంద్రానికి చెందిన పలువురు నాయకులు కరీంనగర్ ఇందిరా భవన్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని , అందరికీ సముచిత స్థానం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. పార్టీలోకి వద్దూరి సరిత శ్రీనివాస్ దంపతులు, వద్దూరి రాజయ్య, సింహాచలం తులసి ప్రభాకర్ దంపతులు చేరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నిజానపురం చందు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పురం రాజేశం, తిరుపతి గౌడ్, గంగయ్య గౌడ్, అశోక్, వల్లాల కృష్ణహరి, రంగన్న, మునిగాల సుధాకర్, మునిగాల చందు, గుంటి స్వరూప, పిట్టల వెంకటేష్, లింగంపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కల సాకారం.. జన జాతరకు శ్రీకారం!

### వనదేవతల రాకకై 'గోయల్‌వాడ' ముస్తాబు!
### శోభాయమానంగా సమ్మక్క-సారలమ్మ గద్దెలు
### గోదావరినది ఒడ్డున శివాలయం పునర్నిర్మాణం
### సిసి రోడ్లు, దీపాలతో కాంతులీనుతున్న ప్రాంగణం

ప్రజాపక్షం/అంతర్గాం : జాతర మెరిసేలా, భక్తజనం మురిసేలా సమ్మక్క, సారాలమ్మ గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణంతో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రజల కల సాకారమైంది. ఈ రెండు జిల్లాల సరిహద్దున గోదావరి నది ఒడ్డున గోయల్‌వాడ జాతర అభివృద్ధిపరంగా నిలిచిపోనుంది. తమ ఇలవేల్పుగా, కోర్కెలు తీర్చే అమ్మవార్లుగా కొలుస్తూ భక్తులు గత నాలుగు దశాబ్దాలకు పైగా గోయల్‌వాడ జాతరకు వచ్చి సమ్మక్క, సారాలమ్మలకు మొక్కులు చెలిస్తున్నారు. గోదావరినది తీరాన జరిపే ఈ జాతర చరిత్ర ప్రాశస్త్యాన్ని మరింత ఇనుమడింపజేసేలా చేపట్టిన పనులు అద్భుతమని చెప్పాలి. ఒకప్పుడూ వేలాదిగా తరలివచ్చే భక్తులు నేడు లక్షలాది మంది అయ్యారు. ఏటేటా పెరుగుతున్న జాతర భక్తుల సౌకర్యార్థం గోయల్‌వాడ జాతర అభివృద్ధి తప్పనిసరి అని భావించిన రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. వన దేవతల గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణం ప్రతిష్టాత్మకంగా చేపట్టడంతో ఈ ప్రదేశం శోభాయమానంగా మారింది. సమ్మక్క, సారాలమ్మ గద్దెల చుట్టూ, ప్రాంగణం ప్రహరీ చుట్టూ ఇనుప చువ్వలతో గ్రిల్స్ ఏర్పాటు చేశారు. గద్దెలకు అనుకొని భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేసి ఇనుప పైపులతో బారికేడ్లు అమర్చారు. క్యూలైన్లలో వచ్చే భక్తులు నేరుగా దేవతలను దర్శనం చేసుకుని సురక్షితంగా బయటకు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. వీటికి రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సమ్మక్క, సారాలమ్మ, పడిగిద్దరాజు, గోవిందరాజు గద్దెల ప్రాంగణంలో రంగులతో ముగ్గులు వేశారు. గద్దెల మధ్యన కేంద్రీకృత విద్యుత్తు దీపాలను అమర్చారు. విద్యుత్తు దీపాల వెలుగుల్లో గద్దెల పరిసర ప్రాంతాలు రాత్రివేళల్లో కాంతులీనుతున్నాయి. ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు జాతర జరగనుండటంతో ఇప్పటికే ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ పలుమార్లు జాతర ప్రదేశానికి వచ్చి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాతరకు వచ్చే భక్తులు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను, జాతర కమిటి నిర్వాహకులకు సూచించారు. గోదావరి నదికి ఇరువైపుల ఉన్న పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలతో పాటు మహారాష్ట్ర, చత్తిస్‌ఘడ్ రాష్ట్రాలు, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు లక్షలాదిగా తరలిరానున్నారు. జాతర జరిగే నాలుగు రోజులపాటు భక్తుల రద్దీతో గోదావరినది తీర ప్రాంతమంతా జనసంద్రంగా మారుతోంది. రామగుండం పారిశ్రామిక ప్రాంతంతోపాటు గ్రామాల్లో ఎక్కడ చూసినా అంతటా జన జాతర సందడే కనిపిస్తోంది.





# తొలి ఓవర్లోనే హర్షిత్‌కు వికెట్



**టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న టీమిండియా**

పొట్టి సిరీస్‌లో వరుసగా రెండు విజయాలతో జోరుమీదున్న భారత్.. గువాహటిలోనే సిరీస్ పట్టేయాలనుకుంటోంది. హ్యాట్రిక్‌పై కన్నేసిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. టీ20ల్లోనూ గొప్పగా రాణిస్తున్న హర్షిత్ రానా తొలి ఓవర్లోనే న్యూజిలాండ్‌కు షాకిచ్చాడు. ఓపెనర్ డెవాన్ కాన్వే(1)ను పెవిలియన్ పంపి.. సూపర్ బ్రేకిచ్చాడు. ప్రస్తుతం రచిన్ రవీంద్ర, టిమ్ సీఫర్ట్ క్రీజులో ఉన్నారు. నాగ్‌పూర్, రాయ్‌పూర్‌లో దుమ్మరేపిన టీమిండియా గువాహటిలోనూ గర్జించేందుకు సిద్ధమైంది. ఈ వేదికపై గత నాలుగు మ్యాచుల్లో రెండొందలకుపైనే స్కోర్లు నమోదయ్యాయి. భారీ స్కోర్ నమోదయ్యే అవకాశమున్నందున కివీస్ హిట్టర్లకు చెక్ పెట్టేందుకు కెప్టెన్ సూర్య బౌలింగ్ అస్త్రాలను రంగంలోకి దింపుతున్నాడు. అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి స్థానంలో బుమ్రా, రవి బిష్ణోయ్ తుదిజట్టులోకి వచ్చారు. కివీస్ తుదిజట్టులోకి కైలీ జేమీసన్ వచ్చాడు.

**భారత తుది జట్టు**

సంజూ శాంసన్(వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), శివం దూబే, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, హర్షిత్ రానా, రవి బిష్ణోయ్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా.

**న్యూజిలాండ్ తుది జట్టు**

డెవాన్ కాన్వే, టిమ్ సీఫర్ట్(వికెట్ కీపర్), రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్‌మన్, డారిల్ మిచెల్, మిచెల్ శాంట్నర్(కెప్టెన్), కైలీ జేమీసన్, మ్యాట్ హెన్రీ, ఇష్ సోధీ, జాకబ్ డఫ్ఫీ.

## వరల్డ్‌కప్ కోసం ఫైనలిస్ట్‌తోనే వామప్ మ్యాచ్..!



రెండేళ్ల క్రితం బార్బడోస్‌లో టీ20 ప్రపంచకప్‌ను ఒడిసిపట్టిన భారత్ స్వదేశంలో ట్రోఫీపై కన్నేసింది. ట్రోఫీని నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉన్న సూర్యకుమార్ సేన ఇప్పటికే న్యూజిలాండ్‌తో సిరీస్‌లో అదరగొడుతోంది. వరల్డ్‌కప్ సన్నద్ధతలో భాగంగా కివీస్‌తో సిరీస్ ముగియగానే విశ్రాంతి తీసుకోకుం డా వామప్ మ్యాచ్ ఆడనుంది టీమిండి యా. గత సీజన్ ఫైనల్లో తలపడిన దక్షిణాఫ్రికాతోనే ప్రాక్టీస్ మ్యాచ్‌తో మెగా టోర్నీలో అడుగుపెట్టనుంది. స్వదేశంలో ఫిబ్రవరి 7వ తేదీ నుంచి మొదలయ్యే పొట్టి ప్రపంచకప్ కోసం భారత జట్టు పక్కాగా సిద్ధమవుతోంది. ఇప్పటికే దక్షిణాఫ్రికాను ఓడించిన టీమిండియా.. సొంతగడ్డపై ఐదుమ్యా చ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్‌ను వణికి స్తోంది. ఫిబ్రవరి1న సిరీస్ ముగియడమే ఆలస్యం.. ఫిబ్రవరి 3న ముంబై చేరుకో నుంది సూర్యకుమార్ సేన. మరసటి రోజే అక్కడి డీవై పాటిల్ మైదానంలో సఫారీలతో వామప్ మ్యాచ్ ఆడనుంది.

## ఐసిసి ఆహ్వానాన్ని స్వాగతిస్తున్నాం..

**భారత్‌లో ఆడేందుకు నిరీక్షణ : స్కాట్లాండ్**

ఐసిసి పురుషుల టీ20 ప్రపంచకప్‌లోకి స్కాంట్లాండ్ అనూహ్యంగా వచ్చేసింది. మొన్నటివరకూ ద్వైపాక్షిక సిరీస్‌లకు సన్నద్ధమైన ఆ జట్టు ఇప్పుడు వరల్డ్‌కప్ బరిలోకి దిగనుంది. బంగ్లాదేశ్ స్థానంలో ర్యాంకింగ్స్ ఆధారంగా బెర్తు సాధించిన స్కాంట్లాడ్. తమకు అవకాశం కల్పించినందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి)కి కృతజ్ఞతలు తెలిపింది. ఆ దేశ క్రికెట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ట్రుడీ లిండ్‌బ్లేడ ఐసిసి ఆహ్వానాన్ని స్వాగతిస్తున్నామని చెప్పాడు. భారత్‌లో వరల్డ్‌కప్ ఆడబోమన పతంపట్టిన బంగ్లాదేశ్‌కు షాకిస్తూ.. యూరప్ దేశమైన స్కాట్లాండ్‌కు అవకాశమిచ్చింది ఐసిసి. బంగ్లాదేశ్ బోర్డు డిమాండ్లు ఐసిసి నిబంధనలకు లోబడిలేనందున.. షెడ్యూల్ మార్చే ప్రసక్తే లేదని సిఇఒ సనోజ్ గుప్తా శనివారం ఐసిసికి లేఖ రాశాడు. దాంతో.. అధికారికంగా ప్రపంచకప్ బరిలోని 20 జట్ల జాబితాలోంచి బంగ్లాను తప్పించి.. స్కాట్లాండ్‌కు చోటు కల్పించారు. ప్రపంచకప్ బెర్తు ఆడలేకపోయామనే దిగులుతో ఉన్న స్కాట్లాండ్ క్రికెట్, ఆటగాళ్లు ఐసిసి ఆహ్వానంతో ఎగిరి గంతేశారు. 'శనివారం ఐసిసి నుంచి మాకు ఆహ్వానం అందింది. పురుషుల టీ20 ప్రపంచకప్ కోసం మీ జట్టును పంపిస్తారా? అని ఐసిసి మమ్మల్ని అడిగింది. అత్యున్నత క్రికెట్ బోర్డు ప్రతిపాదనను మేము స్వాగతించామ'ని ట్రుడీ లిండ్‌బ్లేడ వెల్లడించాడు. 'స్కాంట్లాండ్‌కు వరల్డ్‌కప్ ఆడే అవకాశమిచ్చిన ఐసిసికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఐసిసి అధ్యక్షుడు జై షా నిర్ణయాన్ని మా జట్టు తరఫున స్వాగతిస్తున్నాం. విశ్వవేదికపై.. లక్ష




లాదిమంది అభిమానుల మధ్య ఆడడం స్కాట్లాండ్ ఆటగాళ్లకు దక్కిన మహాద్భుత అవకాశం ఇది. ఊహించని పరిణామాలతో మాకు వరల్డ్‌కప్ బెర్తు దక్కిందనే విషయం మాకు తెలుసు. ఇప్పటివరకూ మా జట్టు విదేశీ పర్యటనలకు సిద్ధమవుతోంది. ఇప్పుడు భారత్‌లో ప్రపంచకప్ కోసం సన్నద్ధం కానుంది' అని క్రికెట్ స్కాట్లాండ్ చైర్మన్ విల్ఫ్ వాల్ష్ పేర్కొన్నాడు. త్వరలోనే స్క్వాడ్‌ను ప్రకటిస్తామని ఆయన తెలిపాడు.

# ఆరోగ్యం



## భవిష్యత్ మహమ్మారులతో జాగ్రత్త!

భవిష్యత్తులో వచ్చే మహమ్మారులను ఎదుర్కోవాలంటే అవసరమైన పని ఇప్పుడే మొదలుపెట్టాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. యుద్ధం లేని సమయంలోనే యుద్ధానికి సిద్ధమవుతున్నట్లుగా, మహమ్మారి రాకముందే దానికి ఎదురుగ నిలిచే వ్యవస్థలను నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. సూక్ష్మ జీవ శాస్త్ర (బ్యాక్టీరియాలజీ) ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థలు ఈ దిశగా కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. మహమ్మారిని ఎదుర్కోవడానికి పాలన, నిఘా వ్యవస్థలు, పరిశోధన, భాగస్వామ్యాలు అనే నాలుగు అంశాలు అత్యంత ముఖ్యమని అంటున్నారు. ఈ నాలుగు మూల స్తంభాలు సమన్వయంగా పనిచేసినప్పుడే, కొత్త అంటువ్యాధులు ప్రపంచాన్ని కుదిపేయకముందే వాటిని నియంత్రించే శక్తి దేశానికి కలుగుతుందని నిపుణుల అంచనా. ముఖ్యంగా భవిష్యత్తులో మహమ్మారులుగా మారే అవకాశం ఉన్న ప్రాధాన్యత గల రోగకారక సూక్ష్మ జీవాలపై ముందుగానే లోతైన పరిశోధన జరగాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు. మహమ్మారి నివారణ వ్యూహంలో కీలక అంశంగా పరిశోధన ఫలితాలను ప్రయోగాత్మక దశల వరకే పరిమితం చేయకుండా, కనీసం రెండో దశ క్లినికల్ ట్రయల్స్ వరకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇందుకోసం పరిశ్రమలతో భాగస్వామ్యంగా పనిచేయడం, సమర్థవంతమైన సరఫరా గొలుసులను అభివృద్ధి చేయడం, అవసరమైనప్పుడు వేగంగా స్పందించ గల సామర్థ్యాన్ని ప్రదర్శించడం దేశానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. మహమ్మారి వ్యాప్తి మొదటి వంద రోజుల్లోనే ఉపయోగపడే ప్రతిరోధక చర్యలను అందుబాటులోకి తీసుకురాగలగడం భవిష్యత్తు సిద్ధతలో కీలక లక్ష్యంగా ఉండాలని సూచించారు.




భవిష్యత్ మహమ్మారి సిద్ధత అనేది ఒక్క రంగానికి సంబంధించిన బాధ్యత కాదని, ఇది సమిష్టి ప్రయత్నం కావాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. శాస్త్రవేత్తలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, పాలన వ్యవస్థలు, ఆరోగ్య రంగం తదితర వ్యవస్థలన్నీ కలిసి పనిచేసినప్పుడే వేగవంతమైన, ప్రభావవంతమైన స్పందన సాధ్యమవుతుంది. ముందస్తు ప్రణాళికలు, నిరంతర పరిశోధన, సమర్థవంతమైన భాగస్వామ్యాలే భవిష్యత్తులో దేశాన్ని మహమ్మారుల నుంచి రక్షించే కవచంగా నిలుస్తాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది. సారాంశంగా చెప్పాలంటే, మహమ్మారులను ఎదుర్కోవడం అనేది సంక్షోభం వచ్చిన తర్వాత మొదలుపెట్టే పని కాదు. సంక్షోభం రాకముందే శాస్త్రీయంగా, వ్యవస్థాగతంగా సిద్ధమవడం అవసరం. ఈ రోజు చేస్తున్న పరిశోధనలు, నిర్మిస్తున్న వ్యవస్థలే రేపటి ఆరోగ్య భద్రతకు పునాదిగా మారతాయి. భవిష్యత్తు మహమ్మారుల ముప్పును తగ్గించాలంటే, ఇప్పుడే చర్యలు తీసుకోవడం కాలావసరమని నిపుణుల సూచన స్పష్టంగా చెబుతోంది.

ఇటీవల జరిగిన ఒక శాస్త్రీయ కార్యక్రమంలో, కొవిడ్19 మహమ్మారిని ఎదుర్కొనేందుకు చేపట్టిన చర్యలన్నీ శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలపై ఆధారపడి ముందుకు సాగాయని గుర్తు చేశారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వం మాత్రమే కాకుండా, దేశం మొత్తం, సమాజం మొత్తం భాగస్వాములుగా మారాయని తెలిపారు. పాలన, శాస్త్ర విజ్ఞానం, ప్రజల భాగస్వామ్యం కలిసి పనిచేసినప్పుడు మాత్రమే ఇలాంటి పెద్ద సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని కొవిడ్ అనుభవం స్పష్టం చేసిందని విశ్లేషించారు. కొవిడ్ కాలంలో సూక్ష్మ జీవ శాస్త్ర పరిశోధనా సంస్థలు పోషించిన పాత్రను కూడా నిపుణులు ప్రశంసించారు. వ్యాధి నిర్ధారణ కోసం ఆర్‌టీ–పీసీఆర్ పరీక్షలు నిర్వహించడం, వైరస్ వ్యాప్తిపై నిఘా పెంచడం, కొత్త రకాల వ్యాక్సిన్ అభివృద్ధికి దోహదపడడం, యాంటీవైరల్ ఔషధాల స్క్రీనింగ్ వంటి కార్యక్రమాలు దేశానికి ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ఇవి కేవలం అత్యవసర పరిస్థితుల్లోనే కాకుండా, భవిష్యత్తు సిద్ధతకు కూడా బలమైన పునాదిగా నిలుస్తాయని అభిప్రాయం వ్యక్తమైంది. భవిష్యత్తులో ఎదురయ్యే మహమ్మారులు తప్పనిసరిగా కొవిడ్ తరహాలోనే ఉంటాయని అనుకోవడం పొరపాటు అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొత్త రకాల వైరసులు, బ్యాక్టీరియా, లేదా ఔషధ నిరోధక సూక్ష్మ జీవాలు పెద్ద ముప్పుగా మారే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. అందుకే యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్, సహజ వ్యవసాయానికి సంబంధించిన సూక్ష్మ జీవాల పరిశోధన, బయోరిమిడియేషన్, నాడీ సంబంధిత వ్యాధులపై సూక్ష్మ జీవాల ప్రభావం వంటి రంగాల్లో కొనసాగుతున్న పరిశోధనలు భవిష్యత్తులో కీలకంగా మారతాయని విశ్లేషణ. సూక్ష్మ జీవ శాస్త్రంలో ఆవిష్కరణలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాకుండా, ప్రజల జీవితాలను ప్రభావితం చేసే విధంగా ఉండాలనే దృష్టి అవసరమని పరిశోధనా వర్గాలు భావిస్తున్నాయి. ప్రాథమిక పరిశోధనల నుంచి ఉపయోగకరమైన ఉత్పత్తులు, చికిత్సా విధానాలు, నిర్ధారణ సాంకేతికతలు వెలుగులోకి రావాలంటే అనువర్తిత పరిశోధనకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. దీనికి అనుగుణంగా బలమైన అనువర్తన వ్యవస్థను నిర్మించుకోవడం దేశానికి అత్యంత అవసరం.

## ఆదర్శ కమ్యూనిస్టు సీతారావమ్మ

**సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు**



**ప్రజాపక్షం/చింతకాని :** బ్రతికినంత కాలం ఎర్రజెండా చేతపట్టి నిబద్ధత గల కమ్యునిస్టుగా కొల్లి సీతారావమ్మ బ్రతికిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పేర్కొన్నారు. రాఘవాపురం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకురాలు కొల్లి సీతారావమ్మ దశదినకర్మ ఆదివారం రాఘవాపురంలో జరిగింది. ఈ సందర్భంగా బాగం హేమంతరావు రాఘవాపురంలో జరిగిన కార్యక్రమంలో సీతారావమ్మ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, కొండపర్తి గోవిందరావు, ఏపూరి లతాదేవి, తాటి వెంకటేశ్వర్లు, ఎర్ర బాబు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, మార్గం శ్రీను, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్‌రావు, రాఘవాపురం సర్పంచ్ కాంపల్లి కోటమ్మ, బస్వాపురం సర్పంచ్ ఆవుల నర్సింహారావు, దొబ్బల వెంగళరావు, కొల్లి శ్రీనివాసరావు, కొల్లి గోవిందరావు, కొండపర్తి బాలాజీ, కాంగ్రెస్ నాయకులు పెంట్యాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐని గెలిపిస్తే ప్రజల తరపున బలమైన స్వరం

**సిపిఐ యాద్రద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి**

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** త్వరలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో నిరంతరం ప్రజల కోసం సమస్యలపై ఉద్యమాలు నిర్వహించే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు శాఖ సమావేశం గుండెబోయిన స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి యానాల దామోదర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యం, డబల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ వంటి మౌలిక వసతుల పరిష్కారంలో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న పార్టీ సిపిఐ అన్నారు. మున్సిపాలిటీలో నిజమైన ప్రజాపాలన అందించగలదని, అన్ని వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్న సిపిఐ అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐని గెలిపించి ప్రజల స్వరం బలంగా వినిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమి తి సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, మండల కార్యదర్శి దాసరి లక్ష్మ య్య, శాఖ కార్యదర్శి చింతల పెంటయ్య, సభ్యులు బద్దం వెంకట్ రెడ్డి, దాసరి మారయ్య, ఎస్ కే షేర్ఫోద్దీన్, కడారి మల్లేశం, పెద్ద మల్లేష్, దాసరి యాదగిరి, కిష్టయ్య, యాదగిరి, ఆస్కాని మెహన్, ఎదునూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికలకు సిపిఐ శ్రేణులు సిద్ధం కండి

- కరీంనగర్ కార్పొరేషన్‌లో అడుగు పెట్టండి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/కరీంనగర్ :** రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్న తరుణంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలని, కరీంనగర్ కార్పొరేషన్‌లో సిపిఐ కార్పొరేటర్లుగా అడుగు పెట్టాలని సిపిఐ శ్రేణులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నగరానికి చెందిన సిపిఐ ముఖ్య నాయకులతో చాడ వెంకట్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అను ని త్యం ప్రజా క్షేత్రంలో ఉండి ప్రజల కోసం,వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న పార్టీ సిపిఐ అని,గత అనే క సంవత్సరాలుగా నగరంలో ఉన్న సమస్యలు, వార్డుల్లో ఉన్న సమస్యలపై నగర పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నారని, రోడ్లు, డ్రైనేజీలతో పాటు, గతంలో స్మార్ట్ సిటీ పేరుతో నిర్మించిన రోడ్ల, ఫుట్ పాత్‌ల నిర్మాణాలపై అలాగే తీగల వంతెన నిర్మాణ నాణ్యతపై, మానేరు రివర్ ఫ్రంట్ పై పోరాటాలు చేశామని, వాటి నిర్మాణంలో జరిగిన అవినీతిపై,అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేసిన ఏకైక పార్టీ సిపిఐ అని చాడ వెంకటరెడ్డి అన్నారు. నగరంలో నివసిస్తున్న పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని,నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లు పేదలకు కేటాయించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, పెన్షన్ ఇవ్వాలని, నగరంలో నివసిస్తున్న పేదలకు కూడా ఉపాధి హామీ పథకాన్ని వర్తింప జేయాలని అనేక దఫాలుగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహించి పోరాడిన పార్టీ సిపిఐ అని అలాంటి పార్టీని నగర ప్రజలు ఆదరించాలని, రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో పోటీ చేసే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని, పోటీ చేసే వారు ప్రజల మధ్య ఉండి వారికి సేవ చేయాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి న్యాలపట్ల రాజు, నగర నాయకులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, గామినేని సత్యం, మాడిశెట్టి అరవింద్, బాకం ఆంజనేయులు, కూన రవి, లక్ష్మణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.



## కొత్త భూగర్భ గనులు ఏర్పాటు చేయండి

**సింగరేణి కార్మికులకు రూ.30లక్షల వడ్డీలేని రుణం ఇవ్వాలి**

**ఇల్లందు గెస్ట్ హౌస్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలసిన ఎమ్మెల్యే కూనంనేని**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి కొత్తగూడెం పర్యటనలో భాగంగా కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు మంత్రిని ఇల్లందు గెస్ట్ హౌజ్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ మనుగడ, కార్మికుల సంక్షేమానికి సంభందించిన పలు కీల అంశాలతో కూడిన మెమోరాండంను మంత్రికి అందజేసారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెంచేందుకు పెనగడప, పునుకుడుచెలక, రాంపూర్, గుండాలలో తక్షణమే కొత్త భూగర్భ గనులను ఏర్పాటు చేయాలని కోరామని తెలిపారు. కార్మికుల సొంతింటి కలను నెరవేర్చేందుకు, సాకారం చేసేందుకు రూ.30 లక్షల వడ్డీలేని గృహరుణాలను అందజేయాలన్నారు.అలాగే ఉద్యోగ విరమణ చేసిన వారికి పెన్షన్ పది వేయిలకు తగ్గకుండా చూడాలని మంత్రిని కోరారు. వీటతో పాటుగా కార్మికుల కార్పొరేట్ మెడికల్ బోర్డును ఎటువంటి ఆటంకాలు లేకుండానిర్విరామంగా కొనసాగించాలని, పాత సింగరేణి క్వార్టర్‌లను కూల్చకుండా ప్రస్తుతం నివసిస్తున్న మాజీ కార్మికులకే ఇవ్వాలని కోరారు.సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపిస్తూనే, కార్మికుల న్యాయమైన హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించాలని మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు నేరల్ల రమేష్, పి. సత్యనారాయణ, చారి తదితరులున్నారు.

## నాగేశ్వర్ రావు మృతి పార్టీకి తీరని లోటు

**నివాళులర్పించిన సిపిఐ(ఎం), సిపిఐ జిల్లా కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, కర్రె భిక్షపతి**



**ప్రజాపక్షం/హనుమకొండ :** సిపిఎం ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు ఉప్పునపెల్లి నాగేశ్వర్ రావు అనారోగ్యం కారణంగా మృతి చెందారు. నాగేశ్వర్ రావు గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ, చికిత్స పొందుతున్నారని సోమవారం హైదరాబాద్‌లోని ఎంఎన్‌జె హాస్పిటల్‌లో మరణించారు. కాగా సిపిఎం హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఆయన భౌతిక కాయాన్ని ప్రజల సందర్శనార్ధం ఉంచారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శిలు జి.ప్రభాకర్ రెడ్డి, కర్రె భిక్షపతి నివాళులర్పించి మాట్లాడుతూ నాగేశ్వర్ రావు మొదటి నుండి పార్టీలో కష్టపడి పని చేస్తూ, పార్టీ నిబంధనావళిని పాటిస్తూ అత్యంత క్రమశిక్షణగా, మిలిటెంట్ నాయకుడిగా తుదికంటా ఎర్ర జెండా బిడ్డగానే బతికాడన్నారు. వరంగల్ నగరంలో నిర్వహించినటువంటి భూ పోరాటాలలో పేద ప్రజానీకానికి వెన్నుదన్నుగా ఉండి , అనేక కేసులను ఎదుర్కొన్నారని, ఇప్పటికి కేసులు ఉన్నాయన్నారు. పత్రిక అవసరాల రీత్యా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాశక్తి ఇంచార్జి గా సుదీర్ఘ కాలం పనిచేసారు. ఆ తరువాత గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, పార్టీలో వరంగల్ నగర, అర్బన్ జిల్లా కమిటీ సభ్యులుగా, కాజీపేట మండల కార్యదర్శిగా, నవతెలంగాణ పత్రిక జిల్లా మేనేజర్‌గా, కొత్తగూడెం జిల్లాలో లక్ష్మి దేవిపల్లి మండల కార్యదర్శి పనిచేశార ని గుర్తుచేశారు. ఆనతి కాలంలోనే నాగేశ్వర్ రావు మంచి ప్రజా నాయకుడిగా ఎదిగారని అన్నారు. అలంటి కామ్రేడ్‌ని కోల్పోవడం పార్టీకి తీరని లోటు అని వారు అన్నారు. నేడు ఉన్నటు వంటి పార్టీ కార్యకర్తలు క్రమ శిక్షణని ఆచరించే విషయంలో నాగేశ్వర్ రావును ఆదర్శంగా తీసుకోవాలని వారు ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు సేవలను కొనియాడారు. సోమవారం ఉదయం కాకతీయ మెడికల్ కాలేజీకి నాగేశ్వర్ రావు బాడీని అందచేస్తామని తెలిపారు. నాగేశ్వర్ రావుకి నివాళులర్పించిన వారిలో సిపిఎం సీనియర్ నాయకులు సారంపెల్లి వాసుదేవరెడ్డి, సిపిఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సిహెచ్.రంగయ్య, ములుగు జిల్లా మాజీ కార్యదర్శి టి. వెంకట్ రెడ్డి, జనగామ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, మహబూబాద్ జిల్లా కమిటీ సభ్యులు బొమ్మన అశోక్, సిపిఐ జిల్లా నాయకులు ఏదునూరి వెంకట్రాజం, వేల్పుల సారంగపాణి, బి.సంతోష్, కొట్టెపాక రవి, 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవి యాదవ్, రిటైర్డ్ లెక్టరర్ డోలి రాజలింగం, అవయవదానం ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు శంకర్ రావు, శ్రవణ్ కుమార్, దలపతి, సిపిఎం నాయకులు ఎం.చుక్కయ్య, గొడుగు వెంకట్, మంద సంపత్, కాడబోయిన లింగయ్య, డి.తిరుపతి, డి.భాను నాయక్, డి.రాజేందర్, మంద సుచందర్, నరేష్, ఎం.నారాయణ, ఎం.కుమారస్వామి, యాకుబ్, రావుల నర్సింహా, దుర్గయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# జనం మెచ్చిన వారికే టికెట్లు!

పైరవీలకు తావులేదు..
వారసత్వానికి చోటు లేదు
ఏదులాపురం మున్సిపాలిటీని
ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యత నాది
శివరాత్రిలోపే ఎన్నికల ప్రక్రియ పూర్తి!
మున్సిపల్ ఎన్నికల సన్నాహక
సమావేశంలో మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/ఖమ్మం:** మున్సిపల్ ఎన్నికల నగారా మోగనుంది. మనమంతా సిద్ధం కావాలి. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయమే తుది నిర్ణయం. పైరవీలకు ఇక్కడ తావులేదు. జనం కోరుకునే వ్యక్తికే బి ఫామ్ అందుతుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని వార్డుల నుండి తరలివచ్చిన పార్టీ ఇంచార్జీలు, ముఖ్య నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

### సర్వేల ఆధారంగానే ఎంపిక..

టికెట్ల కేటాయింపుపై మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. వారసత్వ రాజకీయాలకు నా వద్ద చోటు లేదు. నా రక్త సంబంధీకులకు ఎవరికీ టికెట్లు ఇవ్వను. ఇప్పటికే రెండు మూడు బృందాలతో క్షేత్రస్థాయిలో సర్వేలు చేయిస్తున్నాం. ప్రజలు ఎవరినైతే ఆదరిస్తారో, ఎవరికైతే గెలిచే సత్తా ఉందో వారికే అవకాశం దక్కుతుందని, ఓటర్ల మనసు గెలుచుకున్న వారే అభ్యర్థులుగా బరిలోకి దిగుతారని పేర్కొన్నారు.

### రెచ్చగొడితే మోసపోవద్దు..

పార్టీలో టికెట్ రాని వారు నిరాశ చెందవద్దని, అసంతృప్తితో ఇతర పార్టీల వైపు చూడవద్దని మంత్రి సూచించారు. అధికారంలో ఉన్నాం కాబట్టి అందరికీ ఏదో ఒక రూపంలో సముచిత స్థానం కల్పిస్తాం. కొందరిని కోఆప్షన్ సభ్యులుగా, మరికొందరికి నామినేటెడ్ పదవుల ద్వారా గౌరవిస్తాం. పార్టీని కాదని స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలని ఎవరైనా రెచ్చగొడితే మోసపోవద్దు. అటువంటి వారి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని హెచ్చరించారు.

### మోడల్ మున్సిపాలిటీగా చేయడమే లక్ష్యం..

ఏదులాపురం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా మార్చడమే తన లక్ష్యమని మంత్రి వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 15న శివరాత్రి లోపు ఎన్నికలు, కౌంటింగ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం అంతా పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## సర్వే ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక : మంత్రి

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఇల్లందు మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి మున్సిపల్ ముఖ్య నేతలు, ఆశావహులతో మంత్రి సమావేశం నిర్వహించారు.

### త్వరలోనే ఎన్నికల నగారా...

ఎన్నికల ప్రక్రియ అతి త్వరలోనే ప్రారంభం కానుందని మంత్రి ఈసందర్భంగా పేర్కొన్నారు. వచ్చే నెల మధ్య నాటికి ఎన్నికల ప్రక్రియ అంతా పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. సమయం తక్కువగా ఉన్నందున పార్టీ శ్రేణులు ఇప్పుడే క్షేత్ర స్థాయిలో వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

### కార్యకర్తలే నా బలం..

మీరు నా కళ్ళు, చెవుల వంటి వారు. మీ కష్టమే నాకు గౌరవం. నేను ఎప్పుడూ కార్యకర్తలను విస్మరించను. ప్రజలతో నిరంతరం మమేకమై ఉండే వారికే నా మద్దతు ఉంటుందని మంత్రి పొంగులేటి ఉద్ఘాటించారు. అనంతరం ఒక్కో వార్డు నాయకులతో ఆయన ముఖాముఖి చర్చించి, స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.



## సత్తుపల్లి ఏరియా ఉత్తమ అధికారి, ఉద్యోగుల ఎంపిక

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సత్తుపల్లి ఏరియాలో ఉత్తమ అధికారి, ఉత్తమ ఉద్యోగులను ఆదివారం ఎంపిక చేశారు. సెంట్రల్ ప్రోగ్రాం కింద ఏరియా ఉత్తమ అధికారిగా జెవిఆర్ ఓసి2 ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్.వి.ఆర్. ప్రహ్లాద్, ఉత్తమ ఉద్యోగిగా జెవిఆర్ ఓసి2 ఈపీ ఆపరేటర్ కాట్ల వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. గనుల వారీగా ఉత్తమ ఉద్యోగులుగా పల్లివేల సూర్య ప్రకాశ రావు (హెడ్ ఓర్మెన్), నీల్లపాల రామ రావు (ఎలక్ట్రీషియన్), కేడం కోటేశ్వర్ (కన్వేయర్ ఆపరేటర్), గంగాధరణి నాగేశ్వర్ రావు (హెడ్ ఓర్మెన్), అయులూరి ప్రభు శేఖర్ రెడ్డి (సీనియర్ అసిస్టెంట్) ఎంపికయ్యారు. వీరికి జనవరి 26న ఉదయం 9.30 గంటలకు సత్తుపల్లి జనరల్ మేనేజర్ కార్యాలయంలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ చేతుల మీదుగా సన్మానం ఉంటుందని, అలాగే ఏరియా ఉత్తమ అధికారి, ఉద్యోగులకు సింగరేణి కార్పొరేట్ సెంట్రల్ ఫంక్షన్‌లో సిఎండి డి.కృష్ణ భాస్కర్ ఐఎఎస్ చేతుల మీదుగా సన్మానం జరగనుందని సింగరేణి కాలరీస్ కంపెనీ ఒక ప్రకటన విడుదల చేసింది.

## ఐద్వా మహాసభలకు తరలిన మహిళలు



**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండలంలోని పలు గ్రామాల నుండి హైద్రాబాద్‌లో జరగనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ మహాసభలకు అధికసంఖ్యలో మహిళా కార్యకర్తలు ఆదివారం తరలివెళ్లారు. మహిళా సంఘం జిల్లా నాయకురాలు సేలం పకీరమ్మ జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 12 సంవత్సరాల కాలంలో కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి మహిళలపై జరుగుతున్న దాడులు పెరుగుతున్నాయని, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహిళలను బానిసలుగా చేసే మనువాద సిద్ధాంతాన్ని తీసుకువచ్చే పరిస్థితి ఉందని, మహిళలపై జరుగుతున్నదాడులకు ప్రధాన కారణమైన మద్యాన్ని ప్రభుత్వం నిషేదించాలని పలు డిమాండ్లతో ఈ మహాసభ జరుగుతుందని, భవిష్యత్‌లో మూడు సంవత్సరాలకు సంబంధించినన పోరాట రూపకల్పన ఈ మహాసభలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పేరసాని లత, తమ్మిశెట్టి నాగమణి, మన్యం స్వరూప, ఇస్నేపల్లి యశోద, విజయమ్మ, నిర్మల, తిరుమలకుమారి, లక్ష్మీ తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద ఆర్యవైశ్య కార్మికునికి మోటార్ రిక్షా వితరణ



**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు వాసవి డైమండ్ క్లబ్, వాసవి వనితి క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన రిక్షా కార్మికుడు మిట్టపల్లి దామోదర్ కుటుంబానికి జీవనోపాధికై మోటార్ రిక్షాని వితరణగా అందించారు. ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షులు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ మొదటి ఉపాధ్యక్షులు నూకల శ్రీనివాసరావు(వాసు), వాసవి డైమండ్ క్లబ్ అధ్యక్షుడు నంబూరి శ్రీనివాసరావు, ఆవర్యవైశ్య మహాసభ వైరా మండల అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్, వాసవి డైమండ్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వజినేపల్లి రవి, కొల్లా రాంబాబు, నూకల ప్రసాదరావు, గజ్జల కృష్ణమూర్తి, కొణతాలపల్లి వెంకటసుబ్బారావు, మిట్టపల్లి వెంకటరమణ, మిట్టపల్లి నర్సింహారావు, మిట్టపల్లి జగన్మోహన్‌రావు, రంగా సింహాద్రి, కొప్పురావూరి శబరినాథ్, రఘువీర్, అవినాష్, గజ్జల భాస్కర్, గ్రంధి విశ్వేశ్వరరావు, బోనగిరి సతీష్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షలు కొణతాలపల్లి వెంకటసుజిత్, ఉడత శ్రీనివాసరావు, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మహాలక్ష్మి, రాయల అన్నపూర్ణ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తం



**ప్రజాపక్షం/పాల్వంచ :** జిల్లాలోని చిన్న, పెద్ద ఆహార, వ్యాపార సంస్థలకు కొంతమంది ఆహార భద్రతాశాఖ అధికారలమంటూ పరిచయాలు చేసుకొంటూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు మా దృష్టి వచ్చిందని ఆయా ఫోన్ కాల్స్ పట్ల వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆహార భద్రతా అధికారి శరత్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓ వ్యక్తి ఫుడ్ ఇన్స్పెక్టర్ విక్రమ్ నాయుడుగా 8886397761 నెంబర్ నుండి ఫోన్ చేసి పరిచయం చేసుకొంటూ డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని ఫిర్యాదులు అందాయని తెలిపారు. కావునా జిల్లా పరిధిలో గల ఆహార, వ్యాపార సంస్థలకు చెందిన యాజమానులు నకిలీ ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉంటూ వెంటనే జిల్లా అధికారులకు తెలిజేయాలని కోరారు.

## గణతంత్రానికి సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** 77వ, గణతంత్ర వేడుకలకు జిల్లా ముస్తాబయింది. దీనిని పురస్కరించుకొని ప్రగతి మైదానంలో సోమవారం ప్రగతి మైదానంలో జిల్లా కలెక్టర్ జితేష్‌వి. పాటిల్ జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. ముందుగా పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరంజిల్లా ప్రగతి, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రసంగిస్తారు. వివిధ ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. విధుల్లో ప్రతిభ కనభరిచిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేస్తారు. అనంతరం మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తారు.

## ఘనంగా జాతీయ ఓటర్‌దినోత్సవం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని సత్యనారాయణపురంలో గల కెజిబివిలో 25వ జాతీయ ఓటర్ దినోత్సవంను రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కును తెలిపేలా విద్యార్థులు ముగ్గులను వేశారు. అలాగే పలు క్రీడపోటీలను నిర్వహించిన బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ ఆకార్యక్రమంలో పాలేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి రాజ్వేరి, తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్, ఆర్ఐలు ప్రసాద్, రవికాంత్, ఎస్ఐ హరికృష్ణ, జిపిఓలు, టీచర్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే వార్డుల పర్యటన

ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5,6,10,11 వార్డుల్లో ఆదివారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా వార్డుల్లో ప్రజలను కలిసి నేరుగా సమస్యలు అడిగి తెలుసుకొని అధికారులు తక్షణమే పరిష్కరించే విధంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ సమస్యలు తెలుసుకునేందుకే వార్డుల్లో పర్యటన చేస్తునాననని, ప్రజాపాలనలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయమన్నారు. త్వరలో జరగనున్న మున్సిపాల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని అభివృద్ధికి మారుపేరుకు నిలవాలని ఆయన సూచించారు. వైరా మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మార్కెట్ చైర్మన్ గంగారావు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరు సీతారాములు, మున్సిపాల్ మాజీ చైర్మన్ జైపాల్, మున్సిపాల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, లగడపాటి ప్రభాకర్, కొప్పురావూరి శబరినాద్, మిట్టపల్లి నాగి, రేచర్ల వెంకటేష్, చింతలపూడి వెంకటేశ్వరరావు, జాలాది రామకృష్ణ, ఉయ్యూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



### ఘనంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ జన్మదిన వేడుకలు

వైరాలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత పుట్టినరోజు వేడుకలను జిల్లా ఆర్యవైశ్య కార్పొరేషన్ కమ్మం జిల్లా ఇంచార్జి గ్రంధి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి శ్రీనివాసరావు, జి.చరణ్‌కుమార్, బండారు కృష్ణారావు, రాయల నాగేశ్వరరావు, తాటికొండ రాము, కోటేశ్వరరావు, మైలవరపు శ్రీనివాసరావు, అనుఓమలు భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మార్చి 6, 7 తేదిలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎకోస్ ఆఫ్ ది పాస్ట్, బీమ్స్ ఆఫ్ లైట్ ఎక్స్‌ప్లోరింగ్ ది సైంటిఫిక్ పినామినా బీహైండ్ తెలంగాణ అర్కిటెక్చర్ అనే అంశంపై మార్చి 6, 7 తేదీలలో జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఎస్.రమేష్. నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సంఘం సేవలను విస్తృతం చేయాలి




**ప్రజాపక్షం/రఘునాథపాలెం:** సామాజిక బాధ్యత మరింత బలోపేతం చేస్తు సభ్యులకు ప్రత్యక్షంగా ఉపయోగపడే సేవా కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు కొల్లు రఘు, ఎంఎల్సీ తాతా మధు అన్నారు. కమ్మ మహజన సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం ఖమ్మం నగరంలోని స్వర్ణభారతి కళ్యాణమండపంలో జరిగింది. స్థాపన లక్ష్యాలకు అనుగుణంగా సేవా దృక్పధకంతో ముందుకు సాగితేనే సమాజంలో మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు సంఘం చేపట్టిన విద్య, వైద్యం, సామాజిక సహాయ కార్యక్రమాలు సభ్యుల్లో విశ్వాసాన్ని పెంచాయని తలిపారు. భవిష్‌లో సేవలను మరింత విస్తృతం చేయాలంటే సభ్యుల ఐక్యతతోపాటు చురుకైన భాగస్వామ్యం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యాం ఇవ్వాలని సభ్యులకోసం క్యాంపులు నిర్వహించాలని ప్రతి సభ్యునికి హెల్త్ కార్డులు అందించి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. యువతను సంఘ కార్యకలాపాల్లో చురుకుగా భాగస్వామ్యం చేయాలని మహిళల పాత్రను మరింత పెంచితే సంఘం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. సంఘం చేపట్టే సేవా కార్యక్రమాలకు తమ పూర్తి సహకారం ఎల్లప్పుడు ఉంటుందని హామినిచ్చారు. కార్యదర్శి చావా రాము మాట్లాడుతూ గత ఏడాది కాలంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలపై సభకు సమగ్ర నివేధికను సమర్పించారు. ఈ కార్యక్రమాలకు సభ్యుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు కర్నాటి రమాదేవి, సహాయ కార్యదర్శి వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలకుమారి, కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ, నల్లమల ఆనంద్, కోలేటి నవీన్, మేదరమెట్ల స్వరూపరాణి, డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, నంబరి సత్యనారాయణప్రసాద్, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, బండి రవికుమార్, తాళ్లూరి మురళీకృష్ణతోపాటు సంఘం పెద్దలు కాటంనేని రమేష్, మందడపు సుధాకర్, కండెపనేని రత్నాకర్, సామనేని హరిప్రసాద్, బండి మాధవరావు, నూతలపాటి నాగేశ్వరరావు, లక్ష్మయ్య, చంద్రశేఖర్, మందపల్లి జనార్ధన్, చింతనిప్పు కృష్ణచైతన్య, వైవి పాపారావు, పోటు శరత్, పోట్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారులను ఆశీర్వదించిన తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తవిడిశెట్టి యుగేంధర్, కళావతి దంపతుల మనవరాళ్లు మీనాక్షి, సహస్ర ఓణీల అలంకరణ వేడుక ఆదివారం ఖమ్మంలో జరిగింది. ఈ కార్యక్రమానికి తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వేమిరెడ్డి కృష్ణారెడ్డి, పగడాల లచ్చిరెడ్డి, వడ్డే రామారావు, గోవిందు శ్రీనివాసరావు హాజరై చిన్నారులకు అక్షింతలు వేసి దీవించారు. నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సూదా నర్సింహారావు, పిన్ని కృష్ణయ్య, బిఆర్ఎస్ నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


## ఓటు విలువ తెలుసుకో - సద్వినియోగపరచుకో

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** ప్రజాస్వామ్యంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు తన ఓటు హక్కు విలువను తెలుసుకొని బాధ్యతాయుతంగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో నూతన ఓటర్లతో కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్‌లో సైకిల్ ర్యాలీని ఆదివారం ఆయన ప్రారంభించారు. పోస్టాఫీసు సెంటర్ నుండి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. ప్రజలను ఆలోచింపజేశాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే పాలకులను ఎన్నుకొనే అత్యున్నతమైనది ఓటు హక్కు అన్నారు. ప్రజల అభిప్రాయాలకు ఆమోదయోగ్యంగా ఎక్కువ మంది ఆదరణ పొందిన ప్రజాప్రతినిధులను ఎన్నుకొనేందుకు భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. గతంలో ఓటు హక్కు సాధన కోసం అనేక త్యాగాలు, ఉద్యమాలు, పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. జాతీయ ఓటరు దినోత్సవం ప్రతీ పౌరుడు ఓటు హక్కు విలువ, విశిష్టతను అవగాహన పాత్రను గుర్తించేందుకు ఒక మంచి అవకాశమని తెలిపారు. ముఖ్యంగా నూతన ఓటర్లు, యువత ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం నూతన ఓటర్లు, యువత, అధికారులతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామరెడ్డి, ఎన్నికల సూపరిండెంట్ రంగా ప్రసాద్, పాల్వంచ తహశీల్దార్ దారా ప్రసాద్, ఎన్నికల ట్రైనర్ సాయిక్రిష్ణ, ఎన్నికల సిబ్బంది నవీన్, సంభందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




బిఎల్ఓలకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు వ్యాసరచన నిర్వహించారు. రంగు రంగుల ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటుగా జ్ఞాపికలను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు, దాని ప్రాముఖ్యతపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించటమే లక్ష్యంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



## గొల్లమందల సామ్రాజ్యంకు ఘన నివాళి

**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండల ఉపాధ్యక్షులు గొల్లమందల నరేష్ మాతృమూర్తి దివంగత గొల్లమందల సామ్రాజ్యం దశదిన కర్మ కార్యక్రమం తల్లాడ మండలంలోని తెలగవరం గ్రామంలో ఆదివారం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షులు చల్లా నాగులు, జిల్లా కౌన్సిల్ మెంబర్ గాదె కృష్ణారావు, జిల్లా నాయకులు సంగీతం సాయిచంద్ పాల్గొని సామ్రాజ్యం చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొల్లమందల సామ్రాజ్యం కుటుంబానికి, సమాజానికి ఆదర్శప్రాయమైన జీవితం గడిపారని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలిపారు.

## అక్రమ తోలకాలతో గ్రామాలు ఆగమాగం

పల్లెలను మసకబారుస్తున్న మాఫియా
రోడ్లన్నీ గుంతల మయం
ఇండ్లన్నీ దుబ్బతో నింపుతూ అక్రమ మైనింగ్
అడిగేవారెవరంటూ ఫీంకరింపులు
మా వెనుక పెద్దల హస్తం అంటూ డాంబికాలు
అక్రమ మైనింగ్‌పై ప్రజలు ఆగ్రహం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** భూమిని తొలచి, భవిష్యత్తును తవ్వుతూ జేబులు నింపుకుంటుంది అక్రమ మైనింగ్ మాఫియా, గ్రామం అంటే పచ్చదనం, ప్రశాంతత, పరస్పర సహకారం. కానీ నేడు అదే గ్రామం అక్రమ మైనింగ్ మాఫియాల చేతుల్లో బందీగా మారుతోంది. భూమిని తొలచి మట్టిని అమ్మే దందా కేవలం అక్రమ వ్యాపారంగా మాత్రమే కాదు, గ్రామీణ వ్యవస్థపై జరుగుతున్న ఓ వ్యవస్థాగత దాడిగా మారింది. సత్తుపల్లి మండలం రుద్రాక్ష పల్లి పంచాయతీ పరిధిలో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా కొనసాగుతుండటం ఇందుకు స్పష్టమైన ఉదాహరణ. రోజుకు పదుల సంఖ్యలో టిప్పర్లతో మట్టి తరలింపులు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు కళ్లుమూసుకుని ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ అక్రమ తోలకాల వల్ల రోడ్లు పూర్తిగా గుంతలమయమై, గ్రామ ప్రజల నిత్యజీవితమే ప్రమాదకరంగా మారింది.ఇక్కడ సమస్య కేవలం రోడ్ల ధ్వంసం వరకే పరిమితం కాదు. పచ్చని పొలాలు, చెట్లు దుబ్బతో నిండిపోవడంతో వ్యవసాయ ఉత్పత్తి తగ్గే ప్రమాదం ఉంది. ఇది రైతుల ఆర్థిక భవిష్యత్తుపై నేరుగా ప్రభావం చూపుతోంది. ఒకవైపు పంటల నష్టం, మరోవైపు వాహనాల రాకపోకల వల్ల వచ్చే ధూళి కాలుష్యం



### గ్రామం మొత్తం మసకబారుతోంది...

ఇదంతా సహజంగా జరుగుతున్న ప్రక్రియ కాదు. సత్తుపల్లి, రేజర్ల గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు సిండికేట్‌గా ఏర్పడి ఈ అక్రమ మైనింగ్‌ను నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు తీవ్రమైనవే. 'మా వెనుక పెద్దల హస్తం ఉంది' అనే డాంబికాలు వినిపించడం చూస్తే, ఇది కేవలం స్థానిక సమస్య కాదని, వ్యవస్థలోని లోపాల ఫలితమేనని అర్థమవుతోంది. ప్రశ్నించే వారిని భయపెట్టే ఫీంకారాలు ప్రజాస్వామ్య విలువలకు సూటి సవాల్.

# ఎన్నికలకు పార్టీల సమాయత్తం

వ్యూహ ప్రతివ్యూహాలపై ప్రధాన పార్టీల నజర్* రిజర్వేషన్లు ఖరారు.. అభ్యర్థుల వేట* క్లీన్ స్వీప్ దిశగా కాంగ్రెస్, గెలుపు కోసం బిఆర్ఎస్



**ప్రజాపక్షం/హనుమకొండ :** మున్సిపల్ ఎన్నికలకు పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఎన్నికల షెడ్యూల్ కోసం ఎదురు చూస్తున్నాయి. ఇప్పటికే ఓటరు జాబితాను పూర్తి చేయటంతో పాటు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సిబ్బందికి శిక్ష ణను పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న 12మునిసిపాలి టీల్లోని 260వార్డులకు రిజర్వేషన్లు ఖరారు పూర్తయింది. చైర్మ న్ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లు కూడా ఖరారు చేశారు. రిజర్వేషన్లు తేలటంతో ఆయా పార్టీలు అభ్యర్థుల ఎంపిక కూడా దాదాపు పూర్తి చేసుకున్నాయి. అంతేకాకుండా చైర్మన్ అభ్యర్థిని కూడా గుర్తించి బరిలో దింపుతున్నారు. రిజ ర్వేషన్లు కలిసిరాని చోట నేతలు తమ సతీమణిలను బరిలో దింపుతున్నారు. ప్రభుత్వం కూడా ముని సిపాలిటీ ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లుగా మేడారంలో జరిగిన కేబినెట్ మీటింగ్ లో ప్రకటించింది. దీంతో ఫిబ్రవరి 15వ తేదీలోపు ఎన్నికలు పూర్తయ్యే అవ కాశం ఉందని తెలుస్తోంది.పురపాలక సంఘాల ఎన్నికలు అన్ని పార్టీలకు సవాల్‌గా మారుతున్నాయి.జనగామ మినహా మిగతా భూపాలపల్లి, పరకాల, వర్ధ న్నపేట, నర్సంపేట, స్టేషన్ ఘన్పూర్, ములుగు, మహబూబా బాద్, మరిపెడ, డోర్నకల్, కేసముద్రం, తొర్రూరు మునిసిపాలిటీలు కాంగ్రెస్ ఎమ్మెల్యేల పరిధిలో ఉన్నాయి. ఈ 11మునిసిపాలిటీలతో పాటు విపక్ష ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న జనగామ మునిసి పాలిటీలో పాగా వేయాలని కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది.2020లో జరిగిన మునిసిపాలిటీ ఎన్నికల్లో అప్పటి అధికార బిఆ ర్ఎస్ ఉమ్మడి జిల్లాలో ఉన్న తొమ్మిది మునిసిపాలిటీల్లో విజయం సాధించి క్లీన్ స్వీప్ చేసింది. అదే చరిత్రను ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పునరావృతం చేయాలని ప్రయత్నాలు చేస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల తీరుపై ప్రజలు, క్యాడర్‌లో అసంతృప్తి ఉండడం కూడా కాంగ్రెస్ నేతల్లో గుబులు రేపుతోంది. ఒకటి రెండు సీట్లు కోల్పోయినా బిఆర్ఎస్‌కు పట్టు చిక్కుతుందనే భయంలో హస్తం నేతలు ఉన్నారు.కాగా గత ఎన్నికల్లో వరుస ఓటములతో నిరాశలో ఉన్న గులాబీ శ్రేణులకు పంచాయతీ ఎన్నికలు కొంత ఉపశమనం ఇచ్చాయి. ఉమ్మడి జిల్లాలో 30శాతంకు పైగా పంచాయతీలు బిఆర్ఎస్ ఖాతాలో జమయ్యాయి. ఇదే ఊపుతో మునిసిపాలిటిల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవాలని గులాబీ నేతలు ఉవ్విళ్లూ రుతున్నారు. తాజా మాజీ ఎమ్మెల్యేలకు అధిష్ఠానం మునిసిపా లిటీల్లో గెలుపు టాస్క్ ఇచ్చింది. దీంతో ఇప్పటికే భూపాలపల్లి, నర్సంపేట, పరకాల, డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో ఉన్న మునిసిపాలిటీల్లో మాజీ ఎమ్మెల్యేలు ప్రచారబాట పడుతున్నారు. భూపాలపల్లిలో మాజీ గండ్ర వెంకటరమణా రెడ్డి బస్తీబాట పేరుతో వార్డుల్లో తిరుగుతున్నారు. జనగామ మునిసిపాలిటీల్లో పట్టును నిలుపుకునేందుకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇటీ వలే మాజీ మంత్రి కెటిఆర్‌ను జనగామలో పర్యటించేలా చేశారు. 2020లో ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మునిసిపాలిటీల్లో బిఆర్ఎస్ విజయం సాధించింది. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన మూడు మునిసిపాలిటీలను కలిపి 12పురపాలక సంఘాల్లో మెజార్టీ చైర్మన్ పదవులను కైవసం చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు.కాగా పురపాలిక సంఘాల్లో ఉనికి చాటుకోవటంతో పాటు మెజా ర్టీ కౌన్సిలర్ స్థానాలను గెలుచుకోవాలని బిజెపిభావిస్తోంది.ప్రధానంగా పరకాల, భూపాలపల్లి, జనగామ, తొర్రూరు, వర్ధ న్నపేట, నర్సంపేట మునిసిపాలిటీల్లో బలమైన క్యాడర్ ఉండ టంతో ఈ మునిసిపాలిటీల్లో భారీగా సీట్లు గెలువాలనే లక్ష్యా న్ని పెట్టుకున్నారు. కలిసి వచ్చే వారితో పొత్తు పెట్టుకుని చైర్మ న్ సీట్లు కూర్చోవాలనే తాపత్రాయంతోబిజెపి నేతలు ఉన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో సీట్లు రాకపో యినప్పటికీ గ్రామాల్లో కూడా తమ పార్టీ ఉనికి చాటుకుందనే తృప్తితో ఆ పార్టీ నేతలు ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో బిజెపికి క్యాడర్ ఉండటంతో పక్కా పాగా వేస్తామనే ధీమాతో కమల నాధులు ఉన్నారు.వీటితో పాటు వామపక్షాలైన సిపిఐ, సిపిఎం ఈ సారి తమ పట్టున్న స్థానాలలో సత్తా దాటేందుకు సంసిద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ తదితర ప్రాంతాల్లో గెలుపు పై ధీమా తో ఉన్నారు.

## యూరియా బుకింగ్ యాప్ విజయవంతంగా అమలు: కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ:** జిల్లాలో యూరియా సరఫరా వ్యవస్థను మరింత పారదర్శకంగా సమర్థవంతంగా రైతుమిత్రంగా రూపొందించాలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరయా బుకింగ్ యాప్ జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం 3 ను శనివారం సాయంత్రం సందర్శించి యూరియ నిల్వలు యాప్ ద్వారా జరిగిన బుకింగ్స్ విక్రయ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ఒక్క కేంద్రం ద్వారా ఇప్పటి వరకు సుమారుగా 5600 యూరియా సంచులు విక్రయించినట్లు తెలిపారు. గత వానా కాలంలో ఇదే కేంద్రం ద్వారా విక్రయించిన సంచుల కంట దాదాపు 1600 సంచులు అధికం కావడం గమనార్హమన్నారు. రైతులకు యాప్ వినియోగంపై మరింత అవగాహన కల్పిస్తూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని రైతులందరు ఈ యాప్‌ను తప్పనిసరిగా వినియోగించితమకు అవసరమైన యూరియాను సకాలంలో సులభంగా పొందాలన్నారు.

## నూతన సంవత్సర కాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లా సంఘాల పక్షాన రూపొందించబడిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆదివారం వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య ఎక్సైజ్ కాలనీలో గల తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించింది. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా సంఘం అధ్యక్షుడు బిల్ల మహేందర్ దివ్యాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు ఎంపి దృష్టికి తీసుకెళ్ళి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 2016 దివ్యాంగుల హక్కుల చట్టం జిల్లాలో పకడ్బందీగా అమలు అయ్యేవిధంగా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి సున్న నరసమ్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మల్సూర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బొనగిరి రాములు, సంఘ బాధ్యులు వా.వాసుదేవ రెడ్డి, ఆకవరపు స్వరూప, బొప్పి ఉమారాణి, కదుదుల సోమన్న, ఫస్యుద్దీన్, చిగురుమామిడి రాజమౌళి, సులోచన, ఓదెలు, రమేష్, ప్రభాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యం కలిగించొద్దు: ఎస్ఐ

**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** రామప్పలో చిరు దుకాణదారులు దేవాలయానికి దర్శించుకునే భక్తులకు ఎటువంటి అసౌకర్యానికి గురి చేయవద్దని ఎస్ఐ చల్ల రాజు కోరారు. ఆదివారం దుకాణదారులతో మాట్లాడుతూ రోడ్డుమీద ఇరువైపులా ఆటో రిక్షాలు, తోపుడుబండ్ల ద్వారా దుకాణాలను ఏర్పాటు చేసుకుని భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వాటిని తొలగించారు. మేడారం జాతర సందర్భంగా రామప్పలో లక్షల మంది భక్తులు వస్తారని అందుకోసం 320 పోలీసు సిబ్బందితో పాటు ఒక డిఎస్పి, నలుగురు సిఐలు, 12 మంది ఎస్ఐ,లతో భారీ భద్రత ఉంటుందని ఎస్ఐ పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆదివారం సాయంత్రం నుండి పోలీస్ సిబ్బంది విధులలో పాల్గొంటారని అన్నారు. భక్తుల భద్రత దృశ్య రామప్ప చెరువు కట్ట మీదికి అనుమతి లేదని ఎస్ఐ చల్లరాజు తెలిపారు.

## గవర్నర్ నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్ సత్యశారద



**ప్రజాపక్షం/వరంగల్:** జాతీయ ఓటర్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అవార్డు అందుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సందర్భంగా ఓటర్లను ఆకర్షించేలా గ్రీన్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వినూత్న ఓటర్ అవగాహన కార్యక్రమాల అమలు ద్వారా ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచినందుకు ఈ ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది.

## జాతీయ ఓటర్ దినోత్సవం




**ప్రజాపక్షం/జనగామ:** ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కును ఓటర్లు తప్పక వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును ఓటర్లు వినియోగించుకోవాలన్నారు. 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. రాజ్యాంగం ద్వారా వచ్చిన ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాదిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గోపిరాం, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ అస్తిత్వానికి కెసిఆర్ దిక్సూచి

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** తెలంగాణ అస్తిత్వానికి కెసిఆర్‌దిక్సూచి అని ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ క్యాంప్ ఆఫీస్‌లో వివిధ పార్టీల నుండి భారీగా చేరడం జరిగింది. కొత్త తండా గ్రామ పంచాయితి కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు రమేష్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిలి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అని చెబుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని, రాబోయే రోజులలో కెసిఆర్ మళ్లీ సీఎం అవుతారన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో రవి, ధనుష్, జుంలాల్ నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరాజు, కృష్ణమూర్తి, జైపాల్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో మేడారం పనుల పర్యవేక్షణ

చిలకలగుట్ట, ట్రైబల్ మ్యూజియం సందర్శన* భక్తులకు లోటుపాట్లు లేకుండా చర్యలు



**ప్రజాపక్షం/ములుగు:** శ్రీ సమ్మక్క సారలమ్మ మహాజాతర సమీపిస్తున్న నేపథ్యంలో మేడారంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, మౌళిక సదుపాయాల ఏర్పాట్లను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పి సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌లతో కలిసి మేడారం పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా చిలకలగుట్ట ప్రాంతాన్ని సందర్శించి అక్కడ భక్తుల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు, మౌళిక సదుపాయాల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించి అక్కడ చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మద్యం సేవించి జంపన్న వాగులోకి వెళ్లవద్దని భక్తులకు సూచించారు. అలాగే మేడారం చేరుకున్న వెంటనే జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం అమ్మవార్ల దర్శనం చేసుకొని వంటావార్పు నిర్వహించుకోవాలని తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే జాతర సమయంలో చిన్న పిల్లలు, వృద్ధులను ఒంటరిగా ఎక్కడికీ వదిలివేయకూడదని మంత్రి స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులు అందరూ కలిసే ఉండాలని, ఎవరికైనా దారి తప్పితే వెంటనే సమీపంలోని పోలీసు సిబ్బందిని లేదా అధికారులను సంప్రదించాలని సూచించారు. జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, దర్శన సౌకర్యాలు వంటి అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా భక్తుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ ఫీజులు ముక్కుపిండి వసూలు..

పట్టాదారు పాసుబుక్కులపంపిణీపై ప్రభుత్వ నిర్లక్ష్యం* నెక్కొండలో ఆరు నెలలుగా రైతుల అవస్థలు

**ప్రజాపక్షం/నెక్కొండ:** ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఫీజుల వసూలులో మాత్రం కఠినంగా వ్యవహరిస్తూ, అదే రైతుకు అవసరమైన పట్టాదారు పాసు బుక్కులు ఇవ్వడంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో గత ఆరు నెలలుగా కొత్త పట్టాదారు పాసుబుక్కులు అందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి భూములు కొనుగోలు చేసి, ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించినప్పటికీ, కొత్త పాసుబుక్కులు మంజూరు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త పాసుబుక్కులే కాకుండా, పాత పాసు బుక్కుల్లో రిజిస్ట్రేషన్ అయిన భూముల వివరాలు ప్రింట్ చేయించుకోవాలంటే కూడా అధికారులు చేతులెత్తేస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రింటర్ కరాబ్ పేరుతో కాలయాపన పాసుబుక్కుల ప్రింటింగ్‌కు ఉపయోగించే ప్రింటర్లు చెడిపోయాయని చెబుతూ మండల రెవెన్యూ అధికారులు రిపేర్ చేయాల్సిన బాధ్యత గల జిల్లా స్థాయి అధికారులపై ఉన్నా, ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోడంతో మండల స్థాయి అధికారులు కూడా ఏమి చెప్పలేని స్థితిలో చిక్కుకున్నారు. పథకాల దరఖాస్తుల్లో ఆటంకం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు బంధు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు దరఖాస్తు చేయాలంటే పాసుబుక్కులో తాజా వివరాలు ప్రింట్ అయి ఉండాల్సిందే. అయితే ప్రింటింగ్ జరగకపోవడంతో రైతులు పథకాల ప్రయోజనాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుపై భారం...ప్రభుత్వ తీరుపై ప్రశ్నలు ఒకవైపు రిజిస్ట్రేషన్ ఫీజు రోజు రోజుకు పెంచుతూ ప్రభుత్వం కఠినత్వం, మరోవైపు పాసు బుక్కుల పంపిణీలు అలసత్వం ఇదేనా రైతుల పక్ష పాత ప్రభుత్వ విధానం అని మండిపడుతున్నారు.

## ఉపాధిహామీ పథకాన్ని బలహీనపరిచే కుట్రలో భాగమే పేరు మార్పు

వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు

**ప్రజాపక్షం / పర్వతగిరి :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పుకు వ్యతిరేకంగా ఎఐసిసి, టిపిసిసి పిలుపు మేరకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అధ్యక్షతన పర్వతగిరి మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో మండల పరిధిలోని ఉపాధి హామీ కూలీలతో గ్రామ సభ నిర్వహించబడింది. ఈ సభలో గ్రామ ప్రజలతో కలిసి ఉపాధి చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని కోరుతూ తీర్మానాలు చేసి, ఆ తీర్మాన పత్రాలను వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కుట్రపూర్వకంగా ఉపాధి పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నంలో భాగంగా పేరు మార్పు చేపట్టిందని ఆరోపించారు. ఇది గ్రామీణ కూలీల ఉపాధి హక్కును హరించే చర్య అని విమర్శించారు. వెంటనే పథకం పేరు మార్పు నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అయూబ్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ కోట్లాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఈ చట్టాన్ని బలహీనపరిచే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పేరు మార్పు వంటి చర్యలకు పాల్పడటం తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 100 రోజులకు పైగా పని దినాలు కల్పించాల్సిన అవసరం ఉందని, బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.గ్రామ పంచాయతీలకు ఉన్న అధికారాలను కుదించే ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంటూ, ఎం ఎన్ ఆర్ ఈజీఏ చట్టాన్ని యథాతథంగా కొనసాగించి, మరింత బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మట్టపల్లి వెంకటేశ్వర రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల గ్రామ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు ఉపాధి హామీ కూలీలతో పాటు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి చేస్తుందని, ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సుభాష్, రాజీవ్ నగర్ కాలనీ నూతనంగా ఏర్పాటు చేసిన హెల్త్, వెల్నెస్ సెంటర్లను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ఆరోగ్యానికి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుంద ని, రాష్ట్రంలో ఐదు లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీని 10 లక్షలకు పెంచి పేద వారికి ఉచితంగా వైద్యం అందిస్తుంది అన్నారు.రాష్ట్రంలో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందని అందులో భాగంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మౌలిక వసతుల కల్పన కోసం 63కోట్లతో ఈ జనవరిలోనే మంజూరు చేసి శంకుస్థాపనలు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సిహెచ్ మధుసూదన్, డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్, డాక్టర్ శ్రీదేవి, కాంగ్రెస్ నాయకులు బీర్తీ పృధ్వి, దాట్ల శ్రీనివాస్ పుల్ల మహేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## స్టేషన్ ఘన్‌పూర్‌ను గత ఎమ్మెల్యే భ్రష్టు పట్టించాడు

విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/స్టేషన్‌ఘన్‌పూర్:** గత ఎమ్మెల్యే స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని బ్రష్టు పట్టించాడని.. నియోజకవర్గంలో పోగొట్టుకున్న గౌరవాన్ని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నానని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం స్టేషన్ ఘన్‌పూర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొంత మంది బిఆర్ఎస్ నాయకులు స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీలో ఒక సమావేశం ఏర్పాటుచేసి ఈ నియోజకవర్గంలో కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత ఏమాత్రం అభివృద్ధి జరగలేదని, ఈనాడు ఇక్కడ నిర్మాణం అవుతున్న 100 పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్, ఘన్‌పూర్ మున్సిపాలిటీ కావడానికి మేమే కారణం అన్న రీతిలో ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వారు మాట్లాడారన్నారు. గత ఎమ్మెల్యే చిల్లర పనుల వల్ల నియోజకవర్గ ప్రజలు తలదించుకునే పరిస్థితి తెచ్చాడు. టిడిపిని హోల్ సేల్‌గా అమ్మిన నీచ చరిత్ర ఎర్రబెల్లిది. కెసిఆర్ చుట్టూ బొచ్చు కుక్కలా తిరిగి వేల కోట్ల ఆస్తులు సంపాదించాడు. కెసిఆర్ కుటుంబంలో చిచ్చు పెట్టి నాశనం చేసింది పల్లానే. అసలు పొట్టోడు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కెసిఆర్ , సంతోష్ రావుల బినామీ పోచంపల్లి అన్నారు. అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ఎజెండాగా పెట్టుకొని పనిచేస్తే ప్రజలు తప్పకుండా ఆదరిస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, బాలరాజు, గడ్డమీది సురేష్, బేబి శ్రీనివాస్, పోగుల సారంగపాణి, నీల గట్టయ్య, కిషన్, రాజు, మహ్మద్ యాకూబ్‌పాషా, ఏదునూరి రమేశ్, సుందర్ సింగ్, కుమారస్వామి, పులి వినయ్, సాంబరాజు, లక్ష్మ ణ్, చాంద్‌పాషా, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధికి బాటలు


ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.ఆదివారం హనుమకొండ జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం కార్యక్రమంలో భాగంగా 200 మంది మైనారిటీ మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనారిటీల సంక్షేమాన్ని మాటల్లో కాదు, పనుల్లో చూపిస్తోందని అన్నారు. లబ్ధిదారులు ఈ కుట్టు మిషన్లను సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇది మొదలు మాత్రమేనని, రాబోయే రోజుల్లో మైనారిటీల కోసం మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొస్తామని తెలిపారు.ఇప్పటికే మరో 200 కుట్టు మిషన్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ తప్పకుండా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు.ఈ పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు మైనారిటీ అనుబంధ సంఘ నాయకులు, మైనారిటీ పెద్దలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై దుష్ప్రచారాన్ని ఆపాలి

ఫిబ్రవరి 23న ఢిల్లీలో జాతీయ స్థాయి ఒసిల మహాధర్నా



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** అగ్రవర్ణాలలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారు రిజర్వేషన్ల లేమి కారణంగా అటు సంక్షేమ పథకాల ఫలాలు, ఇటు రాజకీయ పదవులు పొందలేకపోతున్నారని ఓసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి,జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు అన్నారు. హక్కుల సాధనే లక్ష్యంగా ఫిబ్రవరి నెల 23 న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఓసి జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓసి ల మహాధర్నా విజయవంతం చేయడానికి, ఏర్పాట్ల గురించి ఆదివారం ఓసి ఐకాస రాష్ట్ర ఉమ్మడి జిల్లాల నాయకుల సమావేశం హన్మకొండ పోస్టల్ కాలనీలోని హనుమాన్ దేవాలయం ఆవరణలో జరిగింది. గోపు జైపాల్ రెడ్డి, పోలాడి రామారావులు మాట్లాడుతూ రాజకీయ రిజర్వేషన్లు లేని కారణంగా ఓసీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని తెలిపారు.ఇటీవలి సర్పంచ్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో సైతం ఎదుటివారి ఆర్థిక, అంగ బలం ముందు ఓసి అభ్యర్థులు సరితూగ లేక జనరల్ స్థానాల్లో కనీసం 50శాతం సీట్లు కూడా గెలుచుకోలేక పోయారని విచారం వ్యక్తం చేశారు.ఓటుబ్యాంకు రాజకీయాలతో ఓసిలకు నేటికీ తీవ్ర అన్యాయం జరుగుతున్నదని అన్నారు.తాము ఏ వర్గాలకు వ్యతిరేకం కాదని, అన్ని వర్గాల ప్రజలకు అన్ని రంగాల్లో సమన్యాయం జరగాలన్నదే ఓసి జేఏసీ ధ్యేయమని పేర్కొన్నారు.స్థానిక ఎన్నికల్లో ఓసిలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

**ఈడబ్ల్యూఎస్ పై కుట్రలు సాగనివ్వం...**

రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై జరుగుతున్న అసత్య ప్రచారాలు, కొందరు తమలబ్ధి కోసం చేస్తున్న కుట్రలను సాగానివ్వబోమని స్పష్టం చేశారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు.ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పటిష్ట అమలుకు ప్రత్యేక జాతీయ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగ బద్ధంగా ఏర్పడ్డ 10 శాతం ఈడబ్లూఎస్ రిజర్వేషన్లపై కొందరు ఆయా కులాల్లోని ప్రజలను మభ్య పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.స్వార్థ రాజకీయ ప్రయోజనాలు, ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం ఓసి లను పలుచన చేయాలనే కుయుక్తులను సాగనివ్వబోమని విరుచుకుపడ్డారు. ఓసి ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు విద్యా, ఉద్యోగ, పోటీ పరీక్షలలో వయోపరిమితిని పెంచాలని , ఈడబ్ల్యూఎస్ వారికి కేటాయించగా మిగిలిన బ్యాక్ లాగ్ పోస్టులను ఆ వర్గాల వారితోనే వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీకి 10లక్షల ఆదాయ పరిమితి పెంచాలన్నారు.50 శాతం దాటకుండా ఉన్న ప్రస్తుత రిజర్వేషన్ల లో ఓసిలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ఓసీలలోని నిరుపేదలకు వర్తింప చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు ఫిబ్రవరి 23న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఓసి జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన జాతీయ స్థాయి ఓసిల మహా ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయాలకతీతంగా ఓసి సామాజిక వర్గీయులు తరలి వచ్చి విజయవంతం చేయాలని సమావేశంలో కోరారు.ఈ సందర్భంగా మహా ధర్నాకు సంబంధించిన గోడ ప్రతులను, కరపత్రాలను ఆహ్వాన కార్డులను నాయకులు ఆవిష్కరించారు. సమావేశంలో ఓసి ఐకాస రాష్ట్ర సలహాదారు రావుల నర్సింహా రెడ్డి, ప్రచార కార్యదర్శి కామిడి సతీశ్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా ల నాయకులు నల్లా రాజి రెడ్డి, చాడ జైహింద్ రెడ్డి, కోరెళ్ళ సంజీవరెడ్డి, గంగిడి ప్రభాకర్ రెడ్డి,బుచ్చి రెడ్డి, కామిడి శ్రీదర్ రెడ్డి,గణపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ల తో పాటు ఉమ్మడి జిల్లా ఐకాస నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
సోమవారం
26-01-2026
www.prajapaksham.in



"ఫిబ్రవరి 6న 'స్కై' విడుదల మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియోస్ బ్యానర్‌పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా 'స్కై'. పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు."




## సాధారణ టికెట్ రేట్లతో ఓం శాంతి శాంతి శాంతిః

మల్టీ ట్యాలెంటెడ్ తరుణ్ భాస్కర్ లీడ్ రోల్‌లో నటిస్తున్న హిలేరియస్ విలేజ్ కామెడీ ఎంటర్ టైనర్ 'ఓం శాంతి శాంతి శాంతిః. ఈషా రెబ్బా హీరోయిన్ గా నటిస్తున్నారు. ఏ ఆర్ సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్ పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్ , నవీన్ సనివరపు ఈ సినిమాను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలై ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఓం శాంతి శాంతి శాంతిః జనవరి 30న రిలీజ్ కానుంది. ఈ మధ్య కాలంలో ప్రతి సినిమాకు టికెట్ ధరలు పెంచుకోవడం ఆనవాయితీగా వస్తున్న నేపథ్యలో ఈ సినిమాకు మాత్రం సాధారణ టికెట్ ధరలే అందుబాటులో ఉన్నాయని నటుడు తరుణ్ భాస్కర్ చెప్పారు. సింగిల్ థియేటర్ లో 99 రూపాయలు, మల్టీ ప్లెక్స్ లో 148 రూపాయలకు మాత్రమే తమ సినిమా చూడొచ్చని ఆయన తెలిపారు. మలయాళంలో హిట్ అయిన ఓ సినిమాను తీసుకుని రీమేక్ చేసిన ఈ సినిమా స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా తెరకెక్కిన్చామన్నారు. ఈషా రెబ్బ హీరోయిన్ గా నటించిన ఈ సినిమాలో బ్రహ్మాజీ కీలకమైన పాత్రను పోషించారు.

## త్వరలో నితిన్ 36వ సినిమా షూటింగ్ ప్రారంభం

వైవిధ్యమైన సినిమాలు, పాత్రలతో తనదైన గుర్తింపు సంపాదించుకున్న హీరో నితిన్ తన 36 సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వెర్సటైల్ డైరెక్టర్ వి.ఐ.ఆనంద్ దీనికి దర్శకత్వం వహించనున్నారు. పవన్ కుమార్ సమర్పణలో సక్సెస్ఫుల్ బ్యానర్ శ్రీనివాస సిల్వర్ స్క్రీ శ్రీనివాస చిట్టూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రథ సప్తమి సందర్భంగా సైఫై ఎంటర్టైనర్ సంస్థ ఈ ప్రకటన చేసింది. విభిన్నమైన కథలు, కథనాలతో సినిమాలను రూపొందించే దర్శకుడు వి.ఐ.ఆనంద్ మరోసారి ఈ భారీ ప్రాజెక్ట్ కొ క్రియేటివ్ బౌండరీస్ రేంజ్‌ను మరింత పెంచటానికి సిద్ధమయ్యారు. ఊరు పేరు భైరవకోన చిత్రం తర్వాత దర్శకుడు ఆనంద్ తాయారు చేసుకున్న కథతో ముందుకు వస్తున్నాడు. ఆదివారం రథ సప్తమి సందర్భంగా ఈ సినిమాను అధికారికంగా అనౌన్స్ చేశారు. త్వరలోనే షూటింగ్ స్టార్ట్ కానుంది. టాలెంటెడ్ హీరో, వైవిధ్యంగా సినిమాను తెరకెక్కించే దర్శకుడు, గ్రాండ్‌గా సినిమాను నిర్మించే సంస్థ కలయికలో తెరకెక్కబోయే ఈ సైఫై ఎంటర్టైనర్ నితిన్ కెరీర్‌లో అత్యంత ఆసక్తికరమై ప్రాజెక్ట్‌లను ఒకటిగా మారనుందని నిర్మాత భావిస్తున్నారు.నితిన్ 36వ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు.




## పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉస్తాద్ భగత్ సింగ్



పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వం లో తెరకెక్కుతున్న తాజా సిని మా ఉస్తాద్ భగత్ సింగ్. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇంతకు ముందు వచ్చిన గబ్బర్ సింగ్ సినిమా ఎంతటి బ్లాక్ బస్టర్ హిట్ అయిందో అంత కంటే ఎక్కువ హిట్ అయ్యేలా ఈ సినిమాను తెరకెక్కించే ప్రయత్నం చేశాడు హరీష్ శంకర్. ఈ సి నిమా షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బి జీగా ఉంది. ఇటీవల విడుదలైన దే ఖ్లేంగే సాలా.. అనే పాత బాగా పా పులర్ అయింది. ఇప్పుడు తాజా గా ఆస్కార్ అవార్డు గ్రహీత చం ద్రబోస్ రాసిన పాటను విడుదలకు సన్నాహాలు చేస్తున్నామ ని దర్శకుడు హరీష్ శంక ర్ చెప్పారు. సినిమా అద్భుతంగా వచ్చిందని, పవన్ కళ్యాణ్ క్యారెక్టర్ చాలా గొప్పగా ఉంటుందని ఆయన తెలిపారు. పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మరో హీ రోయిన్ సాక్షి వైద్య ఓ కీలకపాత్రను పోషిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ సగీత ం అందించారు. ఆనంద్ సాయి ఆర్ట్ డైరెక్టర్‌గా పని చే శారు. వైరవి శంకర్, నవీన్ యెరేనెని ఈ సినిమాను నిర్మించారు.

## 30న 'త్రిముఖ' విడుదల



యోగేష్ కల్లె హీరోగా, సన్నీ లియోన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'త్రిముఖ'. ఈ చిత్రాన్ని అఖిరా డ్రీమ్ క్రియేషన్స్ బ్యానర్ మీద శ్రీదేవి మద్దాలి, రమేష్ మద్దాలి నిర్మిస్తున్నారు. ఈ మూవీకి రాజేష్ నాయుడు దర్శకత్వం వహిస్తున్నారు. ఐదు భాషల్లో ఏకకాలంలో చిత్రీకరించిన ఈ పాన్ ఇండియా 'త్రిముఖ' సినిమాని ఈ నెల 30న హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. 'త్రిముఖ' సినిమా డేట్ అనౌన్స్ మెంట్ ప్రెస్ మీట్ హైదరాబాద్ ఫిలించాంబర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు జెమినీ సురేష్ మాట్లాడుతూ స్క్రీన్ ప్లే బేస్డ్ సినిమాలు మనకు తక్కువగా వస్తుంటాయి. అలాంటి మంచి స్క్రీన్ ప్లే బేస్డ్ సినిమా 'త్రిముఖ'. మంచి కంటెంట్ తో వస్తున్న ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది. హీరో యోగేష్ ఈ సినిమా కోసం ఎంతో కష్టపడుతున్నాడు. ఆయనకు యూఎస్ లో మంచి లైఫ్ ఉన్నా, సినిమా మీద ప్యాషన్ తో టాలీవుడ్ కు వచ్చాడు. ఇలాంటి మంచి చిత్రాన్ని మీరంతా ఆదరిస్తారని కోరుకుంటున్నా. అన్నారు.నటి సాహితీ దాసరి మాట్లాడుతూ థ్రిల్లర్ ఎలిమెంట్స్ తో పాటు మంచి ఎంటర్ టైన్ మెంట్ ఇచ్చే చిత్రమిది. ఈ సినిమాలో నేనొక ఇంపార్టెంట్ రోల్. ఆ క్యారెక్టర్ ఏంటి అనేది ఇప్పుడు రివీల్ చేయలేము. మీరు మా మూవీ ట్రైలర్ చూస్తే కొత్త దర్శకుడు డైరెక్ట్ చేసినట్లు ఉండదు జెమినీ సురేష్ క్యారెక్టర్ కూడా సర్ ప్రైజింగ్ గా ఉంటుంది. యోగేష్ కు సినిమా మీద ప్యాషన్ ఎక్కువ. ఆయన ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డారు. ఫస్ట్ టైమ్ డైరెక్ట్ చేస్తున్న రాజేశ్ గారికి ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. సాహితీ దాసరి కూడా మంచి పాత్రలో మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. అన్నారు. డైరెక్టర్ రాజేశ్ నాయుడు మాట్లాడుతూ ఒక మంచి కథతో, బలమైన స్క్రీన్ ప్లే తో 'త్రిముఖ' చిత్రాన్ని రూపొందించాను. మూవీ ఫస్టాఫ్ అంతా ఎంటర్ టైన్ చేస్తుంది. సెకండాఫ్ తల పక్కకు తిప్పనంతగా ఎంగేజింగ్ గా థ్రిల్లింగ్ గా ఉంటుంది. సినిమాలోని ప్రతి క్యారెక్టర్‌కు ఇంపార్టెన్స్ ఉంటుంది. ప్రతి పాత్ర ఒక మంచి విషయాన్ని తెలియజేస్తుంది. రొటీన్ సినిమాలకు తప్పకుండా భిన్నంగా ఉండేలా ప్రయత్నించాం. యోగేష్ కు నటుడిగా పేరు తెచ్చే మూవీ అవుతుంది. సన్నీ లియోన్ ని ఇప్పటిదాకా గ్లామర్ యాంగిల్ లోనే చూశారు. కానీ ఇందులో చాలా డిఫెరెంట్ క్యారెక్టర్ లో చూస్తారు అని చెప్పారు. హీరో యోగేష్ కల్లె మాట్లాడుతూ 'త్రిముఖ' హీరోగా నా ఫస్ట్ మూవీ. ఈ సినిమా రూపకల్పనలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అడ్డంకులన్నీ దాటుకుని ఈ నెల 30న రిలీజ్ కు తీసుకొస్తున్నాం. కేవలం మా కంటెంట్ నచ్చి ఆయన ఒప్పుకున్నారు. కామెడీ, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్న కథతో ఒక కొత్త ప్రయత్నం చేశాం అని అన్నారు.

## 'జాలి పడేదెవ్వడు' పాట విడుదల

భార్యాభర్తల బంధాన్ని వివిధ కోణాల్లో చూపిస్తూ తెరకెక్కించిన చిత్రం 'పురుష:' బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై బత్తుల కోటేశ్వర రావు 'పురుష:' సినిమాను నిర్మిస్తున్నారు. వీరు వులవల దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతున్నాడు. తాజాగా ఈ చిత్రంలోని థీమ్ సాంగ్ అన్నట్టుగా.. మగాడి మీద జాలి కలిగేలా, మగాడి పరిస్థితిపై సానుభూతి పెరిగేలా 'జాలి పడేదెవ్వడు.. మగాడి మీద జాలి పడేదెవ్వడు' అంటూ సాగే పా టను రిలీజ్ చేశారు. ఈ పాటను ఎం. ఎం. కీరవాణి ఆలపించారు. శ్రవణ్ భరద్వాజ్ సంగీతం సమకూర్చగా, అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్గా సతీష్ ముత్యాల, ఎడిటర్గా కోటి, ఆర్ట్ డైరెక్టర్గా రవిబాబు దొండపాటి వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. అతి త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేయనున్నారు.



## 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'లో సాంగ్ రిలీజ్



పాయల్ రాధాకృష్ణ, త్రిగుణ్, అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని రచన, దర్శకత్వం వహించారు. సీహెచ్ వి ఎస్ ఎన్ బాబ్జీ సమర్పణలో లోటస్ క్రియేటివ్ వరక్స్ బ్యానర్ పై అరవింద్ మండెం నిర్మించారు. అరుణ్ చిలువేరు, ప్రకాష్ చెరుకూరి సంగీతం సమకూర్చారు. తాజాగా ఈ సినిమా యాంథమ్ సాంగ్ ని రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లో కృష్ణుడు వ్యవసాయం చేస్తున్నట్లుగా చూపించిన విధానం మరింత ఆసక్తిని రేకిస్తుంది .ప్రకాశ్ చెరుకూరి అందించిన మ్యూజిక్ సాంగుకు ప్రాణం పోసింది. ఈ పాటను బాలీవుడ్ గాయకుడు బాబా సెహగల్ పాడారు. అరవింద్ మండెం సాహిత్యం అందించారు. వ్యవసాయం ప్రాముఖ్యతను మట్టి వాసనతో పాటు ఆధునిక టెక్నాలజీ టచ్ కలిపి పవర్ఫుల్గా ప్రజెంట్ చేయడంలో ఆయన లిరిక్స్ కీలక పాత్ర పోషించాయి. ఈ పాట యూత్తో పాటు ప్రతి వర్గం ఆడియన్స్కు కనెక్ట్ అయ్యేలా తెరకెక్కించారు. ఈ చిత్రానికి రవికుమార్ డీవోపీ, ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకులు ముందుకు రానుంది.

## ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాస్వామిక, గణతంత్ర, లౌకిక, సామ్యవాద, సార్వభౌమ దేశంగా భారత దేశం ప్రగతి పథంలో దూసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఆధారమైన రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నేడు దేశ ప్రజలందరికీ పండుగ వంటిదన్నారు. జాతీయోద్యమ నాయకులు, రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షలకు అనుగుణంగా అనేక అభివృద్ధి, సంక్షేమ, ప్రజాహిత కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.







## సమాజం మార్పు దిశగా అడుగులేయాలి



### ప్రతి ఒక్కరికీ చట్టాలు, హక్కులపై అవగాహన తప్పనిసరి

### ఐఎన్‌హెచ్ఆర్‌పిసి క్యాలెండర్ వార్షికోత్సవంలో జస్టిస్ చంద్రకుమార్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రోజురోజుకు విలువలు పడిపోతున్న తరుణంలో సమాజం మార్పు దిశగా అడుగులు వేయాలని జస్టిస్ చంద్రకుమార్ సూచించారు. గ్రామస్థాయి నుంచి ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని, అప్పుడే హక్కుల పరిక్షణతోపాటు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించగలమన్నారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ (ఐఎన్‌హెచ్‌ఆర్‌పిసి) –2026 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది పుట్ట పద్మారావు, జెఎన్‌టియు, ఒయు ప్రొఫెసర్లు బిట్ల ప్రభాకర్, బి. క్రాంతి కిరణ్, వెంకట్‌దాస్, సిబిఐటి ముఖ్యసలహాదారులు ఎం.స్వామి దాస్‌లతో కలిసి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం అందించిన హక్కులను ప్రజలు తెలుసుకొని న్యాయ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. అసమానతల్లేని సమాజ నిర్మాణానికి పాటుపడాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. క్రిమినల్ ప్రోసీజర్ కోడ్, కస్టడీ, అరెస్టు వంటి అంశాలపై ప్రజలు తెలుసుకోవాలని, అప్పుడే అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం కలుగుతుందన్నారు. పాలకులు ప్రజలు జీవించే హక్కును కాలరాస్తున్నారని మండిపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్నా, ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అవుతున్నా ఇంకా 8 కోట్ల మంది బాల కార్మికులు ఉండటం సిగ్గుచేటన్నారు. కేంద్రం లక్షల ఎకరాలను అదానీ కార్పొరేట్ కంపెనీలకు దారాధాత్తం చేస్తూ దేశాన్ని లూటీ చేస్తుందని ధ్వజమెత్తారు. ప్రజలకు హక్కులపై చైతన్యం చేసేలా ఐఎన్‌హెచ్‌ఆర్‌పిసి కృషిచేయాలని సూచించారు. ఐఎన్‌హెచ్‌ఆర్‌పిసి రాష్ట్ర చైర్మన్ నవోదయ సిద్ధు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం నిలకడగా కొనసాగాలంటే మానవ హక్కుల పరిరక్షణ అత్యంత కీలకమన్నారు. మానవ హక్కులపై అవగాహన లేకపోవడం వల్లే అనేక అన్యాయాలు జరుగుతున్నాయని, అందుకే గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. సమావేశంలో ఐఎన్‌హెచ్‌ఆర్‌పిసి రాష్ట్ర కో–ఆర్డినేటర్ డా.డిగ్గే బాబు, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు వి.మోహన్‌రావు, కార్యదర్శులు తలారి కుమార్, సలహాదారులు ప్రశాంత్ గాంధీ, కార్యదర్శి సయ్యద్ ఫెరోజ్, సహాయ కార్యదర్శులు ఎ.ప్రదీప్ కుమార్, అందోల్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ఒక ఆయుధం

### ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కేవలం ఒక పవిత్రమైన హక్కు మాత్రమే కాదు, అది ప్రతి పౌరుడి బాధ్యత అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో 'నూతన ఓటర్ల సమ్మేళనం' నిర్వహించారు. తొలిసారి ఓటు హక్కు పొందిన యువతీ యువకులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడుతూ.. అమెరికాలో అబ్రహాం లింకన్, భారతదేశంలో నరేంద్ర మోదీ వంటి సామాన్య వ్యక్తులు అత్యున్నత పదవులను అధిష్టించడమే బ్యాలెట్ శక్తికి నిదర్శనమన్నారు.










Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com